లఘు గ్రంథాలు

# ప్రపంచ తెలుగు మహాసభలు

27 - 29, డిసెంబరు, 2012

# తెలుగు శతకాలు


రచన

జి. గిరిజా మనోహరబాబు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

పొట్టి శ్రీరాములు

తెలుగు విశ్వవిద్యాలయం

Blank Page

లఘు గ్రంథాలు

# తెలుగు శతకాలు

## జి. గిరిజా మనోహరబాబు

ప్రపంచ తెలుగు మహాసభలు

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం
హైదరాబాద్

**తెలుగు శతకాలు**

**రచయిత** : జి. గిరిజామనోహరబాబు

**ISBN** : **81-86073-324-9**

**© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం**

ప్రచురణల సంఖ్య: 461

వెల : **రూ. 20/-**

ప్రతుల సంఖ్య : **5000**

ముద్రణ : **డిసెంబరు, 2012**

ప్రతులకు : **సంచాలకులు**
ప్రచురణల విభాగం,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 500 004.

---

ముద్రణ : **చరిత ఇంప్రెషన్స్**, అజామాబాద్, హైదరాబాదు

యస్. కిరణ్ కుమార్ రెడ్డి | హైదరాబాదు

ముఖ్యమంత్రి
ఆంధ్రప్రదేశ్



# నాంది

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక్క వేదిక పైకి తీసుకు వచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2012 డిసెంబర్ 27 నుండి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్య క్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగు వారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకుంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికో ఈ మహా సభలు ఎంతగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ మహాసభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాన్ని ఎలా మెరుగుపరచాలీ, తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలీ అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవ వైవిధ్య సదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారత దేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశ విదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్వలమైన సభల నిర్వహణకు పూనుకొంది. ఈ సభలలో సదస్సులు, తెలుగు వారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితా కళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు, మొదలైన ఎన్నో అంశాలతో పాటు పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతుంది.

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహాసభల సందర్భంగా ప్రచురించే లఘు గ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాం.

**(ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి)**

ముఖ్యమంత్రి

**V. VASANT KUMAR,** B.Sc.,(Ag.),M.B.A.
Minister for Tourism & Culture, Archeology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C
Government of Andhra Pradesh

Room No.501, 5th Floor,
J-Block, A.P. Secretariat,
Hyderabad-500 022.
Phone : 040-23454168, 23450541
Fax : 040-23450899



# ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తర్వాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు. మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింప జేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచు కునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగు వారి సంస్కృతి బహుముఖీనమైంది. అందులో భాష, సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకుని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే "ప్రపంచ తెలుగు మహాసభల" నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల ముద్రణ,

వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి. అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటి కప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే" ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి, పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, తెలుగు అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వ సిస్తున్నాను.

వ. వసంతకుమార్

**(వట్టి వసంతకుమార్)**

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్-500 004.

# నివేదన

ఇన్నేళ్ళ తరువాత ప్రపంచ తెలుగు మహాసభలు జరగడం తెలుగు భాషా సాహిత్యాభిమానులకు, సంస్కృత ప్రియులకు, వివిధ రంగాలలో నిష్ణాతులైన మేధావులకు ఆనంద ప్రదమైన అంశం. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ఉత్తేజం తోనే 1985లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆవిర్భవించింది. తెలుగు విశ్వ విద్యాలయం ఈ రాష్ట్రంలోను, భారత దేశంలోను, విదేశాలలోను ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించింది. భాషా సాహిత్య సంస్కృతుల్ని దృష్టిలో ఉంచుకొని అనేక గ్రంథాలను వెలువరించింది. తెలుగు విశ్వవిద్యాలయం అప్పటి సాహిత్య అకాడమీ నిర్వహించిన పాత్రను చాలా వరకు బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నది. విస్తరణ సేవా విభాగాన్ని అకాడమీల విభాగంగా మార్చి దానికి సంబంధించిన కార్యక్రమాలను చేపడుతున్నది. నిధుల కొరత వల్ల కొన్ని కార్యక్రమాలను అనుకున్న స్థాయిలో చేయలేకపోతున్నాం.

ఈ నాలుగవ ప్రపంచ మహాసభల సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలయం తన వంతు బాధ్యతను స్వీకరించింది. భారత దేశంలో పదిచోట్ల సన్నాహక సభలు ఇప్పటికే అధిక భాగం నిర్వహించింది. 1975లో మహాసభల సందర్భంగా ప్రచురించిన 30 లఘు గ్రంథాల్ని పునర్ముద్రిస్తున్నది. మరొక 50 గ్రంథాలను ప్రత్యేకమైన అంశాలమీద రాయించి ఈ మహాసభల సందర్భంగా విడుదల చేస్తున్నది. ఆయా రంగాలలో నిష్ణాతులైన వారిచేత ప్రామాణిక గ్రంథాలను రాయించాలన్నది మా విశ్వవిద్యాలయం ఆశయం. నిజంగా ఇంత స్వల్ప సమయంలో గ్రంథ రచన చేసి సహకరించిన రచయితలకు మా ధన్యవాదాలు. ఈ గ్రంథాల ప్రచురణకు ఆర్థిక సహకారం అందించిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి గౌరవనీయులు మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గారికి, సాంస్కృతిక శాఖామాత్యులు, మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి, సంబంధిత ప్రభుత్వాధికారులకు మా విశ్వవిద్యాలయం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పరంపరలో "తెలుగు శతకాలు" అనే అంశం మీద చిరు గ్రంథాన్ని సకాలంలో వ్రాసి యిచ్చిన జి. గిరిజామనోహరబాబు గారికి ధన్యవాదాలు. గ్రంథముద్రణ కార్యక్రమంలో చేదోడు వాదోడుగా ఉన్న విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కె. ఆశీర్వాదం గారికి, ఆచార్య సి.మృణాళిని గారికి, ఆచార్య డి. మునిరత్నం నాయకుడు గారికి అభినందనలు.

(ఎల్లూరి శివారెడ్డి)

# తెలుగు శతకాలు

## మూలాలు–నేపథ్యం

# శతకమూలాలు–నేపథ్యం

**శ్రీమయ రమ్యకావ్యవనసీమ సుమించె కవిత్వసూనముల్**
**ధామములయ్యెనందు బహుధా యశమందుచు ముక్తకమ్ములై**
**భ్రామరగీతికా విధిని వర్ధిలి పెక్కులు శాఖలౌచు వా**
**గ్వామకు హారమై శతక వాఙ్మయ మొప్పెమనోహరంబుగా**

**– మద్దూరి రామమూర్తి**

తెలుగు శతకాల్ని తెలుసుకునే ముందు దాని మూలాలను తెలుసుకోవలసిన అవసరం ఉంటుంది. సాధారణంగా ఏ తెలుగు సాహిత్య ప్రక్రియకైనా, ముఖ్యంగా ప్రాచీన సాహిత్య ప్రక్రియల మూలాల విషయం వచ్చినప్పుడంతా సంస్కృత, ప్రాకృత సాహిత్యంపై దృష్టి పెట్టడం తప్పదు. సంస్కృత ప్రాకృత సాహిత్యాలను పరిశీలించి చూస్తే, శతకాల మూలాలు వైదిక సాహిత్యంలోనూ, సంస్కృత ప్రాకృత సాహిత్యంలోనూ కనిపిస్తుంటాయి.

మనకు వేదాలతో తొలిసాహిత్య ఆవిర్భావం జరిగినట్లుగా పెద్దలు పేర్కొంటుంటారు. వేదాల్లో కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే అక్కడక్కడా ఈ శతక మూలాలను మనం గమనించవచ్చు.

సాధారణంగా వేదాల్లో దేవతాస్తుతి, ప్రకృతి వర్ణనల సందర్భాలోని కొన్ని కొన్ని మంత్రాలలో శతక లక్షణాలు ద్యోతకమవుతూ ఉంటాయి.

ఒకే విధమైన **ఛందస్సు**ను ఉపయోగించడం, **మకుట** నియమాన్ని పాటించడం వంటి అంశాలు మనకు వేదాల్లో కనిపిస్తున్నాయి. సంపూర్ణంగా మనం భావిస్తున్న శతక లక్షణాలు లేకపోయినా ఆ ఛాయలు వీటిలో కనిపిస్తాయి. ఋగ్వేదంలో ఒక మంత్రం ఉంది

**హిరణ్యగర్భస్సమవర్తతాగ్రే**
**భూతస్య జాతః పతిరేక ఆసీత్**
**సదాధార పృథివ్యాం ద్యాముతేమాం**
**కస్మై దేవాయ హవిషా విధేమ (10-121)**

సృష్టికి మూలమైన ప్రజాపతిని స్తుతిస్తూ **'హవిస్సు'**ను ఇచ్చే మంత్రం ఇది. ఇక్కడ ఎనిమిది మంత్రాలు ఒకే ఛందస్సులో చెప్పబడ్డాయి. అది **త్రిష్టుప్ ఛందస్సు.** పైగా **'కస్మై దేవాయ హవిషా విధేమ'** అనే చివరి పాదం అన్ని మంత్రాల్లోనూ చివరి పాదమే. ఇది ఒక రకంగా మకుట నియమం వంటిదే అని చెప్పవచ్చు. ఈ మంత్రాలే కృష్ణ యజుర్వేదంలోనూ, అథర్వవేదంలోనూ కూడా కనిపిస్తున్నాయి.

అంతేకాదు నీటి ప్రాశస్త్యం చెపుతూ, నీటి స్వరూప స్వభావ శక్తులను ప్రస్తావిస్తూ ఒక మంత్రం ఉంది.

**హిరణ్యవర్ణాశ్శుచయః పావకాః యా సుజాతః**
**కశ్యపో2యాస్విన్ద్రః అగ్నిం యా గర్భందధిరే**
**విరూపాః తాన ఆపః శగ్గ్స్యోనా భవన్తు...**

(కృష్ణ యజుర్వేద సంహిత 5 కాండ)

ఇక్కడున్న మూడు మంత్రాల (6 ప్రశ్న.) లోని చివరి పాదం శతకాల్లోని మకుటం వలె సమానంగా ఉంటుంది. అదే విధంగా

**సముద్రజ్యేష్ఠాత్ సలిలస్యమధ్యాత్**
**పునా నాయన్ త్యని విశమానాః**
**ఇన్ద్రో యా వజ్రి వృషభోరరాదు**
**తా ఆపో దేవీ రిహమామవన్తు** – ఇది కూడా మకటం కలిగి ఉన్న మంత్రమే. యీ నియమం ఇక్కడి మంత్రాల్లో మనకు కనిపిస్తున్నది. ఇవన్నీ **త్రిష్టుప్ ఛందస్సు**లోనే ఉన్నాయి.

**అగ్నిరాయుష్మాన్...** అంటూ నామకరణ సమయాల్లో చదివే ఐదు మంత్రాల్లోనూ **'ఆయుష్మంతం కరోమి'** అనే పాఠం మకుటంగా కనిపిస్తుంది. ఇవి కృష్ణయజుర్వేద మంత్రాలు.

అన్నప్రాశన సమయంలో **"భూరపాంత్వోషధీనాగ్ం రసం ప్రాశయామి"** అనే మంత్రాలలో **'భూః, భువః, సువః, మహః, భూర్భువస్సువః'** అనే పంచ వ్యాహృతులు మినహా మిగిలినదంతా ఒకే విధంగా కనిపిస్తుంది.

జాగ్రత్తగా పరిశీలిస్తే అనేక వేదమంత్రాల్లో శతకం మూలాలు కనిపించే అవకాశం ఉంది.

వేద వాఙ్మయానంతరం మనము సంస్కృత వాఙ్మయాన్ని కూడా పరిశీలిస్తే **'శతకం'** ప్రసక్తి కనిపిస్తుంది. వేదాల్లో **'శతకం'** అనే మాట ప్రత్యక్షంగా కనిపించకపోయినా, సంస్కృత సాహిత్యంలో మాత్రం ఈ మాట పలుచోట్ల ఉపయోగించడం మనం చూడవచ్చు.

## సంస్కృతంలో శతకం ప్రసక్తి

తెలుగు సాహిత్య సంబంధమైన విషయం వచ్చినప్పుడల్లా సంస్కృత సాహిత్య ప్రసక్తి తీసుకొనిరావడం సర్వసాధారణం. దానికి కారణం సాహిత్య జిజ్ఞాసువులకు తెలిసిందే.

శతకం ప్రసక్తిని గురించి దీని పూర్వాపరాల్ని గురించి కూడా చర్చించే సందర్భంలో కొంత సంస్కృత సాహిత్యాన్ని గురించి కూడా యోచించాలి.

శతకాన్ని గురించి స్పష్టంగా పేర్కొన్న తొలి వ్యక్తి **'అమృతానందయోగి'** అనే సంస్కృత ఆలంకారికుడు. ఇతడు రచించిన **'అలంకార సంగ్రహము'** పదమూడవ శతాబ్ది నాటిది కావచ్చునని విమర్శకులు భావించినారు. ఇందులో పదకొండు పరిచ్ఛేదాలున్నాయి. పదకొండవ పరిచ్ఛేదములో చాటు ప్రబంధాలను గురించి ప్రస్తావన చేయు సందర్భములో- **"శతేన శతకం ప్రోక్తం అష్టోత్తర శతం పరమ్"** అంటూ 'శతక' పదాన్ని ప్రయోగించాడు. అప్పటికే సంస్కృతాంధ్రములలో నున్న స్తోత్రసాహిత్యాన్ని దృష్టిలో ఉంచుకొని **అమృతానందుడు** ఈ పదమును ఉపయోగించి ఉండవచ్చునని విమర్శకుల అభిప్రాయము.

**అమృతానందయోగి**కి పూర్వము దీన్ని గురించిన ఆలోచనలు కొనసాగలేదా? అన్నది ప్రశ్న. అయితే ప్రాచీన సంస్కృత ఆలంకారికులెందరో వివిధ రీతుల్లో ఈ విషయాన్ని ఉల్లేఖించినా స్పష్టంగా ఇది నూరు పద్యాలతో కూడుకున్న శతకంగా మాత్రము పేర్కొనలేదు.

ఆరో శతాబ్దివాడైన భామహుడు **'అనిబద్ధకావ్యము'**గా ఈ పద్ధతిని ప్రస్తావించాడు. ఇది సర్గబంధము లేని కావ్యము గనుక ఈ పేరుతో ప్రస్తావించి ఉండవచ్చు. ఏడో శతాబ్దివాడైన **'దండి' 'ముక్తకము, కోశము, కులకము, సంఘాతము'** మొదలైన పేర్లతో

దీనిని ప్రస్తావించాడు. **అగ్ని పురాణం**లోనూ ముక్తకముల ప్రసక్తి ఉంది. శతకాల పూర్వరూపం ముక్తకమే కావచ్చునన్నది విమర్శకుల ఆలోచన. **వాగ్భటుడు** ముక్తకములను సంఖ్యామూలక వర్గీకరణము చేసినట్లు తెలుస్తున్నది.

**విద్యానాథుడు** తన **ప్రతాపరుద్రీయము**లో కావ్యభేదాలను గురించి వివరిస్తూ ఉపకావ్యము'ను గురించి పేర్కొన్నాడు. ఇది శతకమే కావచ్చునన్నది కొందరి ఆలోచన. దాన్ని వ్యాఖ్యానించిన వ్యాఖ్యాత దీనిని **'అనుసర్గబంధబు'**గా పేర్కొన్నాడు.

సంస్కృత భాషలో విస్తృతంగా వచ్చిన స్తోత్ర సాహిత్యాన్ని సాహిత్య విమర్శకులు శతక సాహిత్యపు కోవలోనిదిగానే పరిగణించారు. **కృష్ణాష్టకమ్, చంద్రశేఖరాష్టకమ్** వంటి ఎన్నెన్నో స్తోత్రాల్లో చాలా శకత లక్షణాలు కనిపిస్తున్నట్లు భావించారు.

**'శత'** సంఖ్యను గుర్తుచేసే **భర్తృహరి సుభాషిత త్రిశతి, నీలకంఠ దీక్షితుల 'కలివిడంబన** శతకం, మూక కవి మూక పంచశతి మొదలైన రచనలన్నీ శతకసాహిత్యంలో భాగంగానే సంస్కృత సాహిత్య చరిత్రకారులు గుర్తించారు. వీటిల్లో భక్తి, దైవ స్తోత్రాలతో బాటు, సమాజానికి అవసరమైన ఎన్నో ధర్మాలు కూడా బోధింపబడ్డాయి.

భారతీయులు సంఖ్యకు ఎంతో ప్రాముఖ్యాన్ని ఇచ్చారు. అందుకే సాంఖ్య దర్శనం వంటివి ఈ దేశంలో వెలుగుచూశాయి. సంస్కృత సాహిత్యంలో సంఖ్యకు ఉన్న ప్రాధాన్యం బలమైనది గనుక **విష్ణు సహస్రనామాలు, శివసహస్ర నామాలు, ఇంద్రీసాహస్రి** వంటి రచనలు ప్రఖ్యాతి పొందాయి. క్రమంగా అనంతానికి సంకేతమైన సహస్రం నుండి అష్టోత్తరంగా స్థిరపడ్డం కారణంగా అష్టోత్తర శత నామాలు వెలువడ్డాయి. శతక ప్రక్రియకు ఇక్కడ మూలం ఉన్నట్టుగా శతక సాహిత్య పరిశోధకులు భావించారు. తెలుగు శతకాల్లో ఈ సంఖ్యే ఎక్కువగా స్థిరపడింది. అయితే సంస్కృత శతకాల్లో మకుట నియమం వంటివి ఎక్కువగా పాటింపబడలేదు. అక్కడక్కడా స్తోత్ర సాహిత్యంలో ఈ నియమాలు కనిపించినా అవి తప్పనిసరిగా పాటింపక పోవడం మనం చూడవచ్చు.

నామస్మరణానికి మూలమైన స్తుతి వాఙ్మయం శతకానికి పునాదిగా భావించారు విమర్శకులు. నామ సంకీర్తనమే కలిలో ముక్తిదాయకమని ఆ వైపే దృష్టి సారించి స్తోత్ర సాహిత్యాన్ని సంస్కృత కవులు సృష్టించి ఉండవచ్చునన్నది పండితుల భావన.

ఇది శతకానికి మూలం కావడం యాదృచ్ఛికమేమీ కాకపోవచ్చు.

ప్రతి ప్రాచీన సాహిత్య సృజన మూలాలు మనకు సంస్కృతంలో కనిపించడం తప్పనిసరి. అందుకే శతకం మూలాలను గురించి కూడా సాహిత్య విశ్లేషకులు అన్వేషించి పలు విషయాల్ని వెల్లడించారు.

## తెలుగు సాహిత్యం - శతక ప్రారంభం

తెలుగులో శతకాల్ని గురించిన ఆలోచన రాగానే ఆదికవి **నన్నయ** దగ్గరకు వెళ్ళి ఆయన రచనల్ని పరిశీలిస్తే మహాభారతానువాదంలోని **'నాగస్తుతి'** పద్యాలలోని ప్రతిపాదం చివర కనిపించే **'మాకు ప్రసన్నుదయ్యెడున్'** అనే వాక్యం **'మకుట'** నియమానికి మూలమని భావించారు. **నన్నెచోడ కవి 'కుమార సంభవ'** కావ్యంలో **'దారిద్ర్యవిద్రావణా'** అనే మకుటంతో కనిపించే స్తుతి పద్యాలను కూడా శతకం యొక్క తొలి రూపంగానే సాహిత్య చరిత్రకారులు గుర్తించారు.

తెలుగు శతకానికి ఏర్పరచుకున్న అనేకానేక నియమాల్లో ప్రధాన నియమమైన **'మకుట'** నియమానికి మాత్రం ఇక్కడే మూలం ఉందని భావించారు.

శతకం ప్రారంభమైంది భక్తి భావాలను వినిపించడానికే కావచ్చు, కాని ప్రారంభపు తొలినాళ్ళలోనే శతకసాహిత్యం రెండు ప్రధానమైన పాయలుగా కనిపిస్తుంది. దైవస్తుతి, మానవ వికాసము ఈ రెండూ శతకం ప్రారంభంలోనే మూలాలుగా నిలిచాయి. మానవ వికాసానికి అవసరమైన మానవ ప్రవర్తనలు, మానవ ధర్మాలు వీటిని గురించిన చర్చలు శతక విస్తృతిలో ప్రధానమై నిలిచాయి.

తొలి భక్తి శతకం వెలువడిన కాలానికి సమీపకాలంలోనే నీతిని ప్రధానం చేసుకున్న **'సుమతి'** శతకం వంటివి కూడా వెలువడడమే దీనికి ప్రబల ఉదాహరణం. మానుష భావదీప్తికి, భావ వ్యాప్తికి శతకం ఒక ప్రధాన ఆకరంగా మారింది. ఆ పాయల్లో శక్తివంతమైన ఒక పాయగా ఇది నిలిచింది.

ప్రధానంగా ద్విధాప్రవహించిన శతక వాహిని గొప్ప గొప్ప శతకాల సృష్టికి కారణమైంది. ఈ రెండు మార్గాలు నేటికీ సజీవంగా నిలిచి పాఠకుని చైతన్య విస్తృతికి మూలభూతమై నిలిచాయి.

**వృషాధిప శతకం, నారాయణ శతకం, కాళహస్తీశ్వర శతకం, దాశరథీ** శతకం వంటివి ఒక మార్గాన్ని పరిపుష్టం చేస్తే, **సుమతీ శతకం, వేమన శతకం, పెమ్మయ సింగధీమణీ శతకం, గువ్వలచెన్న** శతకం మరో మార్గాన్ని పటిష్ఠం చేశాయి.

కాలక్రమంలో పలు మార్గాల్లో శతకం విస్తరించింది. వైవిధ్యం పెరిగింది. సంస్కృతంలోని మూలాలను తాను క్రమబద్ధీకరించుకుని స్వతంత్రంగా ఎదిగి ఒక పరిణత ప్రక్రియగా నిలిచి నేటికీ తన స్వత్వాన్ని నిలుపుకొన్న గొప్ప ప్రక్రియ తెలుగు శతకం.

ప్రారంభం నుంచే వైవిధ్యాన్ని సంతరించుకొని నిలిచిన తెలుగు శతక వైశిష్ట్యం ఇంత అని మనం చెప్పడానికి వీలు లేనంతగా విస్తృతి చెందింది. వేలాది శతకాలకు పునాదిగా పటిష్ఠమైన ప్రారంభాన్ని చేసిన తెలుగు శతకం విలువైనదిగా భాసించి ప్రతి మనిషి వ్యక్తిత్వానికి గొప్ప వికాసాన్ని, ప్రతి మనిషి అంతరంగాన్ని పరిశుద్ధం చేయగలిగే భక్తిని అందించింది. ఇది సాహిత్య చరిత్రలో శుభపరిణామం.

**తెలుగు శతకం స్వరూప స్వభావాలు - నియమనిబంధనలు:**

తెలుగువాళ్ళు మూలాల్ని ఇతర భాషల్లో నుండి గ్రహించినా, దాన్ని అనేక నియమాలతో కట్టడి చేసి అందించే పనిలో నిష్ణాతులు అనిపించుకున్నారు. యతి, ప్రాసల విషయంలో గమనిస్తే సంస్కృత, కన్నడ భాషల్లోని నియమాలను తమ స్వంతం చేసుకోవడమే గాక మరింత కఠినతరం చేసి తెలుగు పద్యాన్ని గొప్పగా నిలిపినట్లు అర్థమవుతుంది.

ఈ మార్గంలో వెలిసిందే తెలుగు శతకం. సంస్కృత నియమాల్ని పాటిస్తూనే, వాటిని మరింత కఠినతరం చేయడం మన తెలుగు శతకాల్లో గమనింపవచ్చు.

సంస్కృతంలో అక్కడక్కడా పాటించిన **'మకుట'** కన్నడాల నియమాన్ని తెలుగుశతకం **'విధిగా'** పాటించాలన్నది ఒకటి, వృత్తం విషయంలో మొత్తం శతకాన్ని ఒకే ఛందంలో కొనసాగించాలన్నది మరో నియమంగా భావించారు. దాదాపుగా తెలుగు శతకాలను యీ నియమాల్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా పాటించాయి. నేటికీ పాటిస్తున్నాయి.

తెలుగులో తొలినాళ్ళలో వెలువడిన **మల్లికార్జున పండితారాధ్యులు** వారు రచించిన **'శివతత్త్వసారము'**ను **'శతకంబు శివతత్త్వసారంబు'** అని చెప్పిన పద్యాన్ని బట్టి దీన్ని

తొలిశతకంగా పలువురు గుర్తించారు. కాని శతకం ఏర్పరచుకున్న పలు నియమాలు ఇందులో లేవు. ముఖ్యంగా మకుట నియమం లేదు.

**శ్రీపతివాక్పతి ముఖ్య మ**
**హా పురుషులు నెఱుగనోపరతివాఙ్మానస**
**వ్యాపారమైన నీ నిజ**
**రూపము నేనెట్టిదని నిరూపింతుశివా!**

అంటూ చెప్పిన పద్యాల్లో **'శివా', 'రుద్రా', 'మహేశా',** వంటి మకుటాలున్నాయి. ఏకరూప మకుటం లేదు. తొలిశతక స్వరూపం ఇట్లా వుంది. సంఖ్యానియమం కూడా లేదు.

**'నిర్బంధాలు తెలుగువాళ్ళ అందాలు'** అన్నట్లుగా అన్ని నియమాల్ని పాటిస్తూ మొట్టమొదటిగా వెలువడిన తెలుగుశతకం **పాల్కురికి సోమనాథుని వృషాధిప శతకం.**

**బలుపొడ తోలుసీరయును, పాపసరుల్ గిలుపారుకన్ను వె**
**న్నెల తల సేదుకుత్తుకయు, నిండిన వేలుపుటేఱు, వల్గు పూ**
**సలు గలతేనిలెంకవని జానుతెనుంగున విన్నవించెదన్**
**వలపుమదిందలర్ప బసవా! బసవా! బసవా! వృషాధిపా!'**

ఇందులో మకుటంగా నిలిచిన **'బసవా! బసవా! బసవా! వృషాధిపా!** అనే వాక్యం శతకంలోని అన్ని పద్యాల్లోనూ మకుటంగా నిలిచి వెలిగింది. సంఖ్యానియమం విషయంలోనూ, వృత్తనియమం విషయంలోనూ మొట్టమొదట వచ్చిన సంపూర్ణమైన తెలుగు శతకం ఈ **వృషాధిపశతకమే.**

తొలి శతకకర్తగా **పాల్కురికిని** భావించినా **శివతత్త్వ సారాన్ని** అందించిన **మల్లికార్జునుడు కూడా శ్రీగిరి మల్లికార్జున శతకం** కూడా రచించినట్లు తెలియుచున్నది. కొన్ని లక్షణ గ్రంథాలలో ఇందులోని పద్యాలు ఉదాహరింపబడినాయి. **'శ్రీ గిరి మల్లికార్జునా!'** అనే మకుటం ఇందులో ఉన్నట్లుగా చెప్పారు.

## శతక లక్షణాలు - విధానాలు

సంస్కృత ప్రాకృతాల నేపథ్యం, కన్నడాది సోదర భాషల సాహచర్యంతో ఒక నిర్దిష్టమైన విధానంతో తెలుగు శతకం సాహిత్య రంగంమీద అవతరించింది. తొలినాళ్ళ తెలుగు శతకానికి కొన్ని నియమాలు వర్తించకపోయినా అతి త్వరగా ఒక ప్రత్యేకతను, ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెలుగు శతకం సాధించుకుంది.

పరిపూర్ణమైన లక్షణాలతో అవతరించిన తొలితెలుగు శతకంగా **పాల్కురికి సోమనాథుని వృషాధిప శతకం** నిలుస్తున్నదని సాహిత్య వేత్తలు భావించారు. తొలిశతక ప్రక్రియ ప్రారంభనేపథ్యం, మూలం ఎక్కడివైనా కొన్ని ప్రత్యేక పద్ధతుల్లో తెలుగు శతకం ఎదిగి వృద్ధిచెంది విస్తరించింది.

మొట్టమొదట తెలుగు శతకాన్ని ప్రకాశింపజేసింది మకుటనియమం. **'మకుటం'** అంటే కిరీటం అన్న అర్థం అక్షరాలా వర్తించి పద్యానికి అది నిజంగానే మకుటమై నిలిచింది. ఈ మకుట నియమ ప్రారంభాన్ని గురించి నేపథ్యంలో కొంత చర్చించుకున్నాము. మకుటం ఒకపదం గానూ, లేదా రెండు మూడు పదాల సమాహారంగాను, ఒక్కోసారి ఒక్కోపూర్తి పాదంగాను శతక కవులు నియమించుకున్నారు. వారు ఎన్నుకున్న ఛందస్సును అనుసరించి ఈ నియమాన్ని పాటించారు. సీస పద్యాల శతకంలో చివరి ఎత్తుగీతిలోని రెండు పాదలనూ మకుటం చేసిన కవులు కూడా లెక్కకు మిక్కిలి ఉన్నారు.

**"చిత్ర చిత్ర ప్రభావ! దాక్షిణ్యభావ!**
**హత విమతజీవ! శ్రీకాకుళాంధ్రదేవ!"**
**"భూషణవికాస! శ్రీధర్మపురి నివాస!**
**దుష్టసంహార! నరసింహ! దురితదూర!"**
**"మదరిపు విఫాల మునిజన హృదయలోల!**
**వేణుగోపాల భక్త సంత్రాణ శీల!"**
**"భూనుత విలాస! పీఠికా పురనివాస!**
**కుముద హితకోటి సంకాశ! కుక్కుటేశ!"**
**"ప్రణవ సుమదామ! నిగమ పరాగసీమ!**
**సప్తగిరి ధామ! కలియుగ సార్వభౌమ!"**

ఈ విధంగా పూర్వం నుండి నేటి రచయితల వరకు సీసపద్యంలోని చివర రెండు పాదాలను మకుటంగా మలచిన కవులు ఎందరో ఉన్నారు.

కొన్ని కొన్ని వృత్త పద్యాలలో చివరిపాదం మొత్తంగా మకుటం చేసిన కవులు, అందులోని కొంత భాగాన్ని మకుటంగా ప్రయోగించిన కవులు ఉన్నారు. అందులోనూ అనేక విషయాలు పొందుపరచి కవులు తమ ప్రతిభను ప్రదర్శించారు. **'వరంగల్**

**పాలికా! కాళికా!' (డా. రాళ్ళబండి కవితాప్రసాద్)** వంటి వృత్త పద్యాల మకుటంలో యతిస్థానంలో సున్నాతో గూడిన 'గ' కారం (ంగ) ఉంది. గనుక శతకంలోని నూరు పద్యాల్లోనూ నాల్గోపాదపు మొదటి అక్షరం **క, ఖ, గ, ఘ, జ, మ** అనే అక్షరాలకు సంబంధించిన పదాలు మాత్రమే ప్రయోగించాలి. ఇందులో కవి శబ్దశక్తి బహిర్గతం అవుతుంది.

ఇట్లాంటి ప్రయోగాలే కాకుండా ఒకేరకమైన ప్రాసాక్షరం వచ్చేవిధంగా ఆయా పాదమకుటాన్ని ఉపయోగించిన ప్రతిభామూర్తులైన తెలుగు శతకకవులు మనకు తెలుగు సాహిత్యంలో కనిపిస్తారు. సాధారణంగా మకుటం తమ ఇష్టదైవాన్ని సంబోధించే విధంగానో, సమాజానికి సంబంధించిన వ్యక్తిత్వం కలిగిన వారిని సంబోధించినట్లు గానో, ఆత్మ సంబోధనలతోనో కవులు ప్రయోగిస్తుంటారు. **వృషాధిపా!, సర్వేశ్వరా!, శ్రీకాళహస్తీశ్వరా!, నారాయణా!, వేంకటేశ్వరా!** వంటివి దైవ సంబంధమైనవి అయితే, **సుమతీ!, కుమారా! గువ్వలచెన్నా!, సిరిసిరిమువ్వా!, 'పిల్లీ!'** మొదలైనవి ఇతరములు మకుటాన్ని కవులు తమ తమ అభీష్టాలకు అనుగుణంగా, తమ రచనా ప్రయోజనానికి అనుకూలంగా ఉపయోగించుకున్నారు.

**'విశ్వదాభిరామ! వినురవేమ!', 'నవయుగాల బాట! నార్లమాట!'** వంటి మకుటాలు పద్యంలోని ఒక పూర్తిపాదాన్ని ఆక్రమించినా మిగిలిన మూడు చిన్న పాదాల్లోనే అతి పెద్ద విషయాల్ని కవులు పొందుపరచి తమ ప్రతిభను చాటుకున్నారు.

మకుటం విషయంలో తెలుగు శతక కవులు కనబరచిన ప్రతిభ అసాధారణం. చూడటానికి ఇది చాలా చిన్న విషయంగానే పైకి కనిపించినా, కవులు చూపించిన ప్రతిభను గమనిస్తే మకుటనియమానికి వారెంత ప్రాధాన్యాన్ని ఇచ్చారో అర్థమవుతుంది.

తెలుగు శతకాల్లో మకుట నియమం తర్వాత ప్రాధాన్యం వహించేది ఛందోనియమం. సాధారణంగా శతకాల్లో ఏదైనా ఒకే ఛందంలో వందపద్యాల్ని కొనసాగించడం ఆనవాయితీ.

ఛందోవైవిధ్యం ఎంత విస్తృతంగా మనకు కనిపిస్తుందో అంత విస్తృతి శతకాల స్వరూపాల్లో కనిపిస్తుంది. కొన్ని వృత్తాల శతకాలైతే కొన్ని సీసపద్య శతకాలు కొన్ని ఆటవెలది తేటగీతులున్న శతకాలైతే కొన్ని కందం, మత్తకోకిల, వంటి మరో భేదం ఉన్న శతకాలు. తమతమ అభిరుచుల్ని బట్టి కవులు తమ కిష్టమైన ఛందస్సును

ఎన్నుకున్నారు. కొన్ని ఛందస్సులకు ఆ శతకాలవల్లనే ఆశేషమైన కీర్తి లభించింది. **సుమతి** వంటి వాటి వల్ల **కంద** పద్యానికి ఖ్యాతి వస్తే **వేమన** వల్ల **ఆటవెలది**కి కీర్తి లభించింది. ఆ ఛందస్సులో ఆయా కవులు చూపిన అపార ప్రజ్ఞ దానికి కారణం. పద్య శిల్ప విషయంలో కవులు పారం ముట్టడానికి ఛందోపరణం కూడా ఒక కారణం. తమ శతకాల్లో తాము బహిర్గతపరచవలసిన భావాలకు అనుగుణమైన ఛందాన్ని ఎన్నుకోవడంలోనూ కవులు ప్రతిభ చూపారు. సరళమైన భావప్రకటనకు ఎన్నుకున్న ఛందస్సుకు, భక్తి తాత్పర్యాలు ప్రకటనకు ఎన్నుకున్న ఛందస్సులకు కవులు తేడాను చూపించడం మనం తెలుగు శతకాల్లో గమనింపవచ్చు. కాని ఎన్నుకున్న ఛందస్సును నిర్వహించిన సమర్ధత విషయంలో మాత్రం తెలుగు కవులు నూటికి నూరుశాతం విజయాన్ని సాధించారన్నది వాస్తవం. సమాసాల పోహళింపులకు, ధారాశుద్ధి వారి రచనలలోని ఛందస్సే ప్రబల సాక్ష్యం.

సాధారణంగా శతకానికి సంఖ్యానియమం స్పష్టంగా కనిపిస్తుంది. **'నూరు'** అనే సంఖ్యవల్లనే దానికి ఆ పేరు వచ్చిందన్నది సత్యం. కాని అనేక మంది కవులు **'నూరు'** దగ్గర ఆగిపోక రెండు వందలు, మూడు వందలకు పైగా రచిస్తూ వెళ్ళారు. **వేమన** పద్యాలు ఎన్ని ఉన్నాయో కూడా పరిశోధకులు చెప్పలేకపోవడానికి సంఖ్య విస్తృతియే కారణం. కాకపోతే కొందరు పరిశోధకులు చెప్పినట్లు కొన్ని **వేమన** పేరుతో, **వేమన** మకుటాన్ని ఉపయోగించి తమ రచనల్ని లోకంలోకి తీసుకుని ఉండవచ్చునన్నది సత్యం కావచ్చు. మొత్తానికి 'వంద' సంఖ్యకు చాలామంది కవులు నియమితం కాలేదు. సంస్కృతంలో **భర్తృహరి సుభాషిత త్రిశతి, మూక కవి మూక పంచశతి** వలెనే తెలుగులోనూ **వరలక్ష్మీ త్రిశతి** వంటి రచనలు వెలుగు చూశాయి. సంపూర్ణమైన తెలుగు శతక లక్షణాలు లేని రచనలైనా వీటిని సాహిత్య చరిత్రకారులు శతకాల కోవలోనివి గానే పరిగణించారు.

శతకం విధి విధానాలలో మరొక ప్రధానమైన విషయం 'వస్తువు'. ఇందులోని పద్యాలు ఏ పద్యానికి ఆ పద్యమే స్వతంత్రమైనది కనుక దీనిలో కథకు ప్రాముఖ్యం ఉండదు. 'వస్తువు' అనేది కేవలం విశాల ప్రాతిపదికపై ఉంటుంది. భక్తిగాని, సామాజిక దృష్టిగాని, నైతిక విలువల బోధనగాని ప్రధానంగా ప్రాముఖ్యం వహించి ఏ పద్యానికి ఆ పద్యం స్వతంత్రమై ముక్తకాలుగా మిగిలిపోతాయి. కాబట్టే దీనిలో రస చర్చ మొదలైన వాటికి ఆస్కారం తక్కువ.

తెలుగు శతక సరస్వతీ పాదమంజీర ధ్వనులు పదికాలాలపాటు ప్రతిధ్వనించిన వైనానికి ప్రధానకారణం దీనికి ఏర్పరచుకున్న విధి విధానాలే. ప్రతి నియమాన్ని పూర్తి స్థాయిలో పాటిస్తూ పటిష్ఠంగా శతకాలు వెలువడటం వల్ల ఆ ప్రక్రియ అప్రతిహతంగా కొనసాగింది. దాదాపుగా ప్రధాన సాహిత్య స్రవంతికి సమాంతరంగా శతక సాహిత్య స్రవంతి కూడా ప్రవహించి సాహిత్య కేదారాన్ని సుసంపన్నం చేసింది.

ఇట్లాంటి అనేక నియమనిబంధనలు, విధి విధానాలు ఏర్పరచుకోవడం వల్ల శతకాల పునాది మరింత పటిష్ఠమై శతక ప్రభ వెలిగింది. దైవ భావ ప్రసక్తి ఉన్నా, మానుష భావదీప్తి వెలిగినా ఇవి రెండు మార్గాలు కూడా శక్తివంతంగా ఎదిగి ప్రాచుర్యాన్ని సంపాదించుకున్నాయి.

శతకం విస్తృతి పెద్దది. దీనికున్న వేయేళ్ళ చరిత్రను పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన అంశాలు పరిశీలకుల దృష్టికి వస్తాయి. అందుకే శతకాన్ని గురించిన విశ్లేషణలను ప్రముఖ పండితులెందరో చేశారు. విశ్లేషణ చేసిన ప్రతి పరిశోధకుడు దీని మూలాల్లోకి వెళ్ళి ఈ ప్రక్రియ విధి విధానాలపై చర్చించారు. దీని ప్రామాణికతను పెంచారు. ఆ క్రమంలోనే సంస్కృత ప్రాకృత లాక్షణికులతోబాటు తెలుగు లాక్షణికుల ఆలోచనలను కూడా పరీక్షించి నిగ్గుతేల్చారు. ఆ విశ్లేషణల్లో తెలుగు లాక్షణికుడైన **విన్నకోట పెద్దన తన కావ్యాలంకార చూడమణి**లో చెప్పిన లక్షణాల్ని పరిశీలించి, నియమనిబంధల్ని గురించిన అవగాహన కలిగించారు.

# తెలుగు శతకాలు
# వైవిధ్యం

# శతక ప్రక్రియా వైవిధ్యం – విభజన

ప్రాచీనతతో బాటు నేటికీ నిరాటంకంగా సాగుతున్న ఈ శతక ప్రక్రియ ప్రస్థానాన్ని గమనిస్తే ఇప్పటివరకు వెలువడిన శతకాలను, వెలువడుతున్న శతకాలను పరిశీలించి పరిశోధకులు దీని వైవిధ్యాన్ని విశ్లేషించి శాస్త్రీయమైన విభజన చేశారు. స్థిరంగా నిలిచిపోయిన శతకాన్ని చిరంజీవిగా గుర్తించారు. పద్యాన్ని పునాదిగా చేసుకొని పైకి ఎదిగిన శతకం పద్యంతో బాటు కవి ప్రతిభకు ఏ విధంగా వన్నెలు దిద్దిందో కూడా వివరించారు.

తెలుగు శతకాల్ని **భక్తిశతకాలని, నీతిశతకాలని, అధిక్షేప శతకాలని, తాత్త్విక శతకాలని, హాస్యశతకాలని, శృంగార శతకాలని, చారిత్రకశతకాలని, కథాత్మక శతకాలని, అనువాద శతకాలని, భాషా వ్యాకరణ నిఘంటు ప్రహేళికాశతకా** లని విభజిస్తూనే శతకం యొక్క స్వరూపంలో రచనాపద్ధతుల్లో క్రమంగా వచ్చిన మార్పులను గురించి ఆలోచించారు. అందువల్ల శతక సాహిత్యవైశిష్ట్యము తేటతెల్లమైంది.

## భక్తి శతకాలు

శతక ప్రక్రియా ప్రారంభమే భక్తి శతకాల రూపంలో జరిగింది. సంపూర్ణ శతక లక్షణాలతో వెలువడిన **వృషాధిపశతకం** శివసంబంధి. శతక లక్షణాలు పాక్షికంగా ఉండే **శివతత్త్వసారం** వంటివి కూడా భక్తి శతకాలు. తొలినాళ్ళలో భక్తి కొరకే శతక ప్రక్రియ మొదలైనట్లుగా గుర్తించారు. సంస్కృత సాహిత్యంలోని స్తోత్ర రచనల ప్రభావం తొలి తెలుగు శతకములపై కనిపిస్తున్నది.

**శ్రీపతి వాక్పతి ముఖ్య మ**
**హా పురుషులు నెఱుగ నోపరతి వాఙ్మానస**
**వ్యాపారమైన నీ నిజ**
**రూపము నే నెట్టిదని నిరూపింతు శివా !**

అంటూ మల్లికార్జున పండితారాధ్యుల వారి పరమశివుని ప్రార్థన భక్తి శతకాలకు తొలి బీజం.

**శ్రీగురులింగమూర్తి, సువిశేష మహోజ్జ్వల కీర్తి, సత్క్రియో**
**ద్యోగకళాప్రపూర్తి, యవధూత పునర్భవజార్తి పాలితా**
**భ్యాగత సత్ప్రియార్థి కవి పండిత గాయక చక్రవర్తి దే**
**వా ! గతినీవె మాకు బసవా ! బసవా ! బసవా ! వృషాధిపా !**

అని చెప్పిన **పాల్కురికి సోమనాథుని వృషాధిప శతకం**లోని శివభక్తి తదనంతర శివప్రాశస్త్య శతకాలకు మార్గదర్శి.

భక్తి శతకాలలో తమ తమ ఇష్టదైవాలపై శతక రచన చేయడానికి కవులు పూనుకున్న కారణంగానే హరి, హరభక్తి శతకాలు, ఇంకా ఇతర దేవతల స్తోత్ర శతకాలు విరివిగా తెలుగులో వెలువడ్డవి.

మనిషి భగవదంశ సంభూతుడుగా పూర్వులు సంభావించారు కనుకనే ఆ పునాది భక్తి శతకాలకు మూలమై నిలిచింది. జన్మించింది మొదలు అతనికీ విశాల విశ్వంతో విడదీయరాని సంబంధం ఏర్పడటం కూడా వీటి విస్తృతికి ప్రధాన కారణం కావచ్చు. భగవంతుని గురించి తన మనస్సులో యేర్పడిన ప్రేమ భావనయే భక్తి గనుక అదియే శతకమై రూపొందినది. భక్తిలోనే తలమునకలైన కవీశ్వరులు ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత భావాల స్రోతస్వినిని తెలుగు శతకాల్లోకి ప్రవహింపజేశారు. దానివలననే భక్తి శతకాల్లో ఇంతవైవిధ్యం చోటు చేసుకున్నది.

సాధారణంగా భక్తి ప్రధానమైన శతకాలలో భగవంతుని లీలావర్ణనలు, భగవన్నామసంకీర్తనలు, ఆత్మనివేదన, ఆర్త రక్షణకై అర్థింపు వంటి అంశాలు అధికంగా చోటు చేసుకుంటుంటాయి.

భక్తి శతకాల వరుసలో హరస్తుతియే గాక, హరిని స్తుతించిన శతకాలు కూడా అనేకం వచ్చాయి. శైవ, వైష్ణవ, భక్తి శతకాల ప్రవాహం ఇంచుమించు సమాంతరంగానే సాగింది.

హరభక్తి శతకాలలో **పాల్కురికి సోమన** అనంతరము, ఆయన రచన ఇచ్చిన స్ఫూర్తితో శివుని గురించిన **శ్రీకాళహస్తీశ్వర శతకం, సర్వేశ్వర శతకం, ఏకామ్రలింగ శతకం, సదాశివేశ్వర శతకం, మల్లికార్జున శతకం, ముక్తీశ్వర శతకం** మొదలైన వేలకొలది శతకాలు వెలువడ్డాయి. ఇవన్నీ శివ మహిమలను, శివభక్తుల భక్తి

ప్రపత్తులను, ప్రసిద్ధ శివక్షేత్ర మాహాత్మ్యాలను ఇంకా అనేక విధములైన ఆలోచనా స్రవంతిని శతక పద్యాలనిండుగా పారించారు.

ఇదే విధంగా విష్ణు పారమ్యాన్ని తెలిపే పలు శతకాలు తెలుగువారి నాలుకలపై శాశ్వతంగా నిలిచిపోయే పద్యాలతో సుసంపన్నంగా నిలిచాయి. తెలుగు కవుల్లో ప్రసిద్ధుడు **బమ్మెర పోతన.** భక్తి కవిత్వ రంగంలోనూ, మధుర మనోహర పద్య నిర్మాణ చణత్వంలోనూ ఆయన ప్రథముడుగా గుర్తింపబడినాడు. తెలుగులో విష్ణుభక్తి శతకంగా పేరెన్నికగన్న **నారాయణ శతకం పోతన్న** రచనగా గుర్తించారు. కొందరు దీన్ని సందేహించినా పద్యరచనా శైలి, పదప్రయోగాది అంతః సాక్ష్యాల ఆధారంతో దీనిని **పోతన** కృతంగానే పలువురు భావించారు.

**ధరసింహాసనమై నభంబుగొడునై, తద్దేవతల్ భృత్యులై,**
**పరమామ్నాయములెల్ల వందిగణమై, బ్రహ్మాండమాగారమై,**
**సిరిభార్యామణియై, విరించికొడుకై, శ్రీగంగ సత్పుత్రియై**
**వరుసన్నీఘన రాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా !**

అన్న ప్రసిద్ధ పద్యాన్ని చదువుతుంటే పద్యంతో సామాన్య పరిచయం ఉన్న ప్రతి వ్యక్తికీ గుర్తుకు వచ్చే కవి **పోతన్నయే.** ఆయన పద్య రచనాశైలితో పరిచయం ఉన్న ప్రతివారూ ఏమాత్రం సందేహం లేకుండా అంగీకరించే సత్యం ఇదే. విష్ణు పారమ్యాన్ని వర్ణించే ఈ శతక సాహిత్యంలో **నారాయణశతకం** మొదటివరుసలో నిలుస్తుంది.

**రంగదరాతి భంగ, ఖగరాజతురంగ విపత్పరంపరో**
**త్తుంగ తమః పతంగ, పరితోషితరంగ, దయాంతరంగ, స**
**త్సంగ, ధరాత్మజాహృదయ సారస భృంగ నిశాచరాబ్జమా**
**తంగ, శుభాంగ, భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ !**

తెలుగువాళ్ళు పరమభక్తితో, పరమప్రీతితో సాగిలపడి మ్రొక్కేదేవుడు ఆ భద్రగిరి రామచంద్రుడు. శ్రీమన్నారాయణుని పరిపూర్ణావతారాలలో ప్రముఖుడైన రామచంద్రుని కీర్తిస్తూ విష్ణుతత్త్వాన్ని విశదపరుస్తూ **కంచర్ల గోపన్న** రచించిన **దాశరథీ శతకం** విష్ణు సంబంధి శతకాల్లో ప్రసిద్ధమైన శతకం.

విష్ణుభక్తి శతకాల్లో ఆయన దశావతారాలకు సంబంధించిన ప్రసిద్ధములైన **నారసింహ, శ్రీకృష్ణ, శ్రీరామాది** శతకాలు వేలాదిగా వెలువడ్డాయి. **కూర్మావతార స్తుతి శతకం** కూడా ఒకటి ఉన్నట్లు తెలుస్తున్నది.

సాధారణంగా విష్ణుతత్త్వసంబంధి శతకాలలో శ్రీమన్నారాయణుని దివ్యలీలా విశేషాలు, వైష్ణవమత ప్రాశస్త్యం, విశ్వరూప నిరూపణము, వైష్ణవక్షేత్ర ప్రాచుర్యం దశావతార వర్ణనలు మొదలైనవి చోటు చేసుకున్నాయి.

నారాయణ తత్త్వ వివేచన సలిపే ఈ శతకాలలో **దాశరథీ శతకం, వరాహ నరసింహ శతకం, యాదగిరి లక్ష్మీనృసింహ శతకం, నృకేసరి శతకం, కృష్ణశతకం, రాఘవ శతకం** మొదలైనవి మిక్కిలి ప్రసిద్ధములై కీర్తి గడించినవి.

విష్ణుస్తుతి శతకాలంలో శ్రీ వేంకటేశ్వరుని స్తుతించే శతకాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. తాళ్ళపాక కవులు దాదాపుగా అందరూ కీర్తించిన కలియుగప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరుడు. **తాళ్ళపాక అన్నమాచార్యుల** వారితో ప్రారంభమైన **శ్రీ వేంకటేశ్వర స్తుతి శతకాల** పరంపర నేటిదాకా నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది.

అగణిత భక్తి భావ సమన్వితములై వెలిసిన విష్ణుశతకాలు **భాగవద్భక్తి** పారమ్యములు, హరినామ సంకీర్తనము కలిదోషహారిగా భావించిన రచనలు, విష్ణుభక్తుల భక్తి తత్పరతను లోకానికి వెల్లడించిన కృతులుగా కీర్తినందినవి.

త్రిమూర్తులుగా కొలుచుకునే దైవాలలో బ్రహ్మ ఒకడు. సృష్టికర్తగా జగత్ప్రసిద్ధుడు. సృష్టి, స్థితి, లయకారులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు సంబంధించిన శతకాలలో శివ, విష్ణు సంబంధి శతకములతో పోల్చితే బ్రహ్మను గురించి వెలువడిన రచనలు దాదాపు మృగ్యమే. ఆయన సృష్టి కారకుడని కీర్తింపబడినా, ఆయనకు పూజార్హత లేదన్న కారణంగా ఇటువంటి సందర్భం ఏర్పడిందేమోనని విశ్లేషకులు అభిప్రాయపడిరి. ఆయనకు ప్రత్యేకంగా ఆలయాలు, విగ్రహాలు లేకపోవడం కూడా ఒక కారణం కావచ్చు. కేవలం ఆయా సందర్భాలలో సందర్భానుసారంగా సృష్టిలీలావిలాసాల వర్ణనావసరంలో కవులు ఆయనను ప్రస్తుతించారు. కాని **జొన్నల గడ్డ శారదాంబ** అనే కవయిత్రి **'శారదాపతి'** శతకం ఇందులకు అపవాదం. బహుశా ఇదే బ్రహ్మస్తుతి శతకాలలో ప్రథమగణ్యము కావచ్చు. లేదా ఇదొక్క శతకమే కనిపించవచ్చు. పైగా కవయిత్రి తనకు, ఆ శారదామాతకు మాత్రమే ఆయనను నుతించే భాగ్యం కలిగిందని తెల్పింది. దీనిని బట్టి కూడా ఇదొక్కటే సృష్టికర్త స్తుతిశతకంగా పరిశోధకులు భావిస్తున్నారు.

పురాణాల ప్రభావం వల్ల మన సంస్కృతిలో పలువిధాలైన దేవతారాధనలు

చోటు చేసుకున్నాయి. పవిత్రక్షేత్ర దర్శనము, తీర్థస్నానములు ముక్తిదాయకములని భారతీయుల ప్రగాఢ విశ్వాసము. ఈ సమాజములో ఆధ్యాత్మిక భావ ప్రచారము జరుగుటకు ప్రధాన కారణము భక్తి. కావున ఈ తత్త్వమే కవుల భక్తి శతక రచనకు ప్రేరకమైనది. ఇటువంటి పలు భావాల సమ్మేళనమే భక్తి. అందుకే శతకాల్లోనూ ఇవన్నీ చోటుచేసుకొని భక్తి శతకాలై పరిఢవిల్లినది. ఈ నేలపై వివిధ సంప్రదాయములు ప్రవర్తించినవి. అందుకే ఆయా సంప్రదాయాలను అనుసరించి ఆదిత్యుడు, గణపతి, శని, ఆంజనేయుడు, దత్తాత్రేయుడు గంగాదేవి, గోదావరి మొదలైన భక్తిశతకాలు కూడా ఉద్భవించాయి.

అవతార పురుషులుగా కీర్తింపబడిన వారిని గూర్చి గూడా శతకములు వచ్చాయి. షిరిడీ సాయినాథుడు, పుట్టపర్తి సాయిబాబాను గురించిన శతకాలు ఇందులోని భాగములే.

ఈ దేశం మతసామరస్యానికి నెలవైన దేశము. మతవిద్వేషాలు ఎన్ని చెలరేగినా సహనంతో వాటిని తొలగించుకొని సమదృష్టితో అందరి దైవాలను భారతీయులు కీర్తించారు. ఇస్లాం మతప్రవక్తను గురించి **షేక్ దావూద్ కవి** రచించిన పద్యం ఇది.

**అక్షయమా 'ఖదీజ' ధనమంతయు పేదలకిచ్చునాడు ప**
**ద్మాక్షి యొకింత మార్పులుక కంతయు నీదని యోర్పుగొన్న దా**
**దీక్ష విచిత్ర మాత్మ పరితృప్తియు, సర్వమటంచు నెంచె నీ**
**రక్షక వేల బ్రోచెదు బరాత్పరుడంటివహో ! రసూల్ప్రభూ !"**

ఈ పద్యంలో కవి మహమ్మదుగుణగణాలను గొప్పగా కీర్తించాడు. రసూల్ప్రభువు ఇస్లాం మతస్థులకు ఆదర్శమూర్తి ఆయన జీవితములోని ఒకానొక సంఘటనను గ్రహించి, రచించిన ఈ పద్యమును, ఆయన ఘనతను కీర్తించిన ఈ శతకమును తెలుగు శతకాల మతైక్యతకు చిహ్నంగా భావించవచ్చు.

ఈ పద్ధతినే కొనసాగిస్తూ క్రైస్తవధర్మాన్ని పాటించేవారు పూజించుకునే యేసుక్రీస్తును గురించి **చౌదరి పురుషోత్తమ** కవి రచించిన **యేసునాయక, యేసుక్రీస్తు ప్రభు** శతకాల ల్ల క్రీస్తుపై వారికున్న భక్తి ప్రపత్తులు తెలుస్తున్నాయి. మానవత్వపు పరిమళాలు పంచిన దైవంగా క్రీస్తును భావించి–

**ఎన్నటి చుట్టమో 'మరియ', యెన్నటి బంధువో, 'లాజరుండు' నీ**
**కెన్నటి కూర్మివిందొ, మృతివేళ దలంచిన తస్కరుండు వీ**

**రెన్నిక జెందినారు మరియెందరి నీకృప చేత మోక్ష సం**
**పన్నుల జేసినావు భవబంధములూడిచి యేసునాయకా !**

అని ప్రార్థించాడు. **పురుషోత్తమ కవి** శతక పద్యాలు వారి తెలుగు కవిత్వాధ్యయన నేపథ్యమును స్పష్టపరుస్తున్నవి. అనేక శతకాల అధ్యయనం చేసిన కవి కనుకనే ఆయన కవిత్వంలోని, ముఖ్యంగా ఆయన శతకాలలోని పద్యాలలో అంతకు పూర్వపు శతక పద్యముల ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నవి.

భక్తి శతకములు బహుళ ప్రచారములో ఉన్నవి మాత్రమే గాక యింకను మిగిలిన లెక్కలేనన్ని భక్తి శతకములు శతక శాఖకే అలంకారములై నిలిచినవి.

ప్రముఖ తత్త్వవేత్తలు, పీఠాధిపతులు మొదలైన మహాపురుషులపై భక్తి ప్రపత్తులతో వెలువడిన శతకములను గూడ యీ భక్తిశతకముల శాఖకు చెందినవి గానే పరిశోధకులు పరిగణించిరి. కుసుమహరనాథుని గురించి, సద్గురు మళయాళ స్వామిని గురించి విశిష్టాద్వైత సిద్ధాంతకర్త శ్రీమత్ రామానుజాచార్యుల వారిని గురించి రచించిన శతకములన్నియు ఈ కోవలోనివే.

భక్తి శతకములు విరివిగా నాటినుంచి నేటివరకు వెలువడి శతక సాహిత్యశాఖను పరిపుష్టం చేయుటలో ప్రథమ స్థానమును పొందినవి.

## నీతి శతకాలు

భారతీయ సంస్కృతిలో చతుర్విధ పురుషార్థాలకు అత్యంత ప్రాధాన్యం ఉంది. భారతీయుని జీవనవిధానానికి, ధర్మార్థ కామమోక్షాలకు విడదీయరాని సంబంధం ఉంది. చతుర్విధ పురుషార్థాల్లో ప్రధానమైంది ధర్మం. దాన్ని లక్ష్యంగా పెట్టుకొని భారతీయుల సర్వసాహిత్య సృష్టి జరిగింది. మానవజీవితంలో ధర్మానికే పెద్దపీట వేశారు గనుక నైతిక విలువల ప్రాథమ్యం, ప్రాధాన్యం పెరిగింది. నీతికి ప్రధాన స్థానం లభించింది. ప్రతి సృజనాత్మక సాహిత్యానికి ప్రధాన లక్ష్యం **'నీతి'** మాత్రమే అన్నారు. తద్వారా ధర్మం నిలుస్తుందన్నది భారతీయుల విశ్వాసం.

తెలుగు శతకకర్తలు కూడా **'నీతి'** ని ప్రత్యేకంగా ఎంచుకొని శతకాల్ని అందించారు. సంస్కృత సాహిత్యంలో **భర్తృహరి** తన **త్రిశతిలో** **'నీతి'**కి పెద్దపీట వేశాడు. సంస్కృతంలోని పలువురు కవులు నీతిని తాము సృజించే సాహిత్యంలో నిక్షేపించి తమ రచనల్ని కొనసాగించారు. తెలుగు శతక రచయితలు **'నీతి'** ని ప్రధాన భూమికగా

గ్రహించిన నీతిశతకాలు వేలసంఖ్యలో వెలువరించారు. మనిషిని సంస్కరించగలిగే శక్తి **'నీతి'**కి మాత్రమే ఉందన్న సంగతిని గుర్తించిన తెలుగు శతక కవులు నైతిక విలువల్ని పెంచేరీతిలో తమ రచనలకు వన్నె పెట్టారు. అది కారణంగా తెలుగులోని నీతిశతకాలకు గొప్ప కీర్తి లభించింది.

నీతిలో రాజనీతిని బోధించే విధానాన్ని, లౌకిక నీతిని బోధించే విధానాన్ని పలురీతుల్లో కవులు కావ్యబద్ధం చేశారు. ఆ విభాగంలోనే తెలుగులో అసంఖ్యాకంగా నీతి శతకాలు వెలుగు చూశాయి. వెలుగు చూచిన ప్రతి శతకం విస్తృత ప్రచారాన్ని పొందింది. అయితే రాజనీతిని బోధించే వాటిలో **బద్దెన** రచించిన **'నీతిశాస్త్రముక్తావళి'**తో బాటు అక్కడక్కడ ఒకటి రెండు శతకాలు మాత్రమే వెలుగు చూశాయి. ఈ విషయంలో అంతగా పురోగతిలేదు, అంతగా వికాసము లేదు.

లౌకిక నీతిశతకాలకు తెలుగు సాహిత్యం పెట్టింది పేరు. తొలినాళ్ళనుండి నేటిదాకా కూడా శతకం అనగానే అది నీతి బోధకొరకే నిర్దేశించినదిగా భావించే అభిప్రాయం స్థిరపడింది.

తెలుగులో **'సుమతి'** శతకమే తొలినీతి శతకంగా పరిశోధకులు భావించారు. పైగా తొలిపద్యంలోనే బద్దెన –

**శ్రీరాముని దయ చేతను**
**నారూఢిగా సకల జనులు నౌరా ! యనగా**
**ధారాళమైన 'నీతులు'**
**నోరూరగ చవులు బుట్ట నుడివెదసుమతీ !**

అని స్పష్టంగా తన శతక లక్ష్యం ధారాళమైన **'నీతు'**లను బోధించడమేనని చెప్పాడు.

అత్యంత సరళంగా చక్కని కందపద్యాల్లో హృదయవైశాల్యాన్ని మరింత పెంచేయోచనతో లోకరీతిని, నీతిని సుబోధకం చేసిన **సుమతి శతకం** అజరామరం.

**బలవంతుడ నాకేమని**
**పలువురితో నిగ్రహించి పలుకుటమేలా !**
**బలవంతమైన సర్పము**

**చలిచీమల చేతచిక్కి చావదె సుమతీ !**

అంటూ చెప్పిన పద్యం ప్రతివాడూ తాను బలవంతుణ్ణని విర్రవీగరాదని తెలిపిన చక్కని కందపద్యం. అందమైన కందాలలో లోకనీతుల్ని బోధించిన సుమతి శతకం తదనంతర నీతిశతకాలకు ఒజ్జబంతి వంటిది అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

నీతి శతకాల వరుసలో తొలిబంతిలో నిలబడగలిగే మరో శతకం **మారద వెంకయ్య భాస్కర శతకం**.

**చదువది యెంతగల్గిన రసజ్ఞత యించుక యైనలేని యా**
**చదువు నిరర్థకంబు, గుణసంయుతులెవ్వరు మెచ్చరెచ్చటన్**
**పదనుగ మంచికూర నలపాకము వండినగాని నందు నిం**
**పొదవెడు నుప్పులేక రుచిపుట్టగ నేర్చునటయ్య భాస్కరా !**

అంటూ దృష్టాంతపూర్వకంగా గొప్ప నైతిక జ్ఞానాన్ని మనకు అందించిన **భాస్కర శతకం**లోని ప్రతి పద్యం ఒక రత్నం. మనిషికి చదువుతో బాటు సంస్కారం కూడా ఉండాలన్న గొప్ప నీతిని బోధించిన ఈ శతకం నీతులపుట్ట.

ఇంకను లెక్కకు మిక్కిలిగా ఉన్న నీతి శతకాలలో **కుమారీ, కుమార శతకాలు, సోదరీమణిశతకము** మొదలైనవి లోకమునకు మార్గదర్శకములై శాశ్వతస్థాయిని అందుకున్నవి. వివిధ దశలలో బాలబాలికలకు ఆవశ్యకమైన నీతిబోధలు శతకముల మాధ్యమంగా బోధింపబడటం తెలుగు శతకాల ప్రత్యేకత.

తెలుగునేల నాలుగు చెరగుల ప్రతినోటా వినిపించే పద్యం **వేమన**పద్యం. వేమన్నమాట వేదంగా పరిగణించే స్థాయిలో ఆయన నీతిపద్యాలు నిలిచాయి. ఎన్నుకున్న ఛందస్సు ఆటవెలది; అందులో చివరిపాదం **'విశ్వదాభిరామ వినురవేమ'** అనే మకుటానికే సరిపోగా మిగిలిన మూడుపాదాల్లో ముల్లోకాల సత్యాల్ని ఆవిష్కరించిన ఘనుడు **వేమన**. నీతిని గొప్ప గొప్ప దృష్టాంతాలతో, అవీ నిత్యం మనకు తారసపడే సత్యాలతో చెప్పగలిగింది **వేమన** పద్యం.

**ఎంత చదువుచదివి, ఏ నీతి విన్నను**
**హీనుడవగుణంబు మానలేడు**
**బొగ్గు పాలగడుగ పోవునామలినంబు?**

**విశ్వదాభిరామ వినురవేమ !**

అని చెబుతూ కుసంస్కారిని ఉత్తమ సంస్కారవంతునిగా మార్చడం అంతసులభం కాదన్న సత్యాన్ని స్పష్టంగా చెప్పాడు వేమన.

ప్రశ్నించడం విజ్ఞానవిస్తృతికి మొదటిమెట్టు. దాదాపుగా అన్ని పద్యాలలో ప్రతిమనిషికి ప్రశ్నించేగుణాన్ని నేర్పించే యత్నం చేశాడు.

**ఇంటియాలి విడిచి యిల జాఱకాంతల**
**వెంట దిరుగువాడు వెఱ్ఱివాడు**
**పంట చేలు విడచి పరిగలేరిన యట్లు....**

అంటూ లోకరీతిని సంస్కారమార్గంలో నడిపించే యత్నం చేసిన గొప్ప దార్శనికుడు **వేమన్న**.

**వేమన్న** మాటలు ముత్యాల మూటలు. ఆయన ప్రతిమాట మంత్రం లాగా తెలుగు నేలపై నిలిచింది. వస్తువును బట్టి నీతి, వైరాగ్య, శృంగార, అధిక్షేపాత్మక రీతులు **వేమన** పద్యాల్లో కనిపిస్తున్నాయి. అయితే నీతిపద్యాల మార్గంలో **వేమన్న**ది ముందడుగు. ఆయన భావం గంభీరం, ఆయన మాట సూటిమాట. ఏ విషయాన్ని అయినా కుండబ్రద్దలు కొట్టినట్లుగా చెప్పి నిజాన్ని నిర్భయంగా ఆట వెలదుల్లో నిబద్ధించి వెల్లడించిన **వేమన్న** ఏనాటికైనా చిరస్థాయిగా నిలిచిపోయే కవి.

నీతుల అవసరం లోకానికి ఎంత ఉన్నదో తెలిపేవి నీతిశతకాలే. దుర్జన నిరసన, సజ్జన సంరక్షణ చేసే అవసరాన్ని నీతిశతకాలు నేర్పిస్తున్నాయి. మానవ సంస్కారం మరింత ఉత్తమ మార్గంలోనికి పోవాలన్న ఘనసంకల్పం నీతి శతకాలది. సమాజ జీవనం, తల్లిదండ్రుల పట్ల ఆదరణ, పెద్దలపై ప్రదర్శించాల్సిన గౌరవం, పిన్నలపై చూపించాల్సిన వాత్సల్యం, బడుగు జీవులపై ఉండవలసిన కారుణ్యం, కుటుంబసభ్యులపట్ల, ఆప్తబంధువులపట్ల ప్రవర్తింపవలసిన తీరు, దాస దాసీజనాలపై ఉండవలసిన మక్కువ, ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన శ్రద్ధ, శిశువులపై చూపింపవలసిన ప్రేమానురాగాలు, జీవజంతుజాలాలపట్ల ఉండవలసిన ఆర్ద్రభావాలు, ఇట్లా ఒకటేమిటి సమస్తవిశ్వంలో మనిషి అనుసరించవలసిన ధర్మపద్ధతిని చూపే మార్గదర్శి **నీతిశతకం**. సర్వమానవాళికి దిశానిర్దేశం చేసిన ఘనత తెలుగు నీతిశతకాలకే దక్కిందన్నది అత్యంత

వాస్తవమైన విషయం.

## అధిక్షేప శతకాలు

సూటిగా చెప్పి సాధించలేని పనులను సాధించే మార్గాలు మన ప్రాచీనులు గుర్తించారు. ఆ మార్గాలలో అధిక్షేపం ఒకటి. నిష్ఠూరంగా మాట్లాడి పనులు సాధించుకునే మార్గాన్ని కవులు, ముఖ్యంగా శతక కవులు అనుసరించి పలు శతకాల్ని అందించారు.

ఆలంకారికులు చెప్పిన వ్యాజస్తుతి అనేది ఈ అధిక్షేపమార్గాన్నే సూచిస్తుంది. వ్యాజస్తుతి అలంకారాన్ని విస్తృతంగా ప్రయోగించి తెలుగు కవులు విజయాన్ని సాధించారు. కావ్య సౌందర్యాన్ని రెండింతలు చేసే అలంకారాల్లో వ్యాజస్తుత్యలంకారం ఒకటి. ఆ అలంకారాన్ని ఆధారం చేసుకుని శతకాన్నే రచించడం విశేషం. అటువంటి అనేక శతకాలు తెలుగులో వెలుగుచూశాయి. ఒక వ్యక్తికి గాని, ఒక పాలకునికి గాని ఒక సమాజానికి కాని దురాచారము ఒంటబట్టి లోకానికి హాని జరిగే పనులు చేస్తున్నప్పుడు బెదిరించో, మందలించో, హెచ్చరించో, దూషించో సరియైన మార్గంలోనికి తీసుకవచ్చేరీతిని వ్యాజస్తుతితో సాధించవచ్చునన్న ఆలోచన దీనికి మూలము.

ఈ అధిక్షేపమార్గంలో **కాసుల పురుషోత్తమ కవి, కవి చౌడప్ప, అడిదము సూరకవి, కూచిమంచి కవులు, వేమన** వంటి వారెందరో సుప్రసిద్ధులు. వారి రచనలు లోక ప్రసిద్ధములు. **"నీతులు బూతులు"** పద్యాలతో కలిపి శతక రూపంలో అందించిన కవి కవి**చౌడప్ప**. కందపద్యాల సౌందర్యాన్ని అధిక్షేపాత్మక సౌందర్యంతో జోడించి, రత్నాలవంటి పద్యాల్ని తెలుగువాళ్ళకు అందించిచాడు.

**ఆలు నిర్వాహకురాలు భూదేవియై యఖిల భారకుడన్ననాఖ్యదెచ్చె**
**నిష్ట సంపన్నురాలిందిర భార్యయై కామితార్థదుడన్న ఘనతదెచ్చె**
**కమలగర్భుడు సృష్టికర్త తనూజుడై బహుకుటుంబకుడన్న బలిమిదెచ్చె**
**ఆంధ్రుబిడ్డలు దెచ్చు ప్రఖ్యాతిగాని, మొదటినుండియు నీవు దామోదరుడవె,**
**చిత్రచిత్ర ప్రభావ! దాక్షిణ్యభావ! హతవిమత జీవ! శ్రీకాకుళాంధ్రదేవ !**

అంటూ ఒక గొప్ప శతకాన్ని **'ఆంధ్రనాయక'** శతకంగా అందించిన **కాసుల పురుషోత్తమ కవి** అధిక్షేపకవులలో ఘనమైన కీర్తిపొందినవాడు. చెప్పిన పద్యాలన్నీ విస్తృతి కలిగిన

సీసపద్యాలు. కాని విషయాన్ని కూలంకషంగా, వ్యంగ్య ధోరణితో అధిక్షేప శైలిలో అందించిన **పురుషోత్తమ** కవి ఎందరెందరు కవులకో దారి చూపించిన పెద్ద కవి.

గొప్ప కవిత్వ ధోరణితో, వ్యంగ్య చమత్కృతులతో అధిక్షేపాత్మకంగా వెలసిన **కూచిమంచి కవి 'కుక్కుటేశ్వరశతకము', పోలిపెద్ది వెంకటరామకవి 'వేణుగోపాల శతకము', పట్టాభిరామకవి 'గువ్వలచెన్న శతకము'** మొదలైనవన్నీ గొప్ప అధిక్షేపాత్మక శతకములే.

ఆధునిక కాలంలోనూ **శ్రీశ్రీ 'సిరిసిరి మువ్వ'శతకం నార్లవారి 'నవయుగాల బాట నార్లమాట' శతకం, దాశరథి 'అభినవ దాశరథీ' శతకం, బోయిభీమన్న 'పిల్లీ' శతకం, అక్కిరాజు 'సుందరరామకృష్ణ భీమలింగ', 'శనీశ్వర' శతకాలు** మిక్కిలి ప్రసిద్ధమైన అధిక్షేప శతకములు.

అధిక్షేప శతకాలు సహృదయులైన పాఠకులను త్వరగా ఆకర్షిస్తాయి. అలరిస్తాయి. విషయాన్ని ఈ విధంగా చెప్పే ధోరణివల్ల చదివిన వారి గుండెల్లో విషయం గూడుకట్టుకుని శాశ్వతంగా నిలిచిపోతుంది. అందుకే ప్రతిభావంతులైన పలువురు కవీశ్వరులు ఈ అధిక్షేప రచనామార్గాన్ని ఎన్నుకొని శతక రచన చేసి శతక సాహిత్యంలో ఆ శాఖను మకుటాయమానంగా నిలబెట్టారు.

## తాత్త్విక శతకాలు

భారతదేశం వేదభూమి. అనేక తాత్త్విక విషయాలను బహుధా చర్చించిన నేల. అందుకే అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ తాత్త్విక విశేషాలను గురించిన రచనలు కనిపిస్తున్నాయి. ప్రతితత్త్వాన్ని గురించి విశ్లేషించే పలువిధాలైన రచనలు వెలుగుచూచినట్లే శతకాలలో సైతం పలు తాత్త్విక శతకాలు తెలుగు నేలపై ప్రభవించాయి.

భారతీయుల ఆముష్మిక చింతన నాటి కాలము నుండి నేటి కాలము వరకు మహాసముద్రమంతటి తాత్త్విక విషయాలను ఇక్కడ పుట్టిన కృతులు ప్రతిబింబించాయన్నది పరమసత్యము. శతక ప్రక్రియ కూడా దీనికేమీ అపవాదం కాదు. అందుకే శతకకవులు తాత్త్విక శతకాలపై దృష్టి నిలిపి శక్తివంతమైన శతకాలను మనకు అందించారు. శతకసాహిత్యాన్ని కొత్త కొత్తమార్గాల వైపుగా మళ్ళించారు.

తెలుగులో పదునాఱవ శతాబ్దికి ఉన్న ప్రత్యేకతల్లో శతక సాహిత్య విస్తృతి

ఒకటి. అందులోనూ శతక రచనల్లో వైవిధ్యం పెరిగింది కూడా ఈ శతాబ్దిలోనేనని పరిశోధకుల ఆలోచన. సంస్కృత శతకాలలోవలెనే తెలుగు శతకాలలో భక్తి శతకాలు రూపొందినట్లు, తాత్త్వికి శతకాలు కూడా వెలువడ్డాయి. వైరాగ్యభావన, కపటభక్తి నిరసనము, గురుబోధల వైశిష్ట్యము, గురు శిష్య సంబంధాలలోని సల్లక్షణాలు, జ్ఞాన స్వరూపము, మాయా స్వరూపము, పిండోత్పత్తి క్రమము, కర్మజ్ఞానభక్తియోగ సంబంధి విశేషాంశములు, పరమాత్మ తత్త్వ నిరూపణము, మంత్రతంత్ర తత్త్వ విశేషాలు ఇవన్నీ తాత్త్విక శతకాల భూమిక. విషయ గాఢత ఈ శతకాలలో సంపూర్ణంగా పరివ్యాప్తమైంది. **సదానందయోగి శతకము, పరశురామ శతకద్వయము, హంసశతకము, పూర్వకర్మశతకము, మాయా శతకము,** రాజయోగప్రాధాన్యాన్ని వివరించే శతకాలు ఎన్నెన్నో ఈ కోవకు చెందిన శతకాలు వందల సంఖ్యలో ప్రాచుర్యం పొందాయి.

**ఆత్మ సీమనేలు నార్గురు రాజులు**
**మదము, క్రోధ, లోభ, మత్సరములు**
**కామో మోహములను ఘనులు దుర్జయులయా !**
**కాళికాంబ వీర కాళికాంబ !**

తత్త్వసంబంధమైన ప్రసిద్ధి చెందిన పదాలను అందించిన **వీరబ్రహ్మేంద్రస్వామి** రచించిన **కాళికాంబ సప్తతిలోని** ఈ పద్యము గొప్ప తాత్త్వికతను బోధించింది. వీరబ్రహ్మం గారి తత్త్వాలకు ఎంత ప్రాచుర్యం లభించిందో వీరబ్రహ్మం రచించిన **వీరకాళికాంబ సప్తతి** మొదలైన వాటికి కూడా అంతటి ప్రాచుర్యం లభించింది.

జీవుని లక్షణాలలో అరిషడ్వర్గాలను జయించడము అత్యంత ప్రధాన విషయం. ఉన్నత వ్యక్తిత్వాన్ని రూపొందింపదలచుకున్న ఎవ్వరైనా చేయవలసిన మొదటిపని ఇదే. దాదాపు అన్ని తాత్త్విక శతకాలు ఈ విషయంలో ఇదే అభిప్రాయాన్ని వెల్లడించాయి. పరిపూర్ణ వ్యక్తిత్వంతో భాసిల్లాలని కోరుకునే వ్యక్తుల ప్రాథమిక కర్తవ్యాన్ని యీ శతకాలు బోధించాయి.

తాత్త్విక శతక కవులలో **వేమన్న**కు కూడా పెద్ద పేరే ఉంది. సమాజంపై ప్రభావం చూపే చెడు నడతల్ని తన పద్యఖడ్గం ద్వారా చీల్చి చెండాడిన **వేమన్న** ఒక యోగి. తన పద్యాల్లో మనిషి సాధించాల్సిన ఆత్మజ్ఞానాన్ని గురించి, తాను పరిత్యజించాల్సిన కొన్ని ధర్మాలను గురించి, మనిషిని ప్రలోభపెట్టే కొన్ని గుణాల

నుంచి మనిషి తనను తాను ఎట్లా రక్షించుకోవాలో కూడా వేమన్న తన పద్యాల్లో చూపాడు. తాత్త్విక పరిష్కారాలదిశగా మనల్ని ఆలోచింపజేశాడు. నిజమైన బ్రహ్మజ్ఞానాన్ని ఆయన **'ఎరుక'** అని పిలిచాడు. అందుకే

**ఎరుక కన్నను సుఖమెలోకమున లేదు**
**ఎరుక నెఱుగ నెవని కెరుక లేదు**
**ఎరుక సాటిదెరుకె, ఎరుకయె తత్త్వము...**

అని స్పష్టంగా చెప్పి మనిషి ఎదగడానికి జ్ఞానాన్ని పొందాలనీ, అదే తత్త్వజ్ఞానమని బోధించాడు.

భక్తి, నీతి, శృంగార, వైరాగ్య తత్త్వాలను కలిపిన కవిత్వములు సంస్కృతము లోనూ, తెలుగులోనూ విస్తారముగానే వచ్చాయి. వాటిని తాత్త్విక సంకీర్ణశతకాలుగా విమర్శకులు పరిగణించారు. **భర్తృహరి** రచనలు వేమన పద్యములు ఈ మార్గానికి చెందినవే.

ఇంకా ఈ ధోరణిలో వెలువడినవే **శరభాంకలింగ శతకము, భావలింగ శతకము, సింహాద్రి రమాధిపశతకము, అహంకార శతకము** మొదలగునవి.

తెలుగు శతక ప్రక్రియలోనే ఒక ప్రత్యేకతను నిలబెట్టుకొన్న తాత్త్విక శతకములు సంఖ్యలోను, విషయ బోధనలోనూ గొప్పగా పరిగణింపదగినవే నన్న విషయము నిర్వివాదము.

## హాస్య శతకములు

నవరసాలలో హాస్యానికి అత్యంత ప్రాముఖ్యం ఉంది. హాస్యం మనిషి అంతరంగాన్ని కల్మషరహితం చేస్తుంది. అందుకే పలువురు సృజనాత్మక రచయితలు హాస్యాన్ని ఆశ్రయించి తమ తమ రచనలను లోకానికి పరిచయం చేసి ప్రసిద్ధి పొందారు.

సాహిత్యంలోని అన్ని ప్రక్రియల వారూ హాస్యాన్ని పండించే రచనలు అందించే యత్నం చేశారు. కాని చాలా సందర్భాలలో హాస్యం కేవలం అలంకారప్రాయంగానే మిగిలిపోయింది. హాస్యం కొరకు సంస్కృతకవులు కొన్ని ప్రత్యేక పాత్రలనే సృష్టించారు. ఆలంకారికులు దీని ప్రత్యేకతను విపులంగానే చర్చించారు. కాని వచన రచనలలో

దీని గొప్పదనం భాసించినట్లు మిగతా ప్రక్రియల్లో అంతగా భాసించలేదు. దీనికి ఆయా కృతికర్తల ప్రతిభ కూడా ఒక కారణం కావచ్చు.

హాస్యానికి వ్యంగ్యం జోడించినప్పుడు మాత్రం ఇది గొప్పగా రాణించింది. దీన్ని గుర్తించిన శతకకవులు తమ శతకాల్లో ఈ ప్రయోగం చేసి విజయాన్ని సాధించారు.

మళ్ళీ ఈ రంగంలోనూ **వేమన్న**దే మొదటిపీట. సమాజంపై వేసే దెబ్బల్ని హాస్యంద్వారా సాధించే యత్నం చేశాడు **వేమన్న**. చురుకైన దృష్టాంతాలతో వ్యంగ్యాన్ని హాస్యంతో జోడించి ఫలితం సాధించాడు.

అతి సుకుమారమైన హాస్యాన్ని అందించడంలో శతకం కొంత వెనుకబడి ఉన్నా, చమత్కారం సాయంగా శతక కవులు హాస్యాన్ని మిళితం చేసి ఆకట్టుకున్నారు.

ఈ కోవకు చెందినవే **చీపురుపుల్ల శతకం, విసనకఱ్ఱ శతకం, పకోడీశతకం** మొదలైనవి. అయితే చమత్కారం, హాస్యం కలిసిపోయిన యీ శతకాలను విశ్లేషించడం కొంత శ్రమతో కూడిన పనియే.

**'ఆంధ్రపత్రికతోడ అమృతాంజనం బిచ్చి తలనొప్పి బాపిన ధన్యుడితడు'** అని కీర్తిని గడించిన **కాశీనాథుని నాగేశ్వరరావు** గారి సృష్టి **"అమృతాంజనము"** అనే నొప్పి నివారిణి మందు. దీనిపై ఒక ప్రత్యేక శతకమే వెలుగుచూచింది. అనేక చమత్కారాలు పొదగబడిన ఈ శతకంలో పలుచోట్ల హాస్యం తొంగిచూస్తున్నది. వస్తువుకు ప్రాచుర్యం కల్గించే ప్రకటనలవలె కాకుండా ఒక విశిష్టతను సంతరించుకున్న హాస్య శతకం ఇది.

**వరవర్ణవిలసిత మగు**
**సురుచిర పాకాంచితగుణ శోభితమగుచున్**
**సరస మగుట నిన్ను మనో**
**హర కావ్యమనంగవలయు నమృతాంజనమా !**

అని అమృతాంజనాన్ని ఒక మనోహర కావ్య సదృశంగా కవి వర్ణించాడు. శబ్ద చమత్కారాన్ని ఆశ్రయించి ఈ విషయాన్ని సాధించాడు. వర్ణము, పాకము, రసము వంటి కావ్యసామగ్రిని అమృతాంజనమునకు ఆపాదించి పోలిక చెప్పిన చోట కనిపించిన సునిశిత హాస్యం ఈ శతకంలో పలుతావులలో ప్రకటమవుతుంది.

అయితే శతకాలలో హాస్యం చమత్కారాన్ని, వ్యంగ్యాన్ని ఆశ్రయించే అధికంగా కనిపిస్తున్నది గాని ప్రత్యేక రససిద్ధి వీటిలో లేదు.

కవి పాఠకునిని ఆకర్షించి కర్తవ్యోన్ముఖుణ్ణి చేయడానికి నిర్మించుకున్న పద్ధతుల్లో హాస్యం కూడా ఒకటి కనుక దీన్ని శతకకవులు ఆశ్రయించారు. కాని ఇది పూర్తిగా శతకాలలో సాధింపబడలేదనే చెప్పాలి. అయినా ప్రయత్నం మాత్రము జరిగింది.

**సామినేని వెంకటాద్రి (చీపురు పుల్ల శతకం), హరి బ్రహ్మేశ్వర కవుల (విసనకఱ్ఱ శతకం)** మొదలైన వారు ఈ మార్గంలో తటస్థిస్తారు.

ప్రయత్నం జరిగినా పరిపూర్ణ ఫలితాన్ని మాత్రం అందుకోలేక పోయినవి హాస్య శతకములు.

## శృంగార శతకాలు

శృంగారం రసరాజం. అన్ని రసాల్లోకి అత్యంత ప్రాధాన్యం కలిగింది శృంగార రసం. అందుకే సంస్కృతాది భాషల్లోని సుప్రసిద్ధ కవులందరూ ఈ రసానికి మిక్కిలి ప్రాముఖ్యం ఇచ్చారు. తమ రచనలలో దీన్ని 'అంగి'రసంగా అంగీకరించి ప్రయోగించారు. కొందరు కవులు మాత్రమే మరికొన్నింటిని ప్రధాన రసాలుగా కావ్యాలు నిర్మించారు.

తెలుగు కవులు కూడా శృంగారానికి అత్యంత ప్రాధాన్యాన్ని కల్పించారు. ఆ మార్గంలోనే శతకకవులు కూడా శృంగార శతకరచనలు చేశారు.

ఇక్కడ కూడా సంస్కృత సాహిత్యమూలాలే ప్రాధాన్యం వహించాయి. **భర్తృహరి** రచించిన **త్రిశతి**లో శృంగార శతకం ఒకటి. అదే విధంగా **అమరుక** కవి రచన ప్రశస్తమైన శృంగార రచన. ఇవన్నీ తెలుగు కవులకు ప్రేరణను ఇచ్చుట వల్ల తెలుగులో శృంగార శతకాలు ఉద్భవించి ఉండవచ్చు.

పార్వతీ పరమేశ్వరుల ప్రణయము, గోపికా కృష్ణుల శృంగారము, అలమేలుమంగా వేంకటేశ్వరుల ప్రేమల ఆధారముగా తెలుగులో శృంగార శతకాలు రూపుదిద్దుకున్నాయి.

**నించిన పంచదారలను, నేతులుఁదేనెలుఁగమ్మగాఁగ, దా**
**లించిన కూరలున్ బరిమళింపగ, నయ్యల మేలుమంగ వ**
**డ్డించిన నిర్మలాన్నములు దెందమెలర్పఁగ నారగింతు నీ**
**మించిన దేయు చేతులను మేలము లాడుచు వేంకటేశ్వరా !**

అన్న **తాళ్ళపాక అన్నమయ్య** పద్యం అలమేలుమంగా వేంకటేశ్వరుల సరస సల్లాపాల సున్నిత శృంగారాన్ని ద్యోతకం చేస్తున్నది.

దైవ సంబంధమైన శృంగారాన్ని శతకకవులు పవిత్రంగా భావించారు. భక్తి శతకాలలో కొన్ని కొన్ని ఘట్టాలలో శృంగార రస స్పర్శ కనిపించినా తరువాత తరువాత వెలువడిన శతకాలు సంపూర్ణ శృంగార శతకాలై విరాజిల్లినవి.

సంయోగ, వియోగ శృంగార భేదాలు రెండూ చోటు చేసుకున్నాయి తెలుగు శృంగార శతకాలలో. వానికి సంబంధించిన అధిక వర్ణనలు కూడా ఈ శతకాలలో చోటు చేసుకున్నాయి. శతక కావ్యాలలో విశేషంగా చెప్పుకోదగిన శృంగారశతకం **పసులూరి సోమరాజు రచించిన ఇందూ శతకము.** సంస్కృత సాహిత్యమునందలి **మేఘ సందేశాది**దూత కావ్యాల వలె ఇది శతకరూపములో నున్న ఒక దూతకావ్యము. బృందావన విహారియైన శ్రీకృష్ణుని వెంటనే తోడుకొని రమ్మని చంద్రుని దూతగా ఒక గోపిక పంపిన ఇతివృత్తము ఈ శతకములో ఉంది. ఇందులో భాగవతములోని రాసక్రీడావర్ణనము, **జయదేవుని** అష్టపదులు, **శ్రీకృష్ణలీలాతరంగిణి** వంటి రచనల ప్రభావం బాగా కనిపిస్తుంది. **గంగాధర కవి కృత కీరవాణి శతకము, బెంగల్వారాయకవి మదన గోపాల శతకము, బొడ్డు లక్ష్మీనారాయణ హేలాపురీ శతకము, దబ్బీ నరసయ్య కవి కలువాయి శతకముల** వంటి ఎన్నో శృంగార శతకములు తెలుగులో వెలువడి శృంగార శతక విభాగమును పరిపుష్టము చేసినవి.

అయితే క్రమక్రమంగా శృంగార శతకములు అధికభాగము అతివేల శృంగార వర్ణనల కాలవాలమై క్షీణ ప్రబంధములకన్నను దిగజారి పోయి తమ గౌరమును, ప్రశస్తిని కోల్పోయి శతకశాఖకే కళంకములై నిలిచాయి. **గోపీనాథము వేంకటకవి** వంటి ప్రసిద్ధులు కూడా తమ తమ శతకాలను ఇంచుమించు కామశాస్త్రాల భాష్య గ్రంథాలుగా సిద్ధం చేశారు. దీనికి వారి **బ్రహ్మానందశతకమే** ప్రబల ఉదాహరణము. రతి విధానాలు, చౌశీతిబంధాలు, ఆలింగన చుంబునాదులను అతిగా వివరించి

శతక ప్రతిష్ఠకు కొంత భంగం కలిగించారు.

ఎవరో **మల్లాది శివరామకవి** వంటి ఉత్తమకవులు శృంగార శతకములో దాంపత్యవైశిష్ట్యము, స్త్రీ, పురుషుల అనురాగము, భార్యాభర్తల ప్రణయమును సుకుమార రీతిలో వర్ణించి మనోహరమైన **'శృంగార శతకము'** ను అందించినారు.

భగ్న ప్రణయము, స్త్రీ జీవితమందలి వివిధ దశలు మనోహరముగా వర్ణించిన కొన్ని సున్నిత శృంగార శతకములు వెలువడి దీనికొక స్థాయిని చేకూర్చినవి.

ఏది ఏమైనను కేవలము ప్రబంధములకే పరిమితమైన శృంగారమును శతకాల వరకు ప్రస్థానింపజేసి ఒక ప్రత్యేక శాఖకు ప్రాణభూతమై నిలిచే శృంగార శతకాలను అందించిన కవుల దృష్టి శ్లాఘాపాత్రము. రసరాజమైన శృంగారానికి గొప్ప స్థానాన్ని కల్పించిన కవులు అభినందనీయులు.

## చారిత్రక శతకములు

ప్రతిజాతికి ఒక చరిత్ర ఉంటుంది. ఆ చరిత్ర నిర్మాణానికి ఆ జాతిలోనే జన్మించి జాతికొరకు తమ జీవితాల్ని పణంగా పెట్టి కారణభూతులైన చారిత్రక వ్యక్తులు ఎందరెందరో ఉంటారు. తరతరాల మహావ్యక్తుల అస్తిత్వాలను కాపాడుకోవడమే వారసులైన వారి బాధ్యత. అదే సంస్కృతిగా నిలుస్తుంది. ఆ విధమైన మహామహులు మన భారతదేశంలో లెక్కలేనంత మంది వ్యక్తులు కనిపిస్తారు. వేలాది సంవత్సరాల కాలంలో కాలం నిలిచినన్నాళ్ళు నిలిచిపోయే మహానుభావులు మన జాతికి మూలస్తంభాలై నిలిచిన వాళ్ళు మనభారతీయ సంస్కృతికి మూలపురుషులై వెలిగిపోయారు.

అంతటి మహాపురుషుల చరిత్రలను, వారి కాలాలను ఒక ప్రత్యేకదృష్టితో, ప్రత్యేక శ్రద్ధతో కవులు గానం చేస్తూ వచ్చారు. అనేక కావ్యాలు అటువంటి వారి స్మృతిలో వెలువడుతూనే ఉన్నాయి. చిరస్థాయిగా వారి కీర్తికి పతాకాలై నిలుస్తున్నాయి.

తెలుగు శతక కవులు కూడా ఇట్లాంటి చారిత్రక వ్యక్తులను ఏ మాత్రం విస్మరించకుండా తమ తమ శతకాల్లో వారి కీర్తిని నిబద్ధించి చారిత్రక శతకాలకు రూపకల్పన చేశారు.

సమాజం ఆయా కాలాలలో ఎదుర్కొన్న సంక్షోభాలు, సంఘర్షణలు కూడా

శతక బద్ధం చేసి తమ సామాజిక బాధ్యతను శతకకవులు నిర్వహించారు. తద్వారా ఆయా కాలాల చరిత్ర నేటికీ మనకు అవగాహనలోకి రావడం జరిగింది.

దేశచరిత్రలోని సంఘర్షణలను చిత్రించే పలు శతకాలు గొప్ప చారిత్రక శతకాలుగా నిలిచిపోయాయి. తాము నమ్మిన దైవాలు కూడా లేదు. జాతి సంక్షోభంలో ఏ మాత్రం సహకరించటం లేదేమోనన్న ఒక భావాన్ని అనేక రీతుల్లో శతకాల ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంలో హేళనను, వ్యాజస్తుతిని ఆశ్రయించి తమ తమ ఇష్టదైవాల్ని కొలుచుకున్నారు. వస్తువును బట్టి వీటికి చారిత్రక శతకాలుగా కీర్తి లభించింది. చరిత్రలోని కొన్ని ప్రత్యేక సందర్భాల్లో పరాయి పాలకుల దండయాత్రలలో కష్టాలను అనుభవిస్తున్న జాతి జనులు బాధలను పద్యబద్ధం చేసిన శతకకవులు చిరస్మరణీయులు. అవే నేడు మనకు లభిస్తున్న చారిత్రక శతకాలు. **సింహాద్రి నారసింహ శతకము, ఆంధ్రనాయకశతకము** వంటి శతకములన్నీ ఈ మార్గానికి చెందిన చారిత్రక శతకాలే.

**మాన్యంబులీయ సమర్థుడొక్కడులేడు, మాన్యముల్ చెఱుప సమర్థులంత**
**యెండిన ఊళ్ళగోడిఱిగింపడెవ్వండు, పండిన ఊళ్ళకే ప్రభువులంత**
**ఇతడు పేదయటంచు నెరిగింపడెవ్వండు, పెఱకాంతఱంకెన్న పెద్దలంత**
**ఇట్టి దుష్టులకధికారమిచ్చినట్టి .......**

ప్రభువులు పరిపాలిస్తే సమాజం ఎంతగా సంక్లిష్టమవుతున్నదో ఆనాటి కల్లోల పరిస్థితులను చారిత్రక శతకాలు మన కళ్ళకు కట్టించాయి.

పేరుకు భక్తి శతకాలే అయినా పదిహేడు, పదునెన్మిదవ శతాబ్దులలో వెలువడిన పలు శతకాలు ఆనాటి సమాజస్థితిగతులను మనకు దృశ్యమానం చేసి గొప్ప చారిత్రక శతకాలై నిలిచాయి.

**భల్లా పేరయ కవి భద్రగిరి శతకము** నాటి విదేశీ దండయాత్రలను గురించి, యవనసైన్యాలు చేసిన ఆగడములను గురించి గొప్పగా వివరించింది. ధంసా చరిత్రము, జోగి పంతులసాహసము, భద్రాచలరాముని పోలవరానికి తరలించడం, ప్రశాంతత ఏర్పడిన అనంతరము తిరిగి స్వామిని స్వస్థానములో స్థాపించుట వంటి ఈ చారిత్రక సంఘటనలను **భల్లాపేరయ** కవి తన శతకములో వివరించి దాన్నొక ప్రామాణిక చారిత్రక శతకముగా నిలిపాడు. **నాగశాస్త్రి** రచించిన **సుబ్రహ్మణ్య** శతకము మొదలగునవి ఈ కోవలోని శతకములే.

ఔరంగజేబు వంటి వారి దండయాత్రలలో జీర్ణమైపోయిన హిందూక్షేత్రముల దుస్థితిని శతకకవులు తమశతకాలలో పద్యాలవల్ల పదికాలాల పాటు నిలిచిపోయే విధంగా నిబద్ధించారు.

రెండవ ప్రపంచయుద్ధ వృత్తాంతము, భారతదేశమునందు ఏర్పడిన జాతీయ ప్రభుత్వపు తీరుతెన్నులు, భారత రాజకీయరంగవిశేషాల సంగ్రహము వంటి అంశాలను తమ శతకాలలో కవులు పొందుపరచి వాటికొక ప్రామాణ్యాన్ని కలిగించారు శతక కవులు.

ఆంధ్రరాష్ట్రోద్యము, తెలంగాణా ఉద్యమాలు, ముల్కీచట్టములు స్వరూపము - వివిధ ఆందోళనల స్వరూప స్వభావాలను పలు శతకాలు తమ పద్యాల్లో భద్రపరిచాయి.

అంబేద్కర్, గాంధీ వంటి మహామహుల స్మృతుల్ని శతకాల్లో అందించి చారిత్రక శతకాల విస్తృతిని పెంచారు.

భారత దేశ చరిత్రను తెలిపే ప్రత్యేకశాఖ చారిత్రక శతక శాఖ.

## కథాత్మక శతకాలు

ఏ సృజనాత్మక రచనకైనా కథ ప్రధానమైన విషయం. అదేవిధంగా కావ్యలోకంలో కావ్యాలకు, నాటకాలకు కూడా ప్రధానంగా కథను ప్రధాన విషయంగా పరిగణించారు. కాని శతక సాహిత్యంలో మాత్రం ఉన్న పద్యాలన్నీ ముక్తకాలు. దేనికదే స్వతంత్రమైంది. సంస్కృత ప్రాకృతాలనుండీ ఈ సంప్రదాయం కొనసాగి వస్తూనే ఉన్నది. కాని కొందరు కవులు తెలుగులోను కథాశతకాల రచనకు శ్రీకారం చుట్టారు. ఒక్కొక్క చోట కథ లేకున్నా కొన్ని ప్రత్యేక విషయాలపై శతకాల్ని నిర్మించారు. కాలక్రమంలో కావ్యవస్తువువలె శతక వస్తువు కూడా ఉన్నట్లు తెలుస్తున్నది.

ఐతిహాసిక, చారిత్రక విశేషాలతో శతకరచన చేసిన సందర్భాలలో ఈ పరిణామం చోటు చేసుకుంది. వీటితోబాటు జీవిత కథాత్మకములు, ఆత్మ కథాత్మకములు అయిన శతకాలు కూడా వెలువడినవి. రామకథాత్మక శతకాలు ఇరవైకి పైగా వెలువడినవి. రామకథను కొంత సంక్షిప్తపరచి వంద పద్యాలలో ఇమిడించి శతకాలు

అందించారు. కొందరు కవులు తమ అభిరుచుల మేరకు రామాయణంలోని కొన్ని ఘట్టాలను గ్రహించి ఆ కథతో శతకాల్ని రచించారు. కొన్ని అవాల్మీక విషయాల్ని కూడా జోడించి కథాత్మక శతకాలు వ్రాశారు. **లవకుమార శతకము** వంటివి దీనికి ఉదాహరణములు. కొన్ని కొన్ని రామకథా ఘట్టములకు సంబంధించిన వానిలో ముఖ్యమైన విభీషణ శరణాగతి, రావణుడు మాయా సీతను హరించినట్లుగానే చెప్పే కొన్ని ఘట్టాల కథలతో శతకాలను రచించారు. **'ధైర్య శతకము'** అటువంటిదే. **'ప్రసన్నరాఘవము'** అనే శతకములో రామపట్టాభిషేక విశేషములను వర్ణించిన సందర్భాలున్నాయి. **జూలూరి లక్ష్మణ** కవి రచించిన **'ప్రసన్న రాఘవ'** శతకము భాస్కర రామాయణమును అనుసరించినది. **సూర్యనారాయణ మూర్తి** కవి **'ముక్కల్లు సీతారామ'** శతకాన్ని రెండుభాగాలుగా రచించడం విశేషం. పూర్వభాగంలో రామాయణ కథ, ఉత్తరభాగంలో ఉత్తర రామాయణ కథ ప్రధానవస్తువు. **లక్ష్మీనరసింహ** కవి రచించిన **'సీతాపతి'** శతకము శ్రీరాముని ఉన్నత వ్యక్తిత్వమును వ్యక్తీకరించిన శతకము.

రామకథ ఆకర్షించినంతగా శతకకవులను భారతకథ ఆకర్షించలేదో, భారత కథలో పలువురు కవులకు ఆసక్తి తక్కువైనదో ఏమో గాని రామాయణ కథాత్మక శతకములకన్నను భారతకథాత్మక శతకములు సంఖ్యలో తక్కువగానే వెలువడినట్లు తెలియుచున్నది. ఒక నాలుగైదు శతకాలు మాత్రమే భారత కథాత్మకమైనవి కనిపిస్తూ ఉన్నవి. సంపూర్ణ భారత కథ కాక కొన్ని కొన్ని ప్రత్యేక ఘట్టములను, కొన్ని కొన్ని ప్రత్యేక ఘట్టములను, కొన్ని కొన్ని ప్రత్యేక వ్యక్తిత్వముగల పాత్రలను వస్తువు గ్రహించి ఈ శతకాలు వెలుగుచూసినవి. **భువనగిరి లక్ష్మీకాంతమ్మ** భారతకథలోని శ్రీకృష్ణుని పాత్రను వస్తువుగా గ్రహించి శతకరచనను చేసింది. ఈ విధమైనవే భారత కథాత్మకములయిన శతకాలు కనబడుచున్నవి.

శ్రీమద్భాగవతానికి సంబంధించిన కొన్ని శతకాలు కనిపిస్తున్నాయి. భాగవత కృష్ణవర్ణనకు సంబంధించిన వర్ణనతో **జూలూరి తులశమ్మ 'కృష్ణ శతకము'ను** రచించింది. భాగవతములోని ప్రథమస్కంధ, దశమస్కంధ విశేషాలను పొందుపరచి **తుర్లపాటి పురుషోత్తమ కవి** రెండు శతకాలు రచించినట్లు తెలుస్తున్నది.

ఇంకా అనేక పురాణ సంబంధి విషయాలతో శతకాలు వచ్చాయి. **మల్లయార్యుని**

**'మార్తాండ' శతకము** సూర్యవైవాహికోదంత సంబంధమైనది. అనేక వివాహ సంబంధి విషయాలు ఇందులో వర్ణింపబడినవి. అనేకములైన వివాహ సంబంధములగు దేశీయాచారములు ఈ శతకంలో చోటు చేసుకున్నాయి. **వెంకటరంగకవి** 'మీనాక్షి' శతకము **మీనాక్షీ సుందరేశ్వరుల,** పరిణయ వర్ణనము కలిగినది. **లక్ష్మీనరసింహరాజు** 'కస్తూరి **రంగనాయకు శతకము. నారయ్య** రచించిన **'విశ్మకర్మ'** శతకము ఈ మార్గం లోనివే.

ఆత్మకథలు సామాజిక పరిశీలనమే మిక్కిలి తోడ్పడే చరిత్రలు. శతక శాఖలోనూ ఈ ఆత్మకథ ఒక ప్రధాన వస్తువై నిలిచింది. తెలుగులో మొట్టమొదట పద్యరూపంలోను, అందులో శతక రూపంలోను వెలువడిన శతకములు శతక శాఖకే ఒక ఔన్నత్యాన్ని కలిగించాయి. **మండపాక పార్వతీశ్వర శాస్త్రిగారు** తమ అరవైయవయేట రచించిన **'హరిహరేశ్వర'** శతకము వీరి జీవిత విశేషాల సమాహారము. **కొక్కొండ వెంకటరత్నంగారు** రచించిన **'బిలేశ్వర'** శతకము కూడా ఈ కోవలోనిదే.

తమ తమ జీవితాల్లోని కొన్ని ప్రధాన ఘట్టాలను మాత్రమే శతకంగా మలచిన కవులు కూడా ఉన్నారు. ఆయా కవుల వ్యక్తిత్వాలు బోధపడే అవకాశం ఉంది. **తిరుపతి వేంకటకవులు** రచించిన **'ఆరోగ్య భాస్కర' మృత్యుంజయ, కామేశ్వరీ, ఆరోగ్య కామేశ్వరీ** వంటి శతకాలు ఇటువంటి శతకాలే.

**గరికపాటి మల్లావధాని 'భారతాంబిక' శతకం** నాటి జాతియోద్యమమును కళ్ళకు కట్టించే గొప్ప చారిత్రక శతకం. తమ స్వీయ అనుభవాలతో బాటు నాటి సామాజిక స్థితిని తెలిపే శతకం ఇది.

ఆంధ్రవాల్మీకి **వావిలికొలను సుబ్బారావుగారి 'టెంకాయ చిప్ప'** శతకం, **తాడేపల్లి వేంకటప్పయ్య శాస్త్రి** గారి **'దారుణ' శతకం, వాజపేయాజుల రామసుబ్బయ్య** గ కవి **'ఆరోగ్య రాజేశ్వరీ', 'ఆరోగ్య వేంకటేశ్వర'** శతకములన్నీ ఇటువంటి జీవితానుభవాల సంపుటులే. ఆత్మకథా సంబంధులే. **ఏలె ఎల్లయ్య** కవి **'భార్గవీ' శతకము. వింజమూరి లక్ష్మీనరసింహ** కవి **'మృత్యుంజయ' శతకము, పెన్మత్స సత్యనారాయణ** రాజు **'భీమేశ్వర' శతకము** వంటివి తమ తమ కష్టనష్టములను గురించి, తమ కుటుంబసభ్యుల

సమస్యలను గురించి, తమ జీవన సమరాలను గురించి వర్ణించిన కథాత్మక శతకములే. ఒక ప్రత్యేకదృష్టితో రచించిన కథాత్మక శతకములు ఒక విశేష ప్రయోగాలేవననడంలో ఎటువంటి అతిశయోక్తి కాదు.

## అనువాద శతకములు

తెలుగు సాహిత్యమే అనువాదంతో ప్రారంభమైంది. మహాభారతానువాదంతో తెలుగు సాహిత్యానికి శ్రీకారం చుట్టిన నన్నయభట్టుకు పూర్వం **'గాసట బీసట్లే జదివి గాధలు'** త్రవ్వుకొనేవారన్నది కవులు చెప్పిన మాట.

సంస్కృత ప్రాకృత భాషలలోల అప్పటికే సాహిత్య సృజన అపారంగా సాగింది. అందుకే తెలుగు కవులు యీ భాషలను ఆశ్రయించారు. అయితే మనం ఏర్పరచుకున్న నియమాలకు అనుగుణంగా శతకసాహిత్యం యీ రెండు భాషలలో లేకున్నా మూలాలు మాత్రం వీటివేనన్నది నిర్వివాదం.

సంస్కృతంలో అప్పటికే **నీలకంఠ దీక్షితులు, భర్తృహరి, అమరుక కవి, మయూరు**ని వంటివారు శతకాల సృష్టి చేసి కీర్తిని గడించిరి. ప్రాకృతంలో **హాలుడు** రచించిన **'గాథా సప్తశతి'** అప్పటికే ప్రసిద్ధము. తొలి రోజుల్లో పురాణేతిహాసాలపై తెలుగు కవులు దృష్టి సారించినా క్రమక్రమంగా శతక స్తోత్రసాహిత్యాలపై తమదృష్టిని నిలపడం మూలంగా ఆ రచనల అనువాదాలు తెలుగులో వెలువడ్డాయి.

ప్రాకృతంలో **'గాథాసప్తశతి'**లో అనేక శతక లక్షణాలు కనిపిస్తాయి. ముఖ్యంగా ముక్తక లక్షణం. అది ఏక కర్తృకం గాకపోయినా సంపూర్ణ స్వాతంత్ర్యం కలిగిన ముక్తక సముచ్చయం కనుక శతక లక్షణం ఉన్న గ్రంథంగానే పరిగణింపవచ్చు. నాటి కవిసార్వభౌముడైన **శ్రీనాథ మహాకవి** మొదలు నేటి **రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ** గారి వరకు హాలుని రచనను అనువదిస్తూనే వచ్చారు. **గట్టి లక్ష్మీనృసింహశాస్త్రి గారు, వేటూరి ప్రభాకర శాస్త్రి, కూచిభొట్ల ప్రభాకరశాస్త్రి, వీర రాఘవ శాస్త్రి**, మొదలైన కవులు కొన్ని కొన్ని గాథలను, కొందరు మొత్తం గాధా సప్తశతిలో ఏడువందల గాథలను అనువదించారు. **వాసిరెడ్డి వెంకట సుబ్బయ్య** దాదాపు మూడువందల శృంగార గాథలను యెంచుకొని తెలుగులోనికి **'గాథామృతము'** పేర అనువదించిరి. పెదకోమటి వేమారెడ్డి ప్రభువు గాథాసప్తశతిలోని కొన్ని గాథలకు **'భావదీపిక'** పేర

వ్యాఖ్యానము రచించెను. దాని ఆధారంగా తెలుగులో **దిగుమర్తి సీతారామస్వామి** గారు 'వెలుగు నీడలు' అను పేరున ఆంధ్రీకరించిరి. గాథాసప్తశతి అనువాదాలు తెలుగు సాహిత్యానికి వన్నె పెట్టినవి మాత్రమే గాక నాటి ప్రాకృత కవుల కవితాసౌందర్యాన్ని, భావఔన్నత్యాన్ని మన కళ్ళకు కట్టించినవి.

సంస్కృతానువాదముల విషయానికి వస్తే సంస్కృత భాషలో అత్యంత ప్రశస్తి పొందిన **భర్తృహరి సుభాషిత త్రిశతి** ని తెలుగులోనికి అందమైన పద్యముల ద్వారా **ఎలకూచి బాలసరస్వతి, పుష్పగిరి తిమ్మనాది** కవులు అందించడం తెలుగు సాహిత్యములో గొప్ప సందర్భం. **ఏనుగు లక్ష్మణకవి** చేసిన **భర్తృహరి** అనువాదము తెలుగు నాట సుప్రసిద్ధానువాదము. ఇంకను **పోచిరాజు వీరన్న, గురురాజుకవి, వెల్లాలనరసింగ** కవి వంటి ఎందరోకవులు వీటిని అనువదించిరి. కొందరు మూలానికి యథాతథానువాదం చేస్తే మరికొందరు భావానువాదమునకు పరిమితులై అనువదించిరి.

**మయూరుని 'సూర్య'** శతకం సంస్కృతశతకాలలో అత్యంత ప్రశస్తిని సంపాదించుకున్న శతకం. గొప్ప కల్పనలకు, భావౌన్నత్యానికి, సమాస ఘటనకు ఈ శతకం పెట్టింది పేరు. దీనికి అబ్బురపడిన **శ్రీనాథుడం**తటి కవి తన కావ్యంలో కొన్ని పద్యాల్ని సందర్భోచితంగా తెలుగులోనికి అనువదించాడు. అవి ఈ శతకం గొప్పదనాన్ని చెబుతున్నది. **బొడ్డపాటి పేరయకవి 'సూర్యా! పద్మినీ వల్లభా!'** అనే మకుటంతో అనువదించాడని కొన్ని లక్షణ గ్రంథాలవల్ల తెలుస్తున్నది. **వడ్డాది సుబ్బరాయకవి, ఆకుండి వ్యాసమూర్తి, దాసు శ్రీరాములు** వంటి కవులు కొందరీశతకానువాదం చేసినట్లు విమర్శకులు తెలియజేయుచున్నారు. **'ఆరోగ్యం భాస్కరిదిచ్ఛేత్'** అన్నది పెద్దల మాట. సూర్యుని ఆరాధించడం సంపూర్ణ ఆరోగ్యహేతువన్న నమ్మకం వల్లనే ఈ శతకం గురించి కవులు యోచించారన్నది సత్యం. సాక్షాత్తు **మయూరుడే** అనారోగ్యం నుండి ఆరోగ్యం వైపుగా వెళ్ళడానికే ఈ **'సూర్య'** శతకాన్ని రచించాడని విశ్రుతి. **ఆకెళ్ళ బుచ్చిరామశాస్త్రి** వంటి కవులు **'శతక భాస్కరము'** వంటి శతకాల్లో ఎన్నో **మయూరుని** శ్లోకాలను అనువాదాలను చేశారు. **మయూరుని సూర్యశతకం** తెలుగువాళ్ళను అమితంగా ఆకర్షించింది కనుకనే **కొంగె సుధాకర రావు** వంటి ఆధునిక కవులు

కూడా ఈ శతకాన్ని అనువదించి ఆనందించారు.

**'అమరుక కవేః ఏక శ్లోక ప్రబంధ శతాయతే'** అని ప్రశస్తి పొందినవాడు **అమరుక కవి.** ఆయన రచించిన **అమరుక శతకమును** పలువురు తెలుగు కవులు తెలుగులోనికి అనువదించారు. ఈ శతకం ధ్వని, శృంగార ప్రధానమైనది. విష్ణు **సర్వశాస్త్రి, మండపాక పార్వతీశ్వర శాస్త్రి, సాధుపల్లి చంద్రశేఖర శాస్త్రి, వారణాసి అచ్యుత రామ కవి, వట్టిపల్లి నర కంఠీరవ శాస్త్రి, గరికపాటి మలావధాని, అక్కిరాజు వేంకటేశ్వర శర్మ, వింజమూరి శివరామారావు, జయంతి రామయ్య పంతులు, గట్టి లక్ష్మీనృసింహశాస్త్రి, కాళహస్తీశ్వర శర్మ** మొదలైన పండితకవులెందరినో యీ **'అమరుక'** శతకము ఆకర్షించి వారిని అనువదించుటకు ప్రేరణ కలిగించింది. దాదాపు అనువాదకులందరు **అమరుకుని** కావ్య నిర్మాణ నైపుణ్యాన్ని తెలుపు విధముగనే తమ తమ అనువాదాలను నిర్మించారు. **అమరుకుని** ప్రతిభను నూటికి నూరు శాతము తెలుగువారికి పరిచయం చేశారు.

**మూక కవి 'మూక పంశతి'ని భల్లటుని** శతకాన్ని మట్టికవి బిరుదును పొందిన **వాంఛేశ్వరుని 'మహిష'** శతకాన్ని, **నీలకంఠ దీక్షితుల 'కలివిడంబన'** శతకాన్ని పలువురు కవులు తెలుగులోనికి అనువదించిన ఆయా సంస్కృత కవుల ప్రతిభను తెలుగువారికి పరిచయం చేశారు.

అనువాదాల విషయం వచ్చే సందర్భంలో గుర్తు చేసుకోవలసిన మరో అంశం తెలుగు నుండి సంస్కృతాది భాషలలోనికి అనువదింపబడిన శతకముల విషయం. **మల్లికార్జున పండితారాధ్యుల 'శివతత్త్వ సారము'** ఆయనే కన్నడములోనికి అనువదించినట్లు తెలియుచున్నది. **సుమతి, వేమన** వంటి శతకములు కన్నడ, ఉ ర్దూ భాషలలోకి అనువదింపబడుట విశేషము. **రాఘవేంద్రరావు 'జజ్బ్'** ఉర్దూలోకి అనువదించిన ఈ శతకములు మిక్కిలి ప్రఖ్యాతి గాంచినవి.

అనువాదముల వల్ల శతక వాఙ్మయశాఖ మరింత పరిపుష్టి చెంది ప్రకాశించినదనుట సత్యవిషయము.

## భాషా వ్యాకరణ నిఘంటు ప్రహేళికా శతకాలు

భాషా విషయం వచ్చేసరికి అనేక విశేషాలు చోటుచేసుకునే అవకాశం

ఉంటుంది. శతకాల మూలాలు సంస్కృత ప్రాకృతాది భాషల్లో ఉన్నట్లుగానే భాషా మూలక విశేషాలు కూడా ఆ భాషల అడుగుజాడల్లోనే చూడవచ్చు.

సంస్కృతంలో నిఘంటువులు శ్లోకరూపంలో ఉంటాయి. **అమర కోశము, వైజయంతి** వంటివి దీనికి ఉదాహరణము. శ్లోకరూపంలో ఉండటం వల్ల పలురకాల సౌలభ్యాలు ఉన్నాయి. అందుకనే తెలుగు కవులు కూడా పలు పద్య నిఘంటువులకు పునాదులు వేశారు. అయితే ఆ పద్య నిఘంటువులను శతక రూపంలో నిర్మించారు. దీనికి **గణపవరపు వేంకటకవి రచించిన 'వేంకటేశాంధ్రము'** ఉదాహరణ. ఇది అచ్చతెనుగు నిఘంటువు. నిర్మాణ క్రమంలో **అమరకోశము** దీనికి ఆదర్శము. **అమరకోశము**వలెనే వర్గవిభజన ఇందులో కనిపిస్తుంది. పూర్తి స్థాయి శతక లక్షణములతో నున్న పద్య నిఘంటువు యీ **'వేంకటేశాంధ్రము'**. ఇందులో మకుట నియమం కూడా పాటింపబడింది.

**సాంబమూర్తి** అందించిన **'సాంబనిఘంటువు'** కూడా శతకమే. **'నానార్థ శివ'** శతకము కూడా నిఘంటు శతకమే. ఆధునిక కాలమందలి 'నానార్థశతకము' కూడా ఇటువంటిదే. దీనిని రచించిన కవి **కోగంటి దుర్గా మల్లికార్జునరావు.**

వ్యాకరణానికి భాషతోనున్న సంబంధము విడదీయరానిది. భాషకు క్రమపద్ధతిని కల్పించేది వ్యాకరణమే. అందుకే శతకాలలో కొన్ని వ్యాకరణ సంబంధమైనవి కూడా వెలువడినవి. **తాళ్ళపాక తిరుమలాచార్యుల** వారి **'రేఫ అకారము'** ఇటువంటిదే. ఇది మకుటముతో కలిగిన 108 పద్యములున్న సంపూర్ణ శతకము. రేఫ యుక్త పదములు, పదముల వర్గీకరణ వంటి పలు వ్యాకరణాంశాలు ఈ శతకంలో ఉన్నాయి.

**గిడుగు సీతాపతిగారి 'భారతీ'** శతకము వ్యవహారిక భాషావిశేషాలను, ప్రాచీన కవుల వ్యావహార ప్రయోగాలను తెలిపే వ్యాకరణ శతకం. వ్యాకరణ విశేషాలను, భాషా సౌందర్యాన్ని తెలియజేప్పే పలు శతకములు **మల్లికార్జునరావు గారు** రచించి ఈ విషయంలో ముందడుగు వేశారు.

సంస్కృతముతో ప్రహేళికలు లెక్కలేనన్ని ఉన్నాయి. చమత్కారమేగాక పాఠకుని మెదడు చురుకునకు పరీక్షగా నిలిచేవి యీ ప్రహేళికలు. ఈ పద్ధతిలో కొందరు తెలుగుకవులు కట్టు పద్యములు అంటే ప్రహేళికలతో కూడిన తెలుగు శతకాల అందించారు. ఊహాశక్తి పెరగడంతో బాటు, విజ్ఞాన వినోదాలను ఈ శతకాలు అందించాయి. **'తిరుమలేశ, అమాత్రార్థశతకము, గానలోల శతకము'** మొదలైనవి ఈ

పద్ధతిలో పేర్కొనదగిన శతకములు, **దుంపల రామిరెడ్డి, చావలి పూర్ణయదాసు** వంటి కవులు ఇటువంటి శతకములు అందించిరి.

మనిషి మేధను, మనస్సును రెండింటిని మరింతగా ఎదిగే పద్ధతిని చూపించిన శతకములు భాషావ్యాకరణ, నిఘంటు ప్రహేళికాశతకములు.

## వివిధ వస్తు శతకములు

దశరూపకకారుడు వస్తువు విషయంలో ఒకమాట చెప్పాడు.

**రమ్యం జుగుప్సితముదార మథాపి నీచం**
**ఉగ్రం ప్రసాది గహనం వికృతంచవస్తు**
**యద్వాప్యవస్తు కవిభావుక భావ్యమానం**
**తన్నాస్తి యన్నవరసభావముపైతి లోకే**

(రమ్యమైనదైనా, జుగుప్సను కలిగించేదయినా, ఉదారమయినదయినా, నీచమయినదయినా, భయంకరమయినదయినా, ప్రసన్నమయినాదయినా, క్లిష్టమయినదయినా, అసలది వస్తువే కాకపోయినా మంచి భావుకుడయిన కవి హృదయంలో భావింపబడితే ఆ వస్తువు తప్పక రసభావ సిద్ధిని పొందుతుంది.)

ఇంతకన్నా అపరిమితంగా వస్తువును గురించి చెప్పిన లాక్షణికుడు గాని, కవి గాని లేడు. అంటే వస్తువు కవి భావనకు సంబంధించినదన్న విషయం దీనివల్ల తెలుసున్నది. అదే కవులకు వస్తువైవిధ్యాన్ని అందించింది. పలు వస్తువులతో కావ్యాలు ఉద్భవించాయి.

శతక సాహిత్యంలో కూడా వస్తువుకు ప్రాధాన్యం ఉంది. సాధారణంగా భక్తి శతకాలలో భక్తి ప్రధానవస్తువు, చారిత్రక శతకాలలో చరిత్ర ప్రధాన వస్తువు ఇట్లా ఆయా శతకాలు ఉంటాయి. అయితే వస్తువు సమాజ సంబంధి అయినప్పుడు ఆ సమాజంలో ఉన్న అన్ని వైవిధ్యాలు శతకంలో రూపుదిద్దుకుంటాయి. అవి జాగ్రత్తగా పరిశీలిస్తే వైవిధ్యం ద్యోతకమవుతుంది.

సమస్యాపూరణము, స్మృతి, శాస్త్ర, వర్ణనాత్మక పద్ధతులన్నీ ఉన్న ఎన్నో శతకాలు విస్తృత వస్తువైవిధ్యాన్ని పొందుపరచుకున్నాయి.

హరికథా పితామహుడని పేరు సంపాదించుకున్న **అజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసు** గారు **సమస్యాపూరణ** శతకాన్ని రచించారు. ఈ మార్గంలోనే **మేడేపల్లి**

**వెంకటరమణాచార్యులు, నిదదవోలు సోమసుందరము** వంటి కవులు సమస్యాపూరణ శతకాలు అందించారు.

ఆశువుగా చెప్పే శతకములెన్నో వస్తువును అప్పటికప్పుడు నిర్ధారించుకొని రచింపబడినవి. **కొత్తపల్లి సుందర రామయ్య** గారు ఆశువుగా **సత్యనారాయణ** అనే శిశువును ఆశీర్వదిస్తూ శ్లేష చమత్కృతులతో **సత్యనారాయణ** శతక రచన చేశారు.

స్మృతి విషయం ఆలోచింపగా తొలిగా మనస్సులో మెదిలే రచన కవి సమ్రాట్ **విశ్వనాథ సత్యనారాయణ** గారి **'వరలక్ష్మీ త్రిశతి' ఇది కర్మ, నిత్య, స్మృతి** శతకముల సంపుటి. గొప్ప స్మృతికావ్యము.

త్యాగి రచించిన **'హిమగిరి'** శతకము గొప్ప వర్ణనాత్మకశతకము. హిమవన్నగు సౌందర్యవర్ణితమైనది యీ శతకము. **మారువాడ కృష్ణమూర్తి** రచించిన **'వారకామినీ'** శతకము వారకామినుల శృంగారాదికములను తెలిపే శతకము. ధనము లేనిచో సుఖము శూన్యమన్న భావనతో **'సుకము సున్న'** శతకము. వడ్డీ వ్యాపారములు వైనములు తెలిపే శతకము **'వడ్డీ'** శతకము. దీనిని **గుణిగుంట లక్ష్మీపతి** రచించాడు.

**కుసుమ ధర్మన్న 'హరిజన' శతకము పిళ్ళారి సెట్టి రంగబ్రహ్మారావు నాయుదు** రచించిన **'ఆదివెలమ'** శతకము వెంకటశాస్త్రి రచించిన **'మాధవ'** శతకము **(వైశ్యకీర్తి కాంతావిలాసము - నామాంతరము)** మొదలైన శతకాలు ఆయా కులవిశేషాలను తెల్పుతున్నాయి.

**'ధన్వంతరి విజయము', 'అమృతాంజన'** శతకం మొదలైనవి వైద్య సంబంధులయితే **'శిఖి నారసింహా'** శతకము వంటివి శాస్త్ర సంబంధులు.

రామలక్ష్మణ ప్రశ్నోత్తర రూపంలో **దేవులపల్లి సీతారామశాస్త్రి** రచించిన **'రామలక్ష్మణ ప్రశ్నోత్తర'** శతకము గొప్ప విలక్షణత గలిగిన శతకము. పేరు పరిశీలించినచో ఇది రామకథా శతకమని భావించవచ్చు. కాని రామాయణ పాత్రల ద్వారా స్త్రీ విద్య. శాస్త్ర విశేషాలను విపులంగా చర్చించిన శతకం ఈ శతకం.

ఆధునిక కాలంలో వస్తున్న అనేక శతకాలు అపురూపమైన వస్తువైవిధ్యంతో వెలువడుతూ శతకశాఖను మరింత పరిపుష్టం చేస్తున్నవి. నాటి నుండి నేటిదాకా

శతక సాహిత్యాన్ని పరిశీలిస్తే ఈ శాఖలో చోటు చేసుకున్నంత వస్తువైవిధ్యం, మరే సృజనాత్మక సాహిత్య ప్రక్రియలలో కనిపించదేమోనని భావించవచ్చు. ఆ వస్తువైవిధ్యమే శతకాన్ని సమకాలీన సమాజానికి మరింత దగ్గరగా తీసుకువచ్చిందన్న సత్యము ఎల్లప్పటికీ సత్యమే.

# తెలుగు శతకాలు
## ఉన్నత విలువలు

Blank Page

# తెలుగు శతకాలు–ఉన్నత విలువలు

నాటినుంచి నేటిదాకా అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్న పద్య ప్రక్రియ తెలుగు శతకం. ఎన్నెన్ని కావ్యాలు, నవలలు, నాటకాలు, ఇతరేతర ప్రక్రియలు సమాంతరంగా తెలుగు సాహిత్యరంగంలో వచ్చినా **'చెదనిది శతకం ఒక్కటే'** నన్నట్లు కవులు ఈ ప్రక్రియను సాధిస్తూనే ఉన్నారు. అనేకానేక సామాజికాంశాలను తమ తమ శతకాల ద్వారా లోకంలోనికి ప్రవహింపచేస్తూనే ఉన్నారు.

మనిషి అంతరంగాన్ని తేటపరచి అతని వ్యక్తిత్వంపై ప్రభావం చూపుతూ విలువల్ని కాపాడే విధంగా అతని ప్రవర్తనను మలచవలసిన సాహిత్యావసరాన్ని శతకం గుర్తించినంతగా మిగతా ప్రక్రియలు గుర్తించ లేదేమో ! ఈ మాట అలవోకగా చెప్పేమాట కాదు. తెలుగు శతకాలను ఎంత లోతుగా అధ్యయనం చేస్తే అది కాపాడుతున్న విలువలను గురించి అంతగా తెలుసుకునే అవకాశం ఉంది.

భక్తి శతకమైనా, రక్తి శతకమైనా ఏ విషయానికి సంబంధించిన శతకమైనా సందర్భాన్ని పురస్కరించుకుని మనిషిని సంస్కరించే యత్నం చేశాయి. ప్రతి విషయంలోనూ కచ్చితంగా విషయాన్ని బోధించి, విజ్ఞాన పరిధి విస్తృతికి, విలువల ఉన్నతీకరణకు తోడ్పడిన అపురూప ప్రక్రియ శతకం. మనిషి అంతరంగాన్ని మరింత పరిశుద్ధం చేసి అతనిని నిజమైన మనిషిగా నిలబెట్టేదిశగా ఇతర ప్రక్రియలు తమ కృషిని కొనసాగించి ఉండవచ్చు. కాని శతకం తన పరిమితికి అనుకూలంగా సర్వకాల సర్వావస్థలలో ఇదే పద్ధతిని కొనసాగించింది. పద్యప్రాభావాన్ని రెండింతలు చేస్తూనే మనిషి విలువల విషయంలో ఏ మాత్రం రాజీపడకుండా నూటికి నూరుపాళు ్ళ పెంచే యత్నం చేసింది తెలుగు శతకం.

రోజు రోజుకు దిగజారిపోతున్న మానవ విలువలకు కారణం మనిషి మానసికంగా సంకుచితుడయి పోవడమేనన్నది జగమెరిగిన సత్యం. ఈ రోజు సర్వమానవాళి కూడా కొన్ని విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటూ ఉంది. వైజ్ఞానికంగా ఆకాంశంవైపు దూసుకువెళ్ళి అనేక సత్యాల్ని ఆవిష్కరించే దిశగా మనిషి ఎదిగినా,

మానవత్వం కలిగిన మనిషిగా మాత్రం అధఃపాతాళానికి మనిషి దిగజారిపోయాడన్న సత్యం జీర్ణించుకోలేనిది. అదికారణంగా ప్రపంచంలో ప్రతి వ్యక్తి కూడా చుట్టుముట్టిన భయాల మధ్యే జీవితాల్ని వెళ్ళబుచ్చుతున్నాడు. దీనికి కాలం ఒక్కటే కారణం కాదు. మానవుడు విలువలకు తిలోదకాలిచ్చి ప్రవర్తించడం కూడా ఒక ప్రధానకారణమని విజ్ఞులు గుర్తించారు.

ఆ దిశలో మనిషి ఎదిగి సమాజాన్ని సవ్యదిశగా నడిపించాలని మనవాళ్ళు యోచించారు. అందుకే తెలుగునేలలో ప్రాథమిక దశ నుండే శతకానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఆ ప్రక్రియను ఆదరించారు. వికసించే పసి దశ నుండే మనిషి అంతరంగంలో మంచితనానికి మొదటి పీటవేసి కాపాడుకోగలగటం సమాజం యొక్క తక్షణ అవసరంగా గుర్తించారు మన పెద్దలు. దాని గుర్తింపు కారణంగానే అన్ని వయస్సుల వారికి అవసరమైన విధంగా స్థాయిని బట్టి శతకాన్ని పరిపుష్టం చేశారు. మానవ నేపథ్యాన్ని మరింత సంస్కారయుతం చేసే వైపుగా అడుగులు వేశారు. ఆ సంస్కారం పూర్వరంగంగా ముందడుగు వెయ్యాలన్నది మన శతకకర్తల ఆశయం. ఆ ప్రయత్నం చిత్తశుద్ధితో చెయ్యాలన్నది వారి ఆశ. అదే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాదులు వేస్తుందన్నది గట్టి నమ్మకం. ఏ సంస్కారం జరిగినా అది మనిషి కేంద్రంగా జరగాల్సిందేనన్న గాఢమైన నమ్మకం. ఉన్నవాళ్ళు గనుకనే అదిభక్తి శతకమైనా, మరో శతకమైనా కేవలం కారణం అడ్డుపెట్టుకుని మనిషి మనిషిగా ఎదగడానికి అవసరమైన ధర్మాలను బోధించారు. అప్పుడే విలువలు గల ఆ సమాజం పదికాలాలపాటు మనగలుగుతుంది.

**సత్యంబెప్పుడు తప్పడేనియు, దురాచారుండు గాదేని యౌ**
**చిత్యం బేమఱదేని, దుర్జనుల గోష్ఠింబొందడే, భక్తసాం**
**గత్యం బాదట బాయదేని మదనగ్రస్తుండు గాదేని నీ**
**భృత్యుండాతడు మూడులోకములలో బూజ్యుండు సర్వేశ్వరా !**

ఇది **యథావాక్కుల అన్నమయ్య** రచించిన తొలినాళ్ళలో వెలువడిన భక్తి శతకం. కాని శతకం ప్రారంభమైన తొలినాళ్ళలోనే మనిషి ప్రవర్తనను గురించి ఇంత లోతుగా ఆలోచించారంటే దీని ప్రయోజనాన్ని ఎంతగొప్పగా ఆశించారో అర్థమవుతున్నది. ఇది భక్తి శతకమే కావచ్చు.ఇక్కడ భక్తుణ్ణి గురించే చెప్పి ఉండవచ్చు. కాని దీని ఆధారంగా మనిషిలో పెరగాల్సిన దైవత్వాన్ని గురించి, మనిషి ఆచరించాల్సిన ఉ

త్తమ సంస్కారాల్ని గురించి ఆలోచించారు. దానివల్ల సమాజం పురోగతిని సాధిస్తుందన్న దృఢమైన ఆలోచనే దీనికి మూలమని చెప్పాలి. సజ్జన సాంగత్యం మనిషిని ఉత్తమ విలువలవైపు నడిపిస్తుంది. దుర్జన గోష్ఠి మనిషిని పతనం అంచుకు చేరుస్తుంది. ఉత్తమ విలువలకు అది తిలోదకాలిప్పిస్తుంది. అందుకే మనిషి సజ్జనుల మైత్రినిసాధించుకోవాలన్నది కవి భావన. భక్తి పేర మనిషి ప్రవర్తనకు మార్గదర్శనం చేసినవి శతకాలు.

మనిషిని మరింత ఉన్నతుణ్ణి చేసేది అతని ప్రవర్తన. ప్రతివ్యక్తి పెద్దల సహకారంతో తన ప్రవర్తనను తానే స్వయంగా పూనుకొని సరిచేసుకోవాలి. ఈ విషయంలో దిశానిర్దేశం చేసిన ఘనత శతకానిదే. సమాజానికి అవసరమైన రీతిలో మనిషిని మలచుకోవడానికి వందశాతం కృషి చేసింది తెలుగు శతకం. భక్తికి, ముక్తికి, రక్తికి ఎంత ప్రాధాన్యం ఇచ్చిందో, అంతకు రెండింతల ప్రాధాన్యాన్ని నైతిక విలువలు పెంచే నీతి మార్గానికి ఇచ్చి. అద్భుతమైన నీతి శతకాలను తెలుగు నేలపై నిలిపిన ఘనత శతకానిదేనన్నది నిర్వివాదమైన అంశం.

**సుమతి శతకం, భాస్కర శతకం, వేమన శతకం, కుమారశతకం, కుమారీ శతకం, గువ్వలచెన్న శతకం, పెమ్మయ సింగధీమణీ** శతకం మొదలైన ఎన్నో గొప్ప గొప్ప నీతి శతకాలు మిక్కిలి సులభమైన మార్గంలో మంచి మంచి దృష్టాంతాలతో చదివిన ప్రతివ్యక్తి గుండెల్లో చోటుచేసుకుంటూ శాశ్వతంగా నిలిచిపోయే నైతిక విలువల పెంపొందించే దిశలో పయనించినవి శతకాలు. అది అక్షర సత్యం.

మానవ విలువల్ని పదిరెట్లు పెంచే విధంగా శతకాలు రూపొందాయి. ఏ తెలుగు శతకాన్ని పరిశీలించినా ఈ సత్యం బోధపడుతుంది.

**ఇంటి ఆలివిడచి యిల జారకాంతల**
**వెంటదిరుగువాడు వెఱ్ఱివాడు**
**పంటచేలు విడచి పరిగెలేరిన యట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ !**

ఇది **వేమన్న** మాట. మానవుని సంస్కారానికి చూపిన ఉత్తమమైన ఒక గొప్ప బాట. వ్యక్తి నిర్మాణంతోం బాటు అతని ప్రవర్తన కూడా సన్మార్గంలో ఉండాలన్న సదాశయం దీని వెనుక ధ్వనిస్తుంది. తద్వారానే మానవ విలువలు మహోన్నతమై ప్రకాశిస్తాయనేది గాఢ విశ్వాసం.

**వినదగు నెవ్వరు చెప్పిన**
**వినినంతనె వేగపడక వివరింపదగుం**
**గని కల్ల నిజము దెలిసిన**
**మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ !**

అని గొప్ప సత్యాన్ని చెప్పిన **సుమతి** శతకకర్త **బద్దెన** మాట మానవ సంస్కారానికి, మానవ ప్రవర్తనా మార్గానికి నిలువెత్తు నిదర్శనం. నైతిక విలువలు ప్రకాశించడానికి మానవత్వం ప్రకాశించాలి. మానవత్వం ప్రకాశించాలంటే ప్రతిమనిషికి యెదటి మనిషి మాట విని గౌరవింపగలగాలి. అదొక గొప్ప విషయం. ఎదుటివాని మాటను విశ్లేషించుకొనడానికి ముందు అతని మాటను కూలంకషంగా విని ఆలోచిస్తే సరియైన మార్గం తెలుస్తుందన్నది తాత్పర్యం. ఇది మనిషి విలువ పెంచే ఒక మంచి ప్రవర్తన. నిజమైన మనిషి ప్రవర్తనను తెలిపే నిజమైన మంచి పద్యం ఇది. ఇట్లాంటి శతక పద్యాలు కొల్లలు.

**మారద వెంకయ్య** చెప్పిన **భాస్కర** శతకంలోని ప్రతి పద్యం కూడా బుద్ధి జీవుల్ని సవ్యదిశగా ఆలోచింపజేస్తుంది. ఏ పద్యం తాకినా మానవ స్పర్శ మనల్ని పరవశింపజేస్తుంది. మానవ ప్రవర్తనకు ఈ శతకం ఒక పెద్దబాలశిక్ష.

మనిషికి చదువు సంస్కారాన్ని నేర్పాలి. సంస్కారం నేర్పని విద్య నిరర్థకం. అటువంటి విద్యే మనిషికి విలువలు తెలియజేస్తుందన్న నమ్మకం.

**చదువది యెంతగల్గిన రసజ్ఞత యించుకయైనలేని యా**
**చదువు నిరర్థకంబు గుణసంయుతులెవ్వరు మెచ్చరెచ్చటన్**
**పదనుగ మంచి కూర నలపాకము వండిన గాని యందునిం**
**పొదవెడి నుప్పులేక రుచిపుట్టుగ నేర్చునటయ్య భాస్కరా !**

మంచి చెడులను గుర్తించగలిగే సంస్కారంగా భావించాలి. ఏ చదువైనా అటువంటి సంస్కారాల్ని నేర్పాలన్నది సారాంశం. ఆ సంస్కారాన్ని విద్యనేర్పక పోయిన పక్షంలో, మనిషి మరింత పతనం దిశగా అడుగులు వేస్తాడు. ఉప్పులేని కూర ఎంత రుచిహీనమో సంస్కారం లేని చదువు కూడా అంతే నిరర్థకమన్నమాట. ఆ సంస్కారమే మానవ సమాజము యొక్క విలువలను రెట్టింపుచేస్తుంది. అవి లుప్తమైతే సమాజం, సమాజంలోని వ్యక్తులు అధఃపాతాళానికి చేరువయ్యే ప్రమాదం ఉంది. **భాస్కర శతకం**

వంటి శతకాలన్నీ విలువల విషయంలో ఏక కంఠంతో తమమార్గాన్ని సూచించాయి. మనకు దిగ్దర్శనం చేశాయి. అవి నిజమైన మార్గాలని నిరూపించాయి.

ఈ రోజుల్లో ఒక ప్రముఖ దురాచారంగా కనిపించేది అస్పృశ్యత. మనిషిని మనిషిని విడదీసి సమాజాన్ని బలహీనం చేసే ప్రధానమైన దురాచారం. మానవుల మధ్య అగాధాలను సృష్టించి మానవత్వాన్ని మంటగలిపి, విలువలను పాతరపెట్టే దురాచారం. కలంపట్టిన ప్రతి కవి నేడు ఈ సమస్యను గూర్చి చర్చిస్తూనే ఉన్నాడు. అనేక మూఢ విశ్వాసాల నేపథ్యమే ఈ అస్పృశ్యతకు మూలం. ఇది మానవ పురోగతికి శాపం. మనిషి విలువను పతనం చేసే భయానకమైన ఆలోచన. అందుకే **వేమన** వంటి కవి కూడా **"మాలవానినేల మరి మరి నిందింప, ఒడలరక్తమాంసమొకటి గాదొ?'** అంటూ హెచ్చరించాడు. ఈనాటికీ సమాజాన్ని పట్టిపీడిస్తున్న ఈ దురాచారాన్ని గురించి **కవిరాజు త్రిపురనేని రామస్వామి గారు** తన **'ధూర్తమానవా'** శతకంలో

> **పసులను, చెట్టుచేమలను, పక్షి తతిన్, క్రిమికీటకాదులన్**
> **పుసుకున తాకినంత తలపోయవు స్నానముమాట, కాని మా**
> **నిసి నినుతాకినంత తలనిండుగ స్నానము ధర్మమార్గమే?**
> **ముసి ముసి నవ్వు నవ్వెదవు మోరెగ బెట్టుక ధూర్తమానవా !"**

అన్నాడు. మనిషికి మనిషికి మధ్య మంచి బంధం ఉండటమే గొప్ప విలువ. అంతేకాని అంటరానితనం అభిలషణీయం కాదని సారాంశం. అంటరానితనం అనేది సమాజం విలువను పదిమందిలో తగ్గిస్తుంది. అది సమాజప్రగతికి అవరోధం. మానవ విలువలకు వ్యతిరేకం. ఇటువంటి విశేషమైన భావాలతో యీ శతకం కొనసాగుతుంది. మానవ విలువల్ని గురించి ఆలోచించే శతకకవులకు ఇటువంటి శతకాలే ఒజ్జబంతులు.

పత్రికలు ఈనాటి ప్రధాన అవసరాలు. ప్రసార, ప్రచారాలలో పత్రికలది పెద్ద భాగస్వామ్యం. ప్రపంచ మానవులను కలిపి ఉంచి ఉన్నత విలువలను ప్రోది చేయగలిగేవి పత్రికలు. సమాజోన్నతికి అవి ప్రధాన సాధనాలు. మనిషిలో ఔన్నత్యాన్ని పెంచి గొప్ప గొప్ప విలువల దిశగా అతని ప్రయాణం కొనసాగించడానికి అవి ఉపయోగపడాలి. ఆ విషయాన్నే ప్రస్తావించన ప్రముఖ పాత్రికేయులు, మేధావియైన నార్ల వేంకటేశ్వర రావు గారు **'నార్లవారి మాట'** శతకంలో–

**నీతి నియతిలేని నీచుని చేతిలో**
**పత్రికుండేనేని ప్రజకు ముప్పు**
**ఉండదగునె కత్తి ఛండాలు చేతిలో**
**నవయుగాల బాట నార్లమాట !** అన్నారు.

ఉన్నతవిలువలను పెంచి పోషించే పత్రికలు ఉన్నప్పుడు మనిషి ప్రగతిని సాధిస్తాడు. మనిషి మేధను ప్రజోపయోగానికి ఉపయోగపడేటట్లు చేయగలిగిందే గొప్ప పత్రిక. దాని వల్లనే సమాజం ఉత్తమ విలువల దిశగా ప్రస్థానం చేస్తుంది. ఆ ఆలోచనతోనే నార్లవారు **'పత్రికొక్కటున్న పదివేల సైన్యంబు', పత్రికొక్కటున్న మిత్రకోటి'** అన్నారు. విలువల పతనానికి తోడ్పడేవిధంగా అది భ్రష్టుల పరమైతే సమాజం ఛిన్నాభిన్నమయ్యే ప్రమాదం ఉంది. ప్రజలకు పత్రిక రక్షగా నిలవాలే తప్ప ప్రజల ఆలోచనలను కలుషితం చేయరాదు. ఆ విధంగా కలుషితం చేయడం మూలంగా మానవ సమాజం విలువలు కోల్పోయి నేర సమాజంగా మిగిలే ప్రమాదం ఉంది. ఈ విషయాన్నే శతకం స్పష్టంగా చెప్పింది.

మానవ సంబంధాలు క్రమంగా మరుగున పడి మసకబారిపోయే రోజులు వచ్చాయి. దీనికి ప్రధానకారణం ఉత్తమ విలువలు సమాజంలో లుప్తమై పోవుటయే కావచ్చు. వ్యక్తికి వ్యక్తికి మధ్య దూరాలు పెరిగిపోవటం, పెద్దలను, తల్లిదండ్రులను గౌరవించలేకపోవటం వంటివి ఈనాటి సమాజంలో ఎక్కువగా కనిపిస్తున్న రుగ్మతలు.

సవ్యంగా మానవ సంబంధాలకు సంబంధించిన విలువలు పెరగాలన్నది నాటి నుండి నేటివరకు ఉన్న శతక కవుల ఆశయం. అందుకే

**తల్లిదండ్రి మీద దయలేని పుత్రుండు**
**పుట్టనేమి వాడు గిట్టనేమి !**

అని శతకం చెప్పాల్సి వచ్చింది. కన్నతల్లిదండ్రుల్ని కనిపెట్టుకోవలసిన బాధ్యతల్ని మరచే సమాజం మన కళ్ళముందు కనిపిస్తున్న ఈ రోజుల్లో మానవుల అంతరాగాల్ని, అందులోని మలినాల్ని తొలగించగలిగేది శతకమే. పెద్దలు, కుటుంబసభ్యులు, ఇరుగు పొరుగువారు, గురువులు గౌరవాన్ని పొందినప్పుడే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. మానవ విలువలకు తిలోదకాలు ఇచ్చినప్పుడు ఇవి సమాజంలో కనిపించవు. ఆ సత్యాలను శతకం ఆవిష్కరించింది.

# తెలుగు శతకాలు
## పరిపాలకులు – పరిపాలన

Blank Page

# పరిపాలకులు - పరిపాలన

సమాజం ఏదైనా సరే, జాతి ఏదైనా సరే, ఉన్నతమైన మానవ విలువల దిశాగా ప్రస్థానించాలన్నప్పుడు ఆ సమాజాన్ని పాలించే పాలకుడు కూడా సమాజక్షేమాన్ని కాంక్షించేవాడు అయి ఉండాలి. అప్పుడే ఆ సమాజం ఉత్తమ విలువల్ని కలిగి పురోగతిని సాధిస్తుంది. మనిషి అంతరంగాల్ని పరిశుద్ధ అంతరంగాలుగా మార్చి ఉత్తమ విలువల్ని పెంపొందింపజేసిన శతకం నాటికీ నేటికీ అదే లక్ష్యంతో పయనిస్తూ ఉండట విశేషం.

సమాజ చరిత్ర గతిలో పరిపాలకులకు, వాళ్ళు చేసే పరిపాలనకు చాలా ప్రాముఖ్యం ఉంది. పూర్వం ఉన్న రాచరికవ్యవస్థ అయినా, నేడున్న ప్రజాస్వామ్య వ్యవస్థ అయినా సమాజంలోని సామాన్యునికి ఏ ఇబ్బందీ ఉండరాదన్నది మన ఆలోచన. వ్యవస్థలు అనేకానేక మార్పులకు లోనవుతూ ఉంటాయి. కాలానుగుణమైన ఆ మార్పులను గ్రహించి నాడైనా నేడైనా పాలకులు తమ పరిపాలనను కొనసాగించాలి. అప్పుడే పాలితులైన ప్రజలు సుఖవంతమైన సమాజంలో జీవనం కొనసాగిస్తారు. లేకుంటే సమాజం అల్లకల్లోలమై ప్రజాజీవనం అస్తవ్యస్తమౌతుంది. ఈ విషయాలను శతక కవులు గుర్తించారు కనుకనే స్పందించి పాలకుల విషయాలను ప్రస్తావించారు.

**'ఎండిన ఊళ్ళ గోడెటిగింపదెవ్వడు, పండిన ఊళ్ళకే ప్రభువులంత'** అన్న మాట కవులు పలికారంటే సమాజంపట్ల వారికెంత నిబద్ధత ఉందో, సమాజంలోని జనులపట్ల వారికెంత సానుభూతి ఉందో తెలుస్తున్నది. సమాజంలోని ప్రతి అంశాన్ని గురించి శతకకవులు ఆలోచించినట్లే, మనలను పాలించేవారిని గురించి ప్రస్తావిస్తూ..

**అవనీశ్వరుడు మందుండైన నర్థుల కియ్యవద్దని యొద్ది జవాను చెప్పు,**
**మునిషీయొకదుచెప్పు, మొనసి బక్షీ చెప్పు తరువాత నామజుందారు చెప్పు,**
**తలత్రిప్పుచును శిరస్తాదారు తాజెప్పు, కేల్మోడ్చివెంట వకీలు చెప్పు,**

**దేశపాండ్యాతాను దినవలెనని చెప్పు మొనరద్ది చెవిలోన మొఅగి చెప్పు,**

**యశము గోరిన దొరకొడుకైన వాడు**
**ఇన్ని చెప్పులు గడచి తానియ్యవలయు**
**మదరిపు విఘాల మునిజనహృదయలోల !**
**వేణుగోపాల భక్త సంత్రాణ శీల !**

అంటూ చెప్పిన పద్యాన్ని పరిశీలిస్తే పరిపాలకుడు చెప్పుడు మాటలు విని పాలన చేయరాదన్న విషయం తెలుస్తుంది. చెప్పుడు మాటలు వినడం మొదలుపెడితే దగ్గరున్న ప్రతివాడు ఏదో ఒకటి చెప్పి పాలకుని చేత తప్పులు చేయిస్తారు. తద్వారా ప్రజలు నానాకష్టాలబారిన పడటం తథ్యం.

రాచరిక వ్యవస్థ ఉన్న కాలంలోనూ కవులు ఎంతో స్వతంత్ర ప్రవృత్తి గలవారై బ్రతికారు. వాళ్ళకు నచ్చని విషయాలను నిర్మొహమాటంగా తిరస్కరించారు. పైగా

**రాజుల్ మత్తులు వారి సేవ నరక ప్రాయంబు, వారిచ్చు నం**
**భోజాక్షీ చతురంతయాన తురగీభూషాదులాత్మవ్యథా**
**బీజంబుల్, తదపేక్ష చాలు, బరితృప్తిం బొందితిన్ జ్ఞానల**
**క్ష్మీ జాగృత్ పరిణామ, మిమ్ముదయతో శ్రీకాళహస్తీశ్వరా !**

అని తమ ధిక్కార స్వరాన్ని సైతం వినిపించారు. రాజాస్థానాల్లో ఉండి అపార సంపదలను, దాస దాసీ జనాలను సంపాదించుకోగలిగినా తాము రాజతత్త్వాన్ని బాగా అధ్యయనం చేసి, స్వతంత్రమైన ఆలోచనలతో రాజులను తిరస్కరించి బ్రతికారు. అంతేకాదు

**రాజర్థాతురుడైనచో నెచట ధర్మంబుండు? నేరీతి నా**
**నాజాతి క్రియలేర్పడున్? సుఖము మాన్యశ్రేణి కెట్లబ్బు? రూ**
**పాజీవాళికి నేదిదిక్కు? ధృతి నీ భక్తుల్ భవత్పాద నీ**
**రేజంబుల్ భజయింతురే తెలుగునన్ శ్రీకాళహస్తీశ్వరా?**

అంటూ రాజుకు ధనాకాంక్ష తగదని, రాజ్య నిర్వహణకై వసూలు చేసిన ధనాన్ని రాజ్యం కొరకే వెచ్చించాలని, పాలకుడు దారి తప్పితే ప్రజలు నానా ఇబ్బందులను ఎదుర్కొంటారని, ఆ సమాజంలో ప్రతివర్గమూ కష్టాల పాలు అవుతుందని హెచ్చరించారు.

చరిత్రలో స్వర్ణయుంగా కీర్తినందిన **శ్రీకృష్ణదేవరాయల** కాలం నాటి కవి ధూర్జటియే యింత ధైర్యంగా పరిపాలకుని తీరుతెన్నులను గురించి చెప్పడం కవుల ప్రజాపక్షపాతాన్ని తెలుపుతున్నది.

**రాజన్నంతనె పోవునా కృపయు, ధర్మంబాభిజాత్యంబు వి**
**ద్యాజాతక్షమ, సత్యభాషణము, విద్వన్మిత్ర సంరక్షయున్**
**సౌజన్యంబు, కృతంబెరుంగుటయు విశ్వాసంబు గాకున్న దు**
**ర్బీజ శ్రేష్ఠులుగా గతంబు గలదే శ్రీ కాళహస్తీశ్వరా !**

అని ధూర్జటి చెప్పిన ఈ పద్యం అనేక సత్యాలను తెలియజేస్తూ ఉంది. పరిపాలకుని స్థాయికి చేరగానే ఎవరైనా తన ప్రజలపట్ల ధర్మం తప్పరాదు, సత్యం మరువరాదు, విద్వన్మణులను మరువరాదు. సుజనత్వం కోల్పోరాదు, చేయదగిన పనిని గురించి, పూర్తి అవగాహన కలిగి ఉండాలి అంటూ చెప్పి తాను **'రాజు'** కాగానే ఇవన్నీ పోయి, దయమాలిన వాడై పోతాడా? అంటూ ఆశ్చర్యపోయాడు.

కవుల స్వతంత్ర ప్రవృత్తితో బాటు పరిపాలకుల తీరుతెన్నులను గురించిన విశేషాలు ఎన్నో శతకాలు ప్రస్ఫుటం చేస్తున్నాయి. తెలుగులో వెలువడిన వేలాది శతకాలలో పలు శతక కవులకు ప్రజల సత్ప్రవర్తన పట్ల నిబద్ధత, పాలకులకు ప్రజలయందు ఉండవలసిన సల్లక్షణాలును గురించి అవకాశం ఉన్న ప్రతిచోటా చెప్పుకొచ్చారు. **అడిదము సూర కవి** తన **రామలింగేశ శతకం**లో

**మేలు చేసినయట్టి మిత్రుని చెడగొట్టి పెద్ద కోటరంబు పెట్టనేల?**
**తన ప్రాపు గోరు భూధవునకెగ్గొనరించి, గంధసింధురములగట్టనేల?**
**ప్రజలను పదరాని పాట్లకగ్గము చేసి అగ్రహారంబుల నీయంగనేల?**
**అధికనిందల కొడిగట్టి యలరునట్టి నృపునకీదృశభవ సమృద్ధులెల్ల**
**శవకృతాంలకృతులు గావె చర్చసేయ, రామలింగేశ! శ్రీరామచంద్ర పురవాస!**

పరిపాలకుడు తన సేవకుల కిచ్చు జీతభత్యాలను అనవసరంగా తగ్గించడం, మిత్రులను చెడగొట్టడం, తనను నమ్మినవానికి ఆపదలు కలిగించడం, ప్రజలను పదరానిపాట్లకు గురిచెయ్యడం వంటి దుర్మార్గపు పనులు చెయ్యరాదని చెప్పాడు. బహుశా ఆయన కాలం నాటి రాజులు ఇటువంటి విపరీత ప్రవర్తన కలిగిన వారై ఉండేవారేమో ! తాము దుర్మార్గాలకు పాల్పడుతూ, ప్రజల కష్టాన్ని ఆభరణాల రూపంలో

అలంకరించుకొని ఊరేగరాదని వాంఛించాడు. న్యాయాన్ని వదలి అన్యాయపు బాటలో సాగుతూ ఎన్ని వైభవాలు కలిగియున్నా అతనిని విమర్శించడం సత్కవిలక్షణం. ఆపనినే శతక కవులు చేశారు.

పాలకుడైనవాడు పదిమంది తన వెంటనడవడమే అధికారం అని భావింపరాదు. అలా అనుకొనడం తప్పు ఆ మాట కొస్తే కోతుల వెంట గూడా పలువురు నడుస్తుంటారని ఆక్షేపించాడు శతక కవి. అంతేకాదు వాహకులతో మోయించుకోవడమే అధికార లక్షణమని గర్వించరాదని కూడా చెప్పాడు. ఎందుకంటే శవానికి కూడా వాహకులు ఉంటారు కదా ! తన సమాజానికి మంచి చెయ్యడమే అధికారం లక్ష్యం కావాలి. లేకుంటే అటువంటివాడు అల్పబుద్ధి గల పాలకునిగా మిగిలిపోతాడు. **వేమన్న** కూడా

**అల్పబుద్ధివాని కధికార మిచ్చిన**
**దొడ్డ వారి నెల్ల తొలగ గొట్టు .....** నన్నాడు.

అంటే ప్రజాపాలకుడు ప్రజారంజకుడై, పాలించాలి కాని ప్రజాకంటకుడు కారాదన్నది తాత్పర్యం.

బుద్ధిహీనుడు పరిపాలకుడైతే మంచివారిని, సుబుద్ధులను దరిజేరనివ్వడు. దానివల్ల ప్రజాసంక్షేమం కుంటుబడిపోయే ప్రమాదం ఉంది. కేవలం అధికారపీఠాన్ని అధిష్ఠించడమే ధ్యేయం కాదు, కారాదు. ఆ విషయాలను ప్రస్తావిస్తూ **కూచిమంచి తిమ్మకవి** తన **కుక్కుటేశ్వర శతకం**లో ఒక మంచి పద్యం చెప్పాడు.

**అందలం బెక్కుటే నవని ప్రశస్తమా? మ్రానెక్కినిక్కదే మర్కటంబు**
**తొడవులు దొడగుట దొడ్డ సౌభాగ్యమా? కదుసొమ్ములూనదే గంగిరెద్దు**
**విత్తంబు గూర్చుట విమల ప్రచారమా? బహునిధుల్ గావదే భైరవుండు**
**ప్రజలదండించుట పరమ సంతోషమా? ప్రాణులనెల్ల నేపదే జముండు**

**దొరతనంబున కవిగావు వరసలరయ**
**సాహసౌదార్యఘనపౌరుషములు గాని**
**భూనుత విలాస ! పీఠికాపుర నివాస !**
**కుముద హితకోటి సంకాశ ! కుక్కుటేశ !**

పదవుల నధిష్ఠించడం, విలువైన ఆభరణాలు ధరించడం, ధనం సమకూర్చుకోవడం,

ప్రజలను అనవసరంగా దండించడం, ఇవికావు అధికార లక్షణాలు. ఇవన్నీ ఉన్నాయి కనుక నేను ప్రభువును లేదా పరిపాలకుణ్ణి అనుకోవడం అవివేకం అన్నాడు తిమ్మకవి. కోతులు కూడా పైకి ఎక్కికూచుంటాయి, గంగిరెద్దులు కూడా ఆభరణాల్ని ధరిస్తాయి, కుక్కలు కూడా సొమ్ముకు కాపలా ఉంటాయి. యమధర్మరాజు కూడా శిక్షలు వేస్తాడు, అవన్నీ పరిపాలకుడు చేయవలసిన పని లేదని శతకకవి వివరిస్తూ పరిపాలకునికి ఇవన్నీ అలంకారాలు కావని అన్నాడు. సాహసం కలిగి ఉండటం, ఉదారవంతుడుగా ప్రవర్తించడం, పౌరుషం కలిగి ఉండటం ప్రజల్ని కన్నబిడ్డల వలె చూడటమే పాలకుని లక్ష్యంగా నిర్దేశించాడు.

**తిమ్మకవే** తన **కుక్కుటేశ్వర** శతకంలో మరింత స్పష్టంగా పరిపాలకుడు ఎట్లా ఉండాలో కూడా చెప్పాడు.

**భోగియై, ప్రతిదిన త్యాగియై, పుణ్యసంయోగియై, సుజనానురాగియై,**
**దాతయై, బంధుజనత్రాతతయై, నిఖిల విజ్ఞాతయై, కుశల సంధాతయగుచు**
**ధీరుడై, రణరంగవీరుడై, నిర్మలాచారుడై నిరుపయోదారుడగుచు**
**శాంతుడై, సదమలస్వాంతుడై, కీర్తిదిగంతుడై పటుబలవంతుడగుచు**

**రాజ్యమేలంగ గలవాడు రాజు గాక !**
**హీనమతియై చరించువాడేటి రాజు?**
**భూనుతవిలాస ! పీఠికాపుర నివాస !**
**కుముదహితకోటి సంకాశ ! కుక్కుటేశ !**

భోగం, త్యాగం, పుణ్యయోగం, సజ్జనత్వం, దానగుణం, ప్రజారక్షణ అందరి క్షేమాన్ని కాంక్షించే లక్షణం. ధీరత్వం, శౌర్యం, స్వచ్ఛమైన ప్రవర్తన, ఉన్నతమైన ఉదారగుణం, శాంతలక్షణం, నిర్మలాంతరంగం, గొప్ప బలశాలి, కీర్తిమూర్తి అయినవాడే పరిపాలకుడు కావాలి తప్ప నీచగుణాలున్నవాడు పాలకుడైతే మాత్రం ప్రజలకు ప్రమాదమే. పలు సద్గుణాలున్న పాలకుని ఏలుబడిలోని ప్రజలు సుఖజీవనులుగా బ్రతుకగలరు. సత్పరిపాలన చేసిన ఉన్నత గుణశాలియే నిజమైన పాలకుడు. మిగతా ప్రభువులు కేవలం పాలకులే తప్ప అన్యులు కాదన్నది శతకకర్త భావము. అసలు అటువంటి ఉత్తమ గుణాలు లేనివాడు పాలనకు అనర్హుడని కవి

భావించాడు. **కుక్కుటేశ్వర శతకం** ఈ విషయంలో ఇంకా ఎన్నెన్నో విశేషాలు తెలిపింది. స్వేచ్ఛగా తమ తమభావాలను వెల్లడించగలిగే అవకాశం శతకానికి ఉంది కనుక పరిపాలనను గురించి, పరిపాలకులను గురించి శతకాలు అవకాశం ఉపయోగించుకుని వివరంగా చెప్పాయి. ఇది శతకానికి, శతకకవికి మాత్రమే సాధ్యము. **సుమతి శతకం** ఒక చిన్నపద్యంలో గొప్ప విషయాన్ని అద్భుతంగా చెప్పింది.

**అడిగిన జీతంబియ్యని**
**మిడిమేలపు దొరను గొల్చి మిదుకుటకంటెన్**
**వడిగల యెద్దుల గట్టుక**
**మడిదున్నుక బ్రదుక వచ్చు మహిలో సుమతీ !**

**సుమతి** శతకకర్త అభిప్రాయం ఎంతో గొప్పది. శ్రమకు తగిన పారితోషకం ఇవ్వని పాలకుని సేవించడం వృథా. దానికన్న వ్యవసాయంతో స్వతంత్ర జీవనం గడపడం మేలన్న భావన వెలిబుచ్చాడు శతకకవి. స్వతంత్ర జీవనంలో ఉన్న హాయి పాలకుణ్ణి సేవించడంలో లేదన్నదే కవి భావన.

ఏ రాజ్యానికైనా పాలకులు ప్రధానం కాబట్టి మన శతక కవులు పరిపాలకులను గురించి వారి వారి పాలనను గురించి ప్రతివ్యక్తి ఆలోచించాలన్న భావనతో అవకాశం ఉన్నచోట విస్తృతంగా చర్చించారు. ఇతర ప్రక్రియల కన్నా శతకానికి ఇట్లా చర్చించుకునే అవకాశం ఎక్కువ గనుక దాన్ని శతకకవులు సవ్యంగా ఉపయోగించుకున్నారు.

దాదాపు అన్ని సామాజిక సంబంధి శతకాలలో పాలనను, పాలకులను వారి విధానాలను వారి లక్షణాలను ఆయా శతకకర్తలు చర్చిస్తూ మంచిచెడ్డల గురించి నిర్దుష్టంగా, నిర్ద్వంద్వంగా చెప్పారు. తొలిరోజుల్లో వచ్చిన **సుమతిశతకం** మాత్రం ఈ విషయాల్లో చాలా ముందుంది. రాజులకు, లేదా పాలకులకు అబద్ధం ఆడే గుణం ఉండరాదంటూ

**చేతులకు తొడవు దానము**
**భూతలనాథులకు ్రదొడవు బొంకమి ధరలో...** అనింది.

రాజుకు అసత్యం చెప్పక పోవడమే నిజమైన అలంకారమని అతిస్పష్టంగా శతకకర్త

చెప్పాడు. పైగా పాలకునికి అది అలంకారమని కూడా చెప్పాడు.

**చీమలు పెట్టిన పుట్టలు**
**పాములకిరవైన యట్లు, పామరుడు దగన్**
**హేమంబు కూడా బెట్టిన**
**భూమీశుల పాలజేరు భువిలో సుమతీ !**

ఇది మరొక సత్యం చెప్పిన గొప్ప పద్యం. ఇది బాగా ప్రచారంలో ఉన్న పద్యం కూడా. పరిపాలకుని లక్షణాన్ని చాలా బాగా, స్పష్టంగా వివరించిన చిన్న పద్యం. చీమలు కష్టించి పుట్టను నిర్మించుకుంటే ఏ శ్రమా చెయ్యని పాములు వాటిని ఆక్రమించుకున్న విధంగా శ్రమ చేసి దాచుకున్న సొమ్మును అంటే ప్రజల కష్టార్జితాన్ని పరిపాలకుడు మింగేస్తాడన్న సత్యాన్ని శతకం ఇంతహాయిగా బోధించగలిగింది. తమ సౌకర్యం కొరకు ఎదుటి వారి శ్రమను దోచుకోవడం అధికార లక్షణంగా కవి గుర్తించాడు.

సామాన్యుల శ్రమను పాలకులు ఏ విధంగా దోచుకుంటారో చెప్పిన **సుమతి** శతకకారుడే మరో మంచి మాట కూడా చెప్పాడు. పాలకుడైనవాడు ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పుడు మాటలు వినరాదన్నది తెలిపే పద్యం-

**దగ్గర కొండెము చెప్పెడు**
**ప్రెగ్గడ పలుకులకు రాజు ప్రియుడై మతి తా**
**నెగ్గు ప్రజాకాచరించుట**
**బొగ్గులకై కల్పతరువు బొడచుట సుమతీ !**

ఈ పద్యం చిన్నదే కావచ్చు. కాని తాత్పర్యం ఎంతో పెద్దది. చిన్న చిన్న పద్యాల్లోనే జీవన సత్యాలను శతకకవులు ఎంతో స్పష్టంగా చెప్పారు. పరిపాలకుడైన వాడు తన దగ్గరున్న మంత్రుల చెప్పుడుమాటలు విని విచక్షణ కోల్పోతే అది ప్రజల కష్టాలకు మూలమౌతుంది. దాని వల్ల రాజ్యంలోని ప్రజలు పీడనకు లోనౌతారు. ప్రజాపీడనం అనేది బొగ్గుల కొరకు కల్పవృక్షాన్ని కాల్చుకోవడం వంటిది ఔతుంది.

రాజులు, పాలకులు ధర్మం తప్పరాదన్నది పెద్దల ఆలోచన. ధర్మం తప్పడం ద్వారా ఆ పాలకులు తాను పాలిస్తున్న సమాజానికి హాని కలుగుతుందన్నది భావం. అందుకే శతక కవి **'నరపతులు మేరఁదప్పిన....'** ఇత్యాది పద్యంలో **'... మరణాంతక**

**మౌతుంద**'ని స్పష్టంగా చెప్పాడు. అట్లా అయ్యేది అతని యేలుబడిలో జీవించే ప్రజలకేనన్నది సుస్పష్టం. ఈ స్పష్టమైన, కచ్చితమైన నిజాన్ని చెప్పిన కవే, మంత్రి ఎన్నికను గురించి మరోమాట కూడా చెప్పాడు. సమర్థుడైనవాడు మంత్రిగా లేనిచో ఆ పాలకుని పరిపాలన గాడి తప్పే ప్రమాదం ఉంటుంది. అందుకే పాలకునికి రాజ్యతంత్రం చెప్పే మంత్రి సజ్జనుడు, ప్రజా శ్రేయోభిలాషి కావాలన్నది రాజనీతి శాస్త్రజ్ఞుల మాట. దానినే **సుమతి శతకకర్త.**

**మండలపతి సముఖంబున**
**మెండైన ప్రధాని లేక మెలగుటయెల్లన్**
**కొండంత మదపుటేనుగు**
**తొండము లేకుండినట్లు తోచుట సుమతీ !**

అనడంలోనే పాలకునికి ఉత్తముడైన మంత్రి తోడ్పాటు ఎంత ప్రాముఖ్యం వహించిన విషయమో అవగతమౌతుంది అదే ప్రజాశ్రేయస్సుకు పునాది.

రాజనీతి ప్రజాసంక్షేమానికి పాటు పడాలన్నది శతక కవుల గాఢమైన ఆకాంక్ష. దాన్ని ప్రతిబింబిస్తూనే కవులు తమ తమ శతకాలలో సందర్భాన్ని ఏర్పాటు చేసుకొని విస్పష్టంగా చెప్పే ప్రయత్నం చేశారు.

భారతదేశం విదేశీ తాకిడులతో సతమతమవుతున్నప్పుడు, సరియైన పరిపాలకుడు లేక సమాజం అస్తవ్యస్తమైనప్పుడు, శతకకవులు ప్రజలను జాగృతం చెయ్యడం తమ బాధ్యతగా భావించారు. కనుక ఇటువంటి పద్యరత్నాలు మనకు దక్కాయి. సామాన్యునికి, సంపన్నునికి సరియైన మార్గాన్ని సూచించే యత్నం చేశారు.

ఒక సమాజం అది ఏనాటి సమాజాన్నికైనా, ఏకాలంలోని ప్రజలకైనా, సమర్థుడైన పాలకుని రక్షణలోపిస్తే ఎదుర్కొనే కష్టనష్టాలను సరియైన ఆలోచనల వెలుగులో మనల్ని దర్శింపజేశారు శతకకవులు.

ఒక రోజుల్లో ఈ దేశంలో రాచరిక వ్యవస్థ ఉండి ఉండవచ్చు. నేటికాలంలో ఇది ప్రజాస్వామ్య వ్యవస్థగా ఉండవచ్చు. ఎదుర్కొనే కష్టాలు మాత్రం ఒక్కటే కాబట్టే ఈ శతక కవుల పద్యాలు సార్వకాలికాలు, సార్వజనీనాలు.

రాచరిక వ్యవస్థలోని రాజుల దుర్మార్గాన్ని ధిక్కరించి తమ ధిక్కార స్వరాన్ని పద్యాల రూపంలో తెలిపిన కవులున్నారు. ప్రజాస్వామ్యంలోనూ పాలకుల బండారాలను బయటపెట్టిన శతకకవులూ ఉన్నారు.

ప్రజలను గురించి, పరిపాలనను గురించి, పాలకులను గురించి శతకం ఆలోచించిన విధానం సర్వశ్రేష్ఠమైనదన్న మాట ఎప్పటికీ చెరిగిపోని సత్యం. మనిషి వ్యక్తిత్వాన్ని గురించి ఆ వ్యక్తిత్వం పెంచే విలువను గురించి కూడ శతక కవులు ఆలోచించారు.

Blank Page

# తెలుగు శతకాలు
# వ్యక్తిత్వ నిర్మాణము

Blank Page

# వ్యక్తిత్వ నిర్మాణము

సమాజం వ్యక్తుల సమాహారం. అందువల్ల వ్యక్తి యొక్క ఔన్నత్యమే సమాజం యొక్క ఔన్నత్యాన్ని నిర్ణయిస్తుంది. ఆ దిశగా శతకం తన ప్రయత్నాన్ని తొలినుంచి కొనసాగించింది.. నేటికీ వెలువడుతున్న వేలాది శతకాలే దీనికి నిదర్శనం. ప్రతిశతక కవి, వ్యక్తి యొక్క వ్యక్తిత్వాన్ని ఉన్నతీకరించే విధంగా తమ పద్యాలను మలచేయత్నం చిత్తశుద్ధితో చేశాడు. దానివల్ల పాఠకుని హృదయంలో ఆ పద్యాలు శాశ్వత స్థానాన్ని పొంది అతని వ్యక్తిత్వంపై కూడా ఎంతో కొంత ప్రభావాన్ని చూపిస్తూనే ఉన్నాయి. ఆయన వ్యక్తిత్వం సమాజానికి ఆదర్శమై నిలిచేటట్లు చేస్తున్నాయి. ఈ నాటికీ ప్రజల నాలుకలపై నాట్యం చేస్తున్న **వేమన్న** పద్యాలు, **సుమతి** శతకపద్యాల వంటివే ఈ సత్యానికి ప్రబలమైన నిదర్శనం.

వ్యక్తిత్వ నిర్మాణం విషయాన్ని పరిశీలిస్తే ప్రధానంగా కొన్ని అంశాలు గోచరిస్తాయి. వ్యక్తి అంటేనే వ్యక్తమయ్యేవాడు. తన భావాల ద్వారా, తన ప్రవర్తన ద్వారా, తన రూపగుణ శీలాదులు ద్వారా తనను తాను వ్యక్తీకరించుకుంటాడు. ఒక వ్యక్తి. సద్గుణాలను సమీకరించుకొని, దుర్గుణాలను త్యజించేవిధంగా ప్రయత్నం చేయడం వ్యక్తిగా అతని బాధ్యత. ఆ విధంగా చేయడం వల్ల అతని వికాసం పరిపూర్ణం అవుతుంది. అట్లా చేయడానికి తన కన్నా పూర్వం ఉన్న వారిని ఆదర్శంగా గ్రహిస్తూ ఉంటాడు. ఈ క్రమంలో ఒక పథకం ప్రకారం ముందుకు సాగినప్పుడే వ్యక్తి వికాసం ఉత్తమమైన దిశగా కొనసాగుతుంది. లేనిచోట్ల అది తప్పుదారిలోకి వెళుతుంది.

దీన్ని దృష్టిలో పెట్టుకొనే సంస్కృతాది భారతీయ సాహిత్యంలోని కవి పుంగవులు నీతిశాస్త్రాన్ని బోధించే రచనలు చేపట్టారు. వ్యక్తి వికాసానికి బాటలు వేశారు. అందుకే **భర్తృహరి సుభాషితత్రిశతి, క్షేమేంద్రుని చారుచర్య** మొదలైనవి ప్రత్యేకంగా వెలువడ్డాయి. భారత, రామాయణాది పురాణేతిహాసాల్లో వ్యక్తి ధర్మాలు సందర్భోచితంగా ఉన్నా ప్రత్యేకంగా శతకాలను పెద్దలు రచించారు. దీన్ని బట్టే వ్యక్తిపట్ల, సమాజం పట్ల

వారికి ఎంత నిబద్ధత ఉందో తెలుస్తున్నది.

తెలుగు కవులు కూడా ఈ మార్గంలోనే సాగిపోయారు. తెలుగు పద్యాన్ని చిరంజీవిగా చేసే యత్నంలో భాగంగానే వ్యక్తి కేంద్రంగా రచనలు వచ్చాయి. ఆ విధంగా వచ్చిన క్రమంలోనిదే **తెలుగు శతకం**. పద్యాన్ని పరిపుష్టం చేయడంతో బాటు మనిషిలోని మనిషితనాన్ని మరింత పెంచి అతని వ్యక్తిత్వాన్ని దుర్నిరీక్ష్యం చేయాలన్న బలమైన సంకల్పం తెలుగు శతక కవుల్లో స్పష్టంగా కనిపించింది. ఈ విషయంలో సాటిలేనిది తెలుగు శతకం. మనిషి వ్యక్తిత్వవికాసానికి దోహదం చేస్తున్న సాహిత్యంలో తెలుగు శతకానిదే ప్రథమ స్థానమని నిస్సంశయంగా చెప్పవచ్చు.

ఈ విధమైన ఆలోచనలు తొలినుంచే ఉన్నాయి గనుక భక్తి శతకాలను సమాంతరంగా సామాజిక శతకాలు కూడా వెలువడడం కనిపిస్తుంది. భక్తి శతకాల్లో సందర్భానుసారంగా అక్కడక్కడా వ్యక్తిత్వ నిర్మాణాన్ని ప్రస్తావించినా సామాజిక శతకాలు మాత్రం అదే ప్రధాన లక్ష్యంగా వెలువడ్డాయన్నది సత్యం.

ప్రతివ్యక్తి ఉన్నతవ్యక్తిత్వాన్ని నిర్మించుకునే దశలో మొదట తన జాతి గురించి, తనదేశం గురించి, తన భాషను గురించి బాగా తెలుసుకుని పురోగతిని సాధిస్తే అది స్థిరమై అతని వ్యక్తిత్వానికి వన్నె తెస్తుంది. ఆ విషయాన్ని **'భక్తచింతామణి'** శతక కర్త **వద్దాది సుబ్బరాయకవి** –

**తనదేశంబు స్వభాష నైజమతమున్, అన్మత్సదాచారముల్**
**తన దేహాత్మలనెత్తెఱంగున సదా తానట్లు ప్రేమించి, త**
**ద్ఘనతా వాప్తికి సాధనంబులగు సత్కార్యమ్ములన్ జేయగా**
**అనువౌ బుద్ధియొసంగు మీ ప్రజకు దేవా ! భక్తి చింతామణీ !**

అన్నాడు. ఏ వ్యక్తియైనా తన దేహాన్ని, తన ఆత్మను ఏ విధంగా మిక్కిలి ప్రేమిస్తాడో అదే విధంగా తనకు జన్మనిచ్చిన దేశాన్ని, తనకు మాటనిచ్చిన స్వభాషను, తాననుసరించే మతాన్ని కూడా ప్రేమించడం మొదటి కర్తవ్యంగా భావించాడు కవి. అదే అతని వ్యక్తిత్వానికి, దాని ఉన్నతికి తొలిమెట్టుగా భావించాడు. దేశంపై, భాషపై తృణీకారభావం లేకుండా వాటి ప్రగతిలో పాలుపంచుకున్నప్పుడే అతని అస్తిత్వం నిలబడుతుంది. అతడు ముమ్ముందుకు సాగే అవకాశం ఉంటుంది.

**ఛందః ప్రసక్తి లేదు ఒక సారస్వత తపస్సు లేదు**

**అందమైన మనస్సులేదు అనుభూతియని లేదు, వీళ్ళ**
**బొంద కవిత్వాలు, లేదు పుణ్యము పురుషార్థమొకటి**
**నిందలే తప్ప ! యాదగిరినిలయ ! శ్రీ లక్ష్మీనృసింహ**

అని తన **'యాదగిరి లక్ష్మీనృసింహ శతకము'**లో **శ్రీ ముళ్ళపూడి సచ్చిదానందమూర్తిగారు** మనిషికి కావలసిన అధ్యయన ప్రాధాన్యాన్ని గట్టిగా చెప్పారు. అధ్యయనమే వ్యక్తిత్వాన్ని నిలబెడుతుందని నమ్మిన కవి గనుక కవిత్వ నిర్మాణము కూడా అధ్యయనం వల్ల స్థాయినీ పెంచుకుంటుందని వివరించాడు. ఉత్తమ కవిత్వ సృజనయే ఉత్తమ వ్యక్తిత్వానికి నిలువెత్తు నిదర్శనం.

**వేమన్న** చెప్పిన ఎన్నో మాటలు మనిషి వ్యక్తిత్వాన్ని మరింతగా పెంచే దిశలో ఉన్నవే. దాదాపుగా **వేమన** పద్యాలన్నీ ఆ కోవకు చెందినవే. ఒక వ్యక్తి తన వ్యక్తిత్వ నిర్మాణ విషయంలో శ్రద్ధచూపే ముందు తాను క్రియాశీలిగా ఎదగాలి. పనిమంతుడని అనిపించుకోవాలి. ఆ విధంగా అనిపించుకోవాలంటే అతనిలో నిత్యసాధనాగుణం రెండింతలు కావాలి. కఠోరసాధన కలిగినవానికి ఎంతటి కఠిన కార్యమైనా సులభమే ననిపిస్తుంది. అది అతని వ్యక్తిత్వాన్ని రెండింతలు చేస్తుంది. అందుకే సాధన ముఖ్యం. ఆమాటే **వేమన్న** నోట పలికిన తీరు ఇట్లా ఉంది.

**అనగననగ రాగ మతిశయిల్లుచునుండు**
**తినగతినగ వేము తియ్యనుండు**
**సాధనమున పనులు సమకూరుధరలోన**
**విశ్వదాభిరామ! వినురవేమ!**

ఈ పద్యం చాలా సుప్రసిద్ధం. ఎందరి నోటనో, ఎన్నో సార్లు వినబడేపద్యం. పద్యం సరళమైనదే. కాని సాధన కఠినమైనది. అయినా సాధనవల్ల సాధ్యంకాని పనులంటూ లేవన్నది సారాంశం. వ్యక్తిని అకుంఠిత సాధకునిగా చేసే అపురూప శక్తి యీ పద్యానికి ఉంది. దాని వల్ల వ్యక్తి గొప్ప వ్యక్తిత్వం మనిషిగా ఎదిగే సౌలభ్యం సమకూరింది.

**శేషప్ప** కవి **'నారసింహ'** శతకం గొప్ప సందేశాలను, సామాజిక విశేషాలను అందించిన శతకం. **శేషప్పకవి** చెప్పిన సత్యాలు ప్రతి మనిషికి పుష్టినిచ్చే పాథేయాలు. వ్యక్తియైనవాడు వీలైనంతవరకు తప్పులు చేసే వ్యక్తిత్వం నుంచి దూరం కావాలి.

అప్పుడే అతని వ్యక్తిత్వం గొప్పగా ప్రకాశిస్తుంది.

**పరుల ద్రవ్యము మీద భ్రాంతి నొందినవాడు, పరకాంతల నపేక్షబడెడువాడు**
**అర్థులవిత్తంబు నపహరించెడువాడు, దానమీయంగ వద్దనెడువాడు**
**సభలలోపల నిల్చి చాడి చెప్పెడివాడు పక్షపుసాక్ష్యంబు పలుకువాడు**
**విష్ణుదాసుల జూచి వెక్కిరించెడువాడు ధర్మసాధుల దిట్టదలచువాడు**

**ప్రజల, జంతుల హింసించు పాతకుండు**
**కాలకింకర గదలచే కష్టమొందు**
**భూషణవికాస! శ్రీధర్మపురి నివాస!**
**దుష్ట సంహార! నరసింహ! దురితదూర!**

ఈ పద్యాన్ని సరిగ్గా అవగతం చేసుకున్న వాడెవడూ ఇట్లాంటి తప్పులు చేయడానికి సాహసించడు. ఇతరుల ధనం అపేక్షించడం, అన్యకాంతలను కాంక్షించడం, పేదల ధనాన్ని దోచుకోవడం, ఎవరైనా దానం చేసేవాళ్ళను అడ్డుకోవడం, సభలలో నిలబడి ఇతరులపై చాడీలు చెప్పడం, కూట సాక్ష్యాలు చెప్పడం, మానవులను, జంతుజాలాన్ని హింసించడం వంటి పలు దోషాలను పరిహరించడమే ఉన్నత వ్యక్తిత్వాలకు పునాది. ఈ సత్యాన్నీ ఈ పద్యం బోధిస్తూ ఉంది.

వ్యక్తిత్వ ఔన్నత్యాన్ని సాధించే దిశలో తనలో ఉన్న అవగుణాల్ని తొలగించుకోవాలన్న బోధలో భాగంగా కొన్ని అవగుణాలను **శేషప్ప** కవి ఈ పద్యంలో పేర్కొన్నాడు. ఇట్లాంటి పద్యాలతోనే పలు శతకాలు ప్రకాశిస్తున్నాయి.

మానవ వ్యక్తిత్వ నిర్మాణం విషయంలో పెద్దపీటవేసిన శతకాల్లో **సుమతి, వేమన** శతకాలు ప్రధానమైనవి. మిగిలిన ఎన్నో శతకాలు సందర్భాన్నిబట్టి, అవసరమున్నచోట మానవుని ప్రవర్తనను గురించి ప్రస్తావించాయి. కాని **సుమతి, వేమన, భాస్కర** శతకాలవంటి శతకాలు మనిషి నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధను కనబరచాయి. ఉత్తమ వ్యక్తిత్వాన్ని, మంచి మూర్తిమత్వాన్ని సాధించాలనుకున్న వ్యక్తి మొదట కోపాన్ని పరిత్యజించాలి. అతని పతనానికి ఒక్కోసారి అతని కోపమే కారణం అయ్యే ప్రమాదం కూడా ఉంది. అందుకే

**తనకోపమె తనశత్రువు**
**తనశాంతమె తనకు రక్ష దయచుట్టంబౌ**

**తన సంతోషమె స్వర్గము**
**తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!**

అన్న **బద్దెన** మాట అక్షర సత్యం. ప్రతిమనిషి తన దుఃఖాన్ని తానే కొని తెచ్చుకోవడానికి తన కోపమే కారణమన్న విషయం లోక ప్రసిద్ధము. కోపాన్ని జయించినవాడే శాంతంగా ఉండగలడు. అప్పుడే అతనికి రక్షణ కూడా ఉంటుంది. కోప వర్జితుడైన వ్యక్తి వ్యక్తిత్వం ఆదర్శవంతమై నిలుస్తుంది. వ్యక్తిగతంగా తనకు, తన సమాజానికి కూడా అది శాంతిని, సౌఖ్యాన్ని కలిగించాలన్నపుడు కోపాన్ని త్యజించడం తప్పనిసరి అవుతుంది. అది ఉన్నత వ్యక్తిత్వ భూషణమై నిలుస్తుంది.

ప్రతి మనిషి మాట్లాడే సందర్భంలో ఆచి తూచి సంస్కారవంతంగా మాట్లాడినప్పుడే అతనికి గౌరవం. అప్పుడే అతని వ్యక్తిత్వం గొప్పదిగా భాసిస్తుంది. అందుకే మన వాళ్ళు **'నోరు మంచిదైతే ఊరుమంచిద'**న్న సామెతను తరచు ప్రయోగిస్తుంటారు. ఆ మాటను కూడా శతకకవులు స్పష్టంగా చెప్పే ప్రయత్నం చేశారు. **వేమన్న**

**మాటలాడనేర్చి మనసు రాజిల జేసి**
**పరగ ప్రియము చెప్పి బడల కున్న**
**నొకరి చేతి సొమ్ము లూరకవచ్చునా!**
**విశ్వదాభిరామ! వినురవేమ!**

అన్నాడు. మాట విలువ పెద్దది, మాట, మన్ననలను ఎదుటివారి పట్ల చూపించడమే ఉత్తమ సంస్కారం. అప్పుడు మన వ్యక్తిత్వం బహిర్గతం అవుతుంది. **'మాట'** శక్తివంతమైనది కనుకనే ఈ కవులు **'మాట'**ను గురించి మాటి మాటికి చెప్పారు. **సుమతి శతకకర్త** కూడా **'మాటకు సత్యము ప్రాణము'** అని తేల్చాడు. మంచి మాట వల్లనే మనకు మర్యాద లభిస్తుందన్నది వారి భావన. సత్యంతో కూడిన మాటలే మన గొప్పదనాన్ని నిలబెట్టగలవు. ఇదే విషయం కవులు పరిపరి విధాలుగా చెప్పారు.

జీవన నైపుణ్యాలలో సంభాషణాచాతుర్యం, దృఢ నిర్ణయవైఖరి, మానవ అనుబంధాలు, ఎదుటి వారిని అనవసరంగా నొప్పించకపోవడం వంటి ముఖ్యమైన కొన్ని అంశాలు. ఈ అంశాలనన్నింటిని గురించి మన శతకకవులు మనలను హెచ్చరించి, సంస్కరించాలన్న సంకల్పంతో వందలాది పద్యాలను అందించారు.

పలు శతకాలు యీ విషయాల్లో అనేకానేక బోధనలు అందించాయి. విద్యార్జన జీవితంలో ఒక ముఖ్య ఘట్టం. అది మన సంస్కారాన్ని పెంచుతుంది, మన వ్యక్తిత్వానికి వన్నె పెడుతుంది. అయితే విద్యార్జన చేసేటప్పుడు కాని, చేసిన పిదపగాని మొదట త్యజించాల్సింది దుర్జన సాంగత్యం. దానివల్ల మన విద్యకు వెలుగు వస్తుంది. మన స్థాయి పెరుగుతుంది. అయితే దుర్జనుడు ఎంత విద్యాధికుడైనా అతని సాంగత్యాన్ని త్యజించాలి. లేనిచో నీవు కూడా తప్పుడు మార్గంలో పడిపోవచ్చు. అట్లాంటి వాని సాంగత్యం ప్రమాదకర విషయమని చెప్పి, ఒక మంచి దృష్టాంతంతో దాన్ని వివరించాడు కవి.

**విద్యచేత భూషితుందయి వెలయుచున్న**
**దొదరి వర్జింపనగు జుమీ దుర్జనుందు**
**చారుమాణిక్య భూషిత శస్తమస్త**
**కంబుగల పన్నగము భయంకరము గాదె!**

అంటూ దుర్జన సాంగత్యములోని ప్రమాదాన్ని తెలిపి మానవ వ్యక్తిత్వ వికాసమునకు తోడ్పడినాడు. అయితే తాను స్వయంగా కష్టంచి విద్య సాధించాలి తప్ప, విద్యాధికుల దగ్గర నిరంతరం సంచరించడం వల్ల తనకేమీ విద్యరాదు. ఆ మాటనే

**విద్య లేని వాడు విద్యాధికుల చెంత**
**నుండి నంతఁ బండితుండు గాడు**
**కొలని హంసల కడ కొక్కెర యుండదా!**
**విశ్వదాభిరామ వినురవేమ!**

అంటూ **వేమన** నొక్కి చెప్పాడు. స్వీయ సాధనతోనే విద్య సాధ్యం. అదే మన మూర్తి మతానికి మరింత శోభను ఇస్తుంది. ఆ విషయంలో ఏ దగ్గరి దారులూ లేవు. కష్టించి సాధించిన విద్యతోనే సత్ఫలితం ఉంటుందన్నది సత్యమైన వాక్కు. అదే ఆచరణీయము.

ఏ సంస్కారం పొందాలన్నా సజ్జన సాంగత్యం, సద్గోష్ఠులే ప్రాధాన్యం వహిస్తాయి. ఆ మాటలను శతకం నొక్కిచెప్పిన సందర్భాలు అనేకం. ఉత్తమమైన వ్యక్తిత్వాన్ని పొందాలని అనుకున్నవానికి చిత్తశుద్ధి కూడా అవసరమే. ఈ రెండింటిని గూర్చి శతకకవులు చెప్పుకుంటూనే వచ్చారు.

**ఆత్మశుద్ధిలేని ఆచారమది యేల?**
**భాండ శుద్ధిలేని పాకమేల?**
**చిత్త శుద్ధి లేని శివపూజ లేలరా?**
**విశ్వదాభిరామ! వినురవేమ!**

అని **వేమన** చెప్పినమాటే దీనికి ప్రమాణం. పైగా చిత్తశుద్ధి కలిగివుండడం శివపూజతో సమానమైనదన్న ధ్వని కూడా ఉంది. ప్రత్యీవ్యక్తి ఆత్మశుద్ధి అంటే చిత్తశుద్ధి అనేది ఉంటేనే మంచి సంస్కారం గలవ్యక్తిగా గుర్తింపబడుతాడు. అదే మంచివ్యక్తిత్వమని పిలవబడుతుంది.

**'కుమార శతకం'** ఒక మాట చెబుతున్నది.

**సద్గోష్ఠి సిరియు నొసగును**
**సద్గోష్ఠియె కీర్తిచెందు, సంతుష్టిని నా**
**సద్గోష్ఠియె యొనగూర్చును**
**సద్గోష్ఠియె పాపములను జంపు కుమారా!**

ఈ మాటలే వ్యక్తిత్వ వికాసానికి చక్కని బాటలు. సజ్జన గోష్ఠి మనస్సును వికసింపజేసి, సిరిసంపదలిచ్చి, కీర్తిప్రతిష్ఠలను కలిగించి పాపపరిహారం చేస్తుంది. దాని ద్వారా వ్యక్తియొక్క వ్యక్తిత్వం మిక్కిలి తేజోవంతమై ప్రకాశిస్తుంది.

వేలాదిగా ఉన్న శతక సాహిత్యాన్ని లోతుగా పరిశీలిస్తే వ్యక్తిత్వ వికాస సంబంధమైన సత్యాలు కొల్లలుగా లభిస్తాయి. వ్యక్తిత్వ వికాస విషయంలో శతక సాహిత్యాన్ని మించిన సాహిత్యం లేదు.

Blank Page

# తెలుగు శతకాలు
# ప్రయోగ విశేషాలు

Blank Page

# ప్రయోగ విశేషాలు

ప్రతిభ కలిగిన ఏ కవియైనా తన రచనల్లో అవకాశాన్ని బట్టి అనేక ప్రయోగాలు చేస్తూ ఉండటం సహజమైన అంశం. నన్నయ్య మొదలుకొని నేటి వరకున్న కవులందరూ ఈ మార్గంలో నడిచినవారే. ప్రయోగాలు చేయని పక్షంలో సాహిత్యవిస్తృతి, వైవిధ్యం, తగ్గిపోయే అవకాశాలున్నాయి. ఛందస్సులో కాని. భాషా విషయంలోకాని, కావ్య నిర్మాణ విషయంలోకాని ప్రయోగానికి ఒక విశిష్టత ఉంది. అందుకే కవులు ఎందరో ఈ దారిలో నడిచారు.

ఆదినుంచి శతకకవులు తమ తమ శతకాల్లో ఎన్నెన్నో విశేష ప్రయోగాలు చేసి ప్రతిభామూర్తులుగా కీర్తిని అందుకున్నారు.

తొలిశతక కర్త **పాల్కురికి సోమనాథుడే** ఒక గొప్ప ప్రయోగశీలి. ఆయన మేధ ఒక గొప్ప ప్రయోగశాల. అందుకే ఆయనవల్ల ద్విపద, శతకం ఉదాహరణ కావ్యం వీధిమానవుల చరిత్రలు పలువైవిధ్యాలతో సాహిత్యరంగంలో అవతరించి నిలద్రొక్కుకున్నాయి. జాను తెనుగును కూడా సాహిత్యంలోకి తెచ్చిన ప్రతిభాశాలి ఆయన.

తన **వృషాధిపశతకంలో** ఆయన ఎన్నో ప్రయోగాలు చేపట్టాడు. తొలిశతకంలోనే ఆయన చేసిన ప్రయోగాలు తర్వాతి శతక కర్తలకు ఒక మార్గం చూపాయి. ఆయన అప్రతిమాన ప్రతిభాసముద్భాసి. ఆయన వ్యుత్పత్తి సాటిలేనిది. ఆయన కవిత్వం పరిశీలిస్తే ఆయన గొప్పదనాలన్నీ అవగతమవుతాయి. తన శతకంలో అచ్చతెనుగు పద్యాన్ని, తెలుగుతోబాటు కన్నడ, తమిళ, ఆరె మొదలైన ప్రాంతీయభాషల్లో పద్యాలు వ్రాసి పద్య ప్రతిష్ఠ పెంచే ప్రయోగాలు ఎన్నో చేశాడు. తెలుగు పద్యం ఎటువంటి ప్రయోగానికైనా పనికి వచ్చే గొప్ప మాధ్యమమని చాటి చెప్పాడు.

ఆనాటి **పాల్కురికి సోమనాథు**ని నుండి మొదలుకొని నేటి **జొన్నవిత్తుల రామలింగేశ్వర** రావు వరకు శతకకవులు తమ శతకాల్లో విశేష ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. విజయం సాధిస్తూనే ఉన్నారు. తెలుగు పద్యం కీర్తిని చాటి చెబుతూనే ఉన్నారు.

వ్యవహారిక భాష పద్యానికి పనికి రాదేమోనన్న వాదనను పరాస్తం చేస్తూ

కొన్ని శతకాలకు శతకాలే వ్యవహారిక భాషలో వచ్చాయి. అటువంటి వాటిలో **చంద్రశేఖర శతకం, సుబ్బలచ్మి** శతకం వంటివి ఉన్నాయి.

**కీ.శే. సురవరం ప్రతాపరెడ్డిగారు** గొప్ప మేధావి. అనేక గ్రంథాలను పరిశీలించి వాటిని తన **'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'**కు ఉపయోగించుకున్న పండితుడు. మానవ సామాజిక చరిత్రకు కావ్య, పురాణ, ఇతిహాసాదుల కన్నను శతకాలే ఎక్కువ ఉపయోగపడే ఆకరాలుగా గుర్తించి అనేక శతకాలను ఆయన సంప్రదించాడు. తన సాంఘిక చరిత్రలో ఆయన ప్రస్తావించిన **'చంద్రశేఖర శతకం'** పూర్తి వ్యావహారిక భాషలో ఉంది. అంతేకాదు అది గ్రామ్య భాష అని కూడా అనవచ్చు. **చంద్రశేఖర శతక కర్త**ను గురించిన వివరాలు అంతగా తెలియడం లేదు. ఆయన నెల్లూరు ప్రాంతం వాడేమోనని **సురవరం** వారు అభిప్రాయపడటానికి ఆయన వాడిన గ్రామ్యభాషలో నెల్లూరి మాండలికాలు అధికంగా ఉన్నవన్న ఆలోచనే కారణం. పద్యానికి గ్రాంథికమైనా, వ్యవహారికమైనా, గ్రామ్యమైనా ఒదిగిపోతుందన్న విషయం ఈ ప్రయోగాలవల్ల స్పష్టమైంది.

**ఇంటిని తిమ్మరాజుకత, యింటిని యీర్లకతాంప్రసంగముల్**
**యింటిని పాదులాలి, యిబమింటిని నాయకురాలి శౌర్రెమె**
**ప్పటికి నందివాక్కముల, పాండు చెరిత్రల నామ బాగ్యమె**
**న్నంటికి గల్గునోయను నవజ్ఞుడు మూర్ఖుడు చంద్రశేఖరా!**

అంటూ వినడాన్ని **'యింటిని'** అని, శౌర్యాన్ని **'శౌర్రెము'** అంటూ గ్రామ్య భాషను ఉపయోగించి అందమైన వృత్తపద్యాలు రచించి పద్యం గొప్పదనాన్ని చాటాడు.

ఈ కాలంలోనూ మహాపండితుడైన **చెఱువు సత్యనారాయణశాస్త్రి** పూర్తి మాండలికంలో ఒక మంచి శతకాన్ని అందించాడు.

**తల్లోపూలు గొనిస్త, సేతులకు బందర్గాజు లేపిస్త, యీ**
**వూల్లో యెవ్వుత్తె కట్టనసుమంటువ్పాద చమ్కీ బుటా**
**మల్లీ మొగ్గల తెల్లకోకయిదె యీమారెల్లి పట్కొస్తనే**
**చల్లా యెంకట సుబ్బలచ్మి బతుకేలా నువ్వు లేకుండి నన్** – అంటూ రాసిన **'సుబ్బలచ్మి'** శతకంలో సరససల్లాపాలు, సుకుమార శృంగార హాస్యాలు కలగలిపి చక్కని గ్రామ్యంలో వ్రాసి పద్యప్రాశస్త్యం చాటిచెప్పాడు. శతకం ఏ భావానికైనా,

ఎటువంటి భాషకైనా ఒదుగుతుందని నిరూపించాడు. పలువురు శతకకవులు భాష విషయంలో ఇట్లాంటి అనేక ప్రయోగాలు చేశారు.

ఛందస్సు విషయానికి వచ్చేసరికి ప్రారంభం నుంచి నేటివరకు ప్రసిద్ధమైన ఛందాలన్నీ శతకాల్లో ప్రయోగింపబడ్డాయి. సీసము, ఆటవెలది, తేటగీతి, కందం వంటి దేశిఛందో విశేషాలు, ఉత్పలమాల, చంపకమాల, శార్దూలము, మత్తేభము, వంటి సాధారణ మార్గ ఛందో విశేషాలే కాక మత్త కోకిల వంటి విశేష వృత్తాలు కూడా శతకంలో ప్రయోగింపబడ్డాయి. **ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి** తన **'కర్మన్‌ఘాట్ ఆంజనేయ'** శతకాన్నీ పూర్తిగా మత్తకోకిల వృత్తాలలో రచించారు.

**తండ్రి తాతల గూర్చియిచ్చిన ధాత్రినేనొక 'ట్రస్టి' నే**
**గాండ్రుగీండ్రని ఎవ్వడొచ్చిన కంఠలుంఠన చేసెదన్**
**చండ్రనిప్పుకలా జ్వలించెద జాగరూకత రౌద్రినై**
**వాండ్రువీండ్రను దేశరక్షక ప్రాపుగోరితి మారుతీ!**

అంటూ జాతీయ స్ఫూర్తి సమన్వితంగా రచించి అందించిన ఈ శతకంలో **'ప్రాపుగోరితి మారుతీ'!** అనేది మకుటం. ప్రతిపద్యం దేశభక్తికి, సదాశయాల ఆచరణకు సంబంధించినదేనన్న విషయం ఈ 'మత్తకోకిల'ల్లో ప్రతిబింబిస్తున్నది.

**నీవు ఎవ్వరు? నేన్ను ఎవ్వద? నీవు దేవుడు, జీవుడన్**
**దేవలోకమునందు దుష్టుడ, శిష్టదూరుడనయ్యరో!**
**తావకీన సుధాశయమ్ములు తాకి యిప్పుడె తేరితిన్**
**పావనాపథ చారణమ్మున ప్రాపుగోరితి మారుతీ!**

తమ భావావేశాలను, తమ అభిప్రాయ పరంపరలను స్వేచ్ఛగా ఎటువంటి అంతరాలు లేకుండా చెప్పుకో గలిగే అవకాశం శతకంలో పుష్కలంగా ఉంటుంది. అందులోనూ తమకు మిక్కిలి ఇష్టమైన ఛందస్సులు ప్రయోగించే అవకాశం కూడా శతకంలో పుష్కలమే. అందుకే కవి సమ్రాట్ **విశ్వనాథ సత్యనారాయణ** వంటి మహాకవులు 'శతకం'లో **'మధ్యాక్కఱ'** ఛందస్సును విస్తృతంగా ప్రయోగించారు. వారి **'విశ్వనాథ మధ్యాక్కఱలు'** శతక సముచ్చయానికి ప్రత్యేక గుర్తింపుగా కేంద్ర సాహిత్య ఆకాడెమీ వారి పురస్కారం కూడా లభించింది. తెలుగు శతకానికి, అందులోని ప్రయోగ నైపుణ్యానికి లభించిన పురస్కారంగా ఈ పురస్కారాన్ని భావించవచ్చు. అందుకే ప్రముఖ

విద్వాంసులు, ప్రసిద్ధ పండిత కవి మూర్ధన్యులు, ప్రత్యేకించి **విశ్వనాథ** వారి సాహిత్య ప్రభావితులు అయిన **ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యుల వారు** కూడా **'మధ్యాక్కఱ'**ల ప్రయోగంతో **'పాంచాల రాయ'** శతకాన్ని రచించారు.

**వరదలో కొట్టుకొని పోవు వాని పోలిక నుంటి నేను**
**హరి హరీ! కాల్సేతులైన నటునిటు కదలింపలేను**
**మరి పోవుచుంటి నిర్లక్ష్యమార్గాన, ఏ తీర భూమి**
**దొరుకునో చూచుకో, వ్రజవధూత్తార! పాంచాలరాయ!**

అని తన అశక్తతని, అంటే సామాన్యుని అశక్తతని, అతని నిర్లక్ష్య ధోరణిని, అతనిలో లేని స్థిరత్వాన్ని గురించి చెప్పుకున్న **మధ్యాక్కఱ** ఇది.

పాంచాలరాయస్వామి మూర్తి శ్రీమన్నారాయణ మూర్తి. వరంగల్లు జిల్లాలోని గీసుగొండ గ్రామం దగ్గర ఉన్న ఒక పురాతన ఆలయం. ఆ దైవాన్ని ఉద్దేశించి **ఆచార్య సుప్రసన్న** గారు చేసిన వాగ్రూప అర్చన ఈ శతకం.

**అన్యదేవాభిసరణమది యెరుంగను, సర్వ దేవ**
**మాన్యత నీ యందె దృశ్యమై శరణాగతిలోన**
**అన్యముల్ సర్వసాధనములంతర్భవించుట, నే న**
**నన్య శరణుద నిత్యభావనాలంబి! పాంచాలరాయ!**

విశిష్టాద్వైత సిద్ధాంతంలో శరణాగతి ప్రపత్తికి అత్యధిక ప్రాధాన్యము ఉంది. **'అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ'** అన్న మాటకు అన్వయించే విధంగా పాంచాలరాయని శరణువేడిన **మధ్యాక్కఱ** ఇది. ఈ ఛందో ప్రయోగాలను గమనిస్తే శతకం చేసిన ఈ ప్రయోగాలు పద్యకవిత్వమెంత ప్రశస్తమైనదో, పద్యం ఎటువంటి భావాన్నైనా ఎంతగా మోసుకు వెళ్ళగలదో తెలుపుతున్నది.

తెలుగు శతకాల్లో అన్యభాషా ప్రయోగాలు కొల్లలు. తెలుగు పద్య ఛందస్సుకు భాషాభేదం లేదన్న మాటను శతకాలు నిరూపించాయి. ఆధునిక శతకాల కవులు విరివిగా ఇంగ్లీషు, ఉర్దూ, హిందీ వంటి భాషలలోని అనేక శబ్దాలను తమ శతకాల్లో ప్రయోగించి పద్యం శక్తిని నిరూపించారు. **'బుద్ధ'** శతకంలో ఒక పద్యం ఉంది.

**దయలెక్టిక్సె' వడబ్బసొమ్మగును, పో, దంబంబుగాఁ బల్కగా**

**నియమింపం దొలినీవు, సోక్రటీసు దానిం గ్రీసులో నేర్వదే**
**పయనించెన్నది రోముకుం బిదప నా పాశ్చాత్య దేశమ్ములు**
**న్నియమం బొప్ప పఠించినంతఁ జెదునే నీ ధర్మమో బుద్ధుదా!**

ఈ పద్యంలో **'దయలెక్టిక్స్'** అనే ఆంగ్లపదాన్ని 'గ్రీసు', **'రోము'** అనే అన్యదేశీయ నామవాచకాలను ప్రయోగించడమే గాక, ఈ **'దయలెక్టిక్స్'** అనేది భారతీయుల, ముఖ్యంగా బౌద్ధుల సొత్తు అన్న మాటను ఆత్మ విశ్వాసంతో చెప్పిన మాట. పైగా భారతీయుల శాస్త్ర విజ్ఞానమెంత ప్రాచీనమో ఇది తెల్పుతుంది. బుద్ధుడు ఆధ్యాత్మిక విద్యయందే గాక లౌకిక విద్యలందు కూడా ఆరితేరినవాడన్న భావన ప్రకటించిన పద్యం.

పలు భాషల్లోని పదజాలాలతో తెలుగు పద్యాన్ని పండించడం అనే విద్య తెలుగు శతకకవులు చేశారు. తొలి తెలుగు శతకం నుంచే ప్రారంభింపబడిన ఈ విద్య అధికమై ఈ కాలంలో ఎంతో ప్రాధాన్యం ఉన్న ఇంగ్లీషు పదజాలాన్ని పద్యాల్లో ప్రయోగించిన శతక కవులు ఉన్నారు.

**డా. అక్కిరాజు సుందర రామకృష్ణ** పండితుడు, కవి, నటుడు, గాయకుడు. ఆయన రచించిన శతకాల్లో వ్యావహారికాన్ని శక్తివంతంగా ప్రయోగించడమే గాక **'శారదా'!** అనే మకటుంతో ఆయన రచించిన అధిక్షేప శతకం కూడా అత్యంత ప్రశస్తిపొందింది.

**'బేటా' వెర్రిగ నోటికొచ్చినటు 'సోంబేర్గా'డివై పల్కగా**
**'గ్రేటా' యంచును 'గుస్స' గాకుమటులన్ గీర్వాణమున్ జూపుచున్**
**'జూటకోరు' నుగాను సత్యగుణుడన్ శుంభద్యశోసాంద్రుడన్**
**'చీటా' మాదిరి చూడబోకు సుతు నన్ క్షేమంకరీ శారదా!**

అంటూ అడుగడుగునా వ్యవహారంలో ఉండే అన్యదేశ్యాలు ప్రయోగించి పద్యాన్ని పరిమళింపజేశాడు. ఈయన శతకాల్లో దాదాపుగా ప్రతి పద్యంలోను బాగా వ్యవహారంలో నలిగిన అన్య దేశ్యాలున్నాయి.

మహా కవి **బోయిభీమన్న** దంపతులకు అంకితమిచ్చిన **'భీమన్నా'** అనే ద్విశతి కావ్యంలో

**పండుగ 'గెట్టుగెదరు' లకు**
**'సండే'లను జరుపుకొనెడి సంరంభత 'కిం**
**గ్లాండ్' ఆదర్శంబయె, బల్**
**'వందరు' గద తెలుగు ధాత్రి! వా! భీమన్నా!**

అని పరదేశీ వ్యామోహాన్ని పరాయి పదాల ప్రయోగంతోనే సాధించి చమత్కరించాడు. **'స్పార్కు, డార్కు, డాఫర్, కేరు, మెడ్‌సిటి, నీలోఫర్, నిమ్స్, కిమ్స్, వెంటలేటర్, కార్పోరేట్'** మొదలైన ఇంగ్లీషు పదాలను పద్యాల్లో అందంగా పొదిగించి శతకాలు అందించాడు. **'శ్రీ శనిశ్వరా!'** అనే మరో శతకంలో మరొక ప్రయోగం చేశాడు. శతకానికి **'ఫలశ్రు తి'** పద్యాన్ని వ్రాసి శతకంలో మరో మార్గం చూపించాడు. సాధారణంగా ఫలశ్రు తులు మహాకావ్యాలకే మనవాళ్ళు పరిమితం చేశారు. కాని **అక్కిరాజు** వారు దాన్ని శతకం వరకు విస్తరించారు. ఇది అరుదైన ప్రయోగం.

**నీకెదె 'నూరు' దండములు, నిన్నిదెభక్తిని మోయుచుండు నీ**
**కాకికి 'వేయి' దండములు, కాలుని సోదర! సత్వరంబు చీ**
**కాకులు బాపి నన్ కరుణ గాచిన నిచ్చెద 'లక్ష' దండముల్**
**నీకిక 'కోటి' దండములు నెమ్మిని బ్రోవర! శ్రీశనేశ్వరా!**

ఇందులో ఒక చమత్కారం చూపించాడు. నూరు, వేయి, లక్ష కోటి వంటి మాటలు ఒక్కోసారి విసుగుపడ్డప్పుడు ప్రయోగిస్తుంటాము **'నీ మాటలకు, నీకు కోటి దండాలయ్యా!'** అంటుంటాము. ఆ సంఖ్యావాచకాన్ని చమత్కారంగా, విసుగు ధ్వనించే విధంగా శక్తివంతంగా ప్రయోగించి అదే వరుసలో ఫలశ్రుతి ఇలా చెప్పాడు.

**నా శతకంబు నెవ్వరు మననంబున శ్రద్ధవహించి భక్తి నా**
**పోశన బట్టురీతిని ప్రమోదముతో పఠియింత్రొ, వారికే**
**నాశములుండ బోవు, నను నమ్ముడి శాంతి లభించి తీరు' స**
**ర్వేశుని తోడ'టంచు వచియించెద దేవర శ్రీ శనీశ్వరా!**

**సుందర రామకృష్ణ 'భీమలింగ'** శతకంలోనూ ఇటువంటి ఎన్నో చమత్కారాలను ప్రయోగించి శతక సాహిత్య ప్రతిష్ఠకు మరింత వన్నె పెట్టాడు.

అన్యభాషా పదాలు పద్యాల్లో అక్కడక్కడా ప్రయోగించడమే కాదు ఏకంగా పద్యాల్నే అందించిన కవి **జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు.** శతక కవిత్వానికి తన

ప్రయోగాల ద్వారా కొత్తవన్నెలు తెచ్చాడు. ఆయన రాసిన శతకాల్లో **'బతుకమ్మ'** శతకం, **'రామలింగేశ్వర'** శతకం, **'సింగరేణి'** శతకం వంటివి ప్రసిద్ధాలు.

బతుకమ్మ శతకం కందపద్యాల శతకం. అందులో పూర్తి ఇంగ్లీషు పదాలు ప్రయోగించి కందం చెప్పాడు.

**ప్రైజింగ్‌యూ హానెస్ట్లీ**
**థౌజండ్స్ ఆఫ్ గుడ్‌ష్లవర్స్, దైర్ వర్‌షిప్ యీజ్**
**రీజన్‌లెస్, బ్లూజమ్‌లెస్,**
**హౌజనరస్, ప్లీజ్ గివ్ దెమ్ ఆల్ బతుకమ్మా!**

ఇంగ్లీషు వంటి అన్యభాషా పదాలు ఎంత అందంగా పద్యంలో ఒదిగిపోతాయో **బూజమ్‌లెస్, రీజన్‌లెస్, హౌజనరస్** అంటూ చెప్పిన యీ పదాలు ఎంత అందమైన పదాల కూర్పుగా నిలిచిపోయాయో యీ శతకపద్యం తెలిపింది.

ఛందం ఏదైనా కావచ్చు. భాషాపదాలు ఏవైనా కావచ్చు. పద్యం వాటిని పొదిగించుకోవడం పద్యం ప్రతిభే కాదు. కవి ప్రతిభ కూడా అందులో ఉంటుంది. కవి ప్రతిభను బట్టే కవిత్వం రాణిస్తుంది. దానిరూపం పద్యం కావచ్చు. వచనం కావచ్చు. మరొకటి కావచ్చు. కందంలో ఇంగ్లీషు పదాలను పొదిగించిన **జొన్నవిత్తుల** తన **రామలింగేశ్వర శతకం**లో వృత్తాల్లో కూడా ఇట్లాంటి అనేక ప్రయోగాలు చేసి సత్ఫలితం సాధించాడు. కేవలం ఇంగ్లీషే కాదు, తమిళం, హిందీ వంటి పదాలను, సంగీతంలో ప్రధానమైన సప్తస్వరాల్ని కూడా పొదిగి అందమైన పద్యాలను అందించాడు. ఇది శతకాల్లో ఒక విశిష్టమైన ప్రయోగం. ఆంగ్ల పద ప్రయోగం వృత్తపద్యంలో

**వాటైదూ సరుమై డివైను ట్రెడిషన్? ఫాలింగిటీజ్‌డే టుడే**
**ఫేటల్ లింక్స్, డెవిల్ డిజైర్స్, లవులెస్, వెట్లెస్, స్ప్లిట్టింగ్ ఫ్యామిలీస్,**
**టోటల్లీ ఇటుహాజ్ కొలాప్సు, హియరాల్, దూగుడ్‌ఫరిట్ వన్సైగెన్**
**గ్రేటాల్మైటి కమాన్, ఉయారువెయిటింగ్ శ్రీరామలింగేశ్వరా!**

అంటూ చెప్పడం పరిశీలిస్తే మరోసారి తెలుగు పద్యం ప్రతిభ తెలుస్తుంది. ఎన్ని నిర్బంధాలున్నా పద్య నిర్మాణంలో ప్రతిభావంతుడైన కవి వాటిని అధిగమించి, భావవైవిధ్యాన్ని, భాషా వైశిష్ట్యాన్ని నిరూపించగలడని శతకం ప్రయోగాల్ని చేసి నిరూపించింది.

అందులోనే 'హిందీ' భాషలో ఒక 'మత్తేభం' ఉంది.

**హర్ దేవ్ మై చాహతాహుయేక్కు అరమాన్, ఆవో మెరపాస్, యహో**
**చరితాపర్ కవితాలిఖాథ, ఇసుమే సర్వార్థు తేరే లియే**
**ఫిర్‌తో తూ సునురే మహానుదిలుసే, ప్రేమ్ సే ఇసీలీకె, జీ**
**స్థిరతా దేవ్ ముజుకో తేరీ నిలయమే శ్రీరామలింగేశ్వరా!**

పద్యం ఇముడించుకొనే శక్తిని నిరూపించిన ఈ శతకం కవి స,రి,గ,మ,లతోనూ ఒక ప్రయోగం చేశాడు

**సససా రీరిరి గాగ మామపదనీసా దారి, నీ మానిగా**
**పసగా, మామగ, మారిగా, సరిగా, పాపారిగా, దాస దా**
**స సమాధానిగ, దామ ధారిగ, సమాసా, సారి, నీ దారి మా**
**సదా నీ పదమాని సాగ, దరి దా శ్రీరామలింగేశ్వరా!**

తన శతకాల్లో ఇటువంటి అనేక ప్రయోగాలను కవి చేసి పద్య పటిష్ఠతను సరియైన ఉదాహరణలు నిలిపాడు. సప్తస్వరాలు, ఇంగ్లీషు పదాలు, హిందీ పదాలే గాకుండా పూర్తిగా తమిళపదాలు, సంస్కృతపదాలు మొదలైన భాషాపదాలు సమర్థంగా ప్రయోగించారు. **జూ, భో,ఛీ, స్త్రీ** వంటి అక్షరాలతో పాదారంభం చేసి కొన్ని కొత్త ప్రయోగాలు చేసిన శతకం రామలింగేశ్వర శతకం కాకుర్వర పదాలు, అనుకార స్వరపదాలు (**భోరు భోరు, భౌభౌ** వంటివి) పలుచోట్ల కవి ప్రయోగించారు.

శతకం ప్రయోగాల వేదికగా పలువురు శతక కవులు ఉపయోగించుకోవడం శతక ప్రాశస్త్యానికి వన్నె తెచ్చే విషయం. ఒకే గ్రంథంలో అనేక శతకాల్ని రచించడం ఒక విశేషం. వేరే వేరే మకుటాలను ప్రయోగించి వేరే వేరే శతకాలు చెప్పడం **'విశ్వనాథ మధ్యాక్కఱ'** లలో కనిపిస్తాయి. అది పది శతకాల సమాహారం. ఒకటి రెండు శతకాలు వ్రాయడం కన్నా ఇదొక ప్రత్యేక ప్రయోగం.

ఈ మధ్యలో ఇటువంటి ప్రయోగాన్ని చేసిన వారు **డా. వైద్యం వేంకటేశ్వరాచార్యుల** వారు. **'తెలుగుభాష'** వంటి తేట తెలుగు శతకం అందించిన ఆచార్యులవారు తమ ప్రౌఢశైలితో **'శతక ద్వాదశి'** అనే పేరుతో పన్నెండు శతకాల సముచ్చయాన్ని తెలుగులోకి తెచ్చి ఒక కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. **విశ్వనాథవారి** తర్వాత ఇంత ప్రౌఢంగా ఈ ప్రయోగాన్ని విజయవంతం చేసిన కవి **శ్రీ వైద్యం** వారు. ఈ శతక సముచ్చయంలోనివి **'శ్రీనివాస' శతకం 'కురుమూర్తివాస'**

**శతకం, 'రంగనాయక' శతకం, 'లక్ష్మీనృసింహ' శతకం, 'సుదర్శన చక్రరాజ' శతకం, 'చెన్నరాయ' శతకం, సుదర్శన చక్రరాజ శతకం (గీతపద్య శతకం), 'యతిరాజు' శతకం, 'లింగమూర్తి' శతకం 'ఉన్నమాట' శతకం, 'వేంకటేశ' శతకం** మొదలైనవి.

ఈ **శతక ద్వాదశి**లో మరో విశేషం ఉంది. ఛందో వైవిధ్యాన్ని చూపిన ఈ శతకాలలో వృత్తలతోబాటు, ఆటవెలది, తేటగీతి, కందం, సీసము వంటివే గాక ఒక గేయశతకం కూడా చోటు చేసుకుంది. **'క్ష'** కారం ప్రాసాక్షరంగా పెట్టి **'సుదర్శన చక్రరాజ'** శతకంలో చెప్పిన యీ పద్యం వారి ప్రయోగ కుశలతకు నిదర్శనం.

**అక్షముగల్గువాడవు, కటాక్షము సైతము జూపుదౌ! మహా**
**శిక్షలు వేయువాడవు, విశిష్టుల రక్షణసేయు దౌ! భవత్**
**పక్షుల బ్రోచువాడు, విపక్షులనెల్లెడ వేచెదౌ! మహా**
**దక్షత గల్గువాడవు – సుధర్మ సుదర్శన చక్రరాజమా!**

సాధారణంగా **'క్ష'** కారం దుష్టశిక్షణ, శిష్టరక్షణలకు బీజాక్షరంగా పెద్దలు చెబుతుంటారు. సుదర్శన చక్రం విష్ణు హస్త భూషణమై నిలిచి యీ కార్యంలో ప్రధాన ఆయుధం కావడం వల్ల యీ స్తుతి పద్యం ఈ ప్రాసాక్షరంతో శోభించింది.

బంధ కవిత్వం సాధారణంగా ప్రబంధాది కావ్యాల్లో ప్రయోగించే ఒక చిత్రకవితా విశేషం. ఈ విశేషము కొందరు శతకకవులలో కూడా దర్శనమిస్తుంది. ఈ కవి తన శతకాలలో పలుచోట్ల పలు విధాలైన బంధాలలో పద్యరచన చేసి శతక సాహిత్య ప్రశస్తిని ద్విగుణీకృతం చేశాడు. **'శ్రీకురుమూర్తి శ్రీనివాస'** శతకంలో ఎన్నో బంధకవిత్వ పద్యాలున్నాయి.

**దర ధర సురవర! మురహర**
**వరకరుణా సద్మ! బుధ సుభద! పరమాత్మా!**
**హరినంద కధర! వారణ**
**వరదా! కురుమూర్తి శ్రీనివాస! మహాత్మా!** అంటూ చెప్పిన ఖడ్గబంధ పద్యంతో పాటు, శైలబంధం, గోమూత్రికా బంధం, పుష్ప మాలికాబంధం మొదలైన బంధకవితా ప్రయోగాలు శతకాన్ని మరింత పరిపుష్టం చేశాయి. **గర్భకవిత్వం, ద్వ్యక్షరి, త్ర్యక్షరి** మొదలైన ప్రాసనియమాలు కూడా వీరు శతకాలలో ప్రయోగించారు. కవి ప్రతిభకు తోడు పద్య కవిత్వ ప్రభ కూడా వెలిగించిన శతకాలు ఇవి.

గేయ శతకాలు తొలి నుండి కొన్నే వెలువడినా ఒక ప్రత్యేకత కలిగినవిగా ఈ

ప్రయోగాలు నిలచిపోయాయి. ఇటీవలే **వరిగొండ కాంతారావు** నాలుగు గేయ శతకాలను అందించాడు. వ్యంగ్యం పునాదిగా సమకాలిక సంఘటనల నేపథ్యంలో సామాన్యుని జీవితాన్ని చిత్రించిన శతకాలు అవి.

**'స్వీయప్రకటనమ్', 'ఏలిక కొంకలేఖ', 'వినగనేర్తువెభాజపా' 'భరతసుతుడా మేలుకో'** అనే యీ నాలుగు శతకాలు ఈనాటి సమాజాన్ని, సమాజంలోని మాయలను, సామాన్యుని కడగండ్లను కళ్ళకు కట్టించిన గేయ శతకాలు.

**చిన్ని పాపల బూతుపాటలు**
**పెద్దపాపల బూతు డ్రెస్సులు**
**టి.విలోపల గొప్ప ప్రోగ్రాం**
**భరత సుతుడా! మేలుకో!** అని నేటి దృశ్యమాధ్యమాల దయనీయ స్థితిని, సమాజానికి అవి చేస్తున్న ద్రోహాన్ని ఎండగట్టే యత్నం చేసాడు.

**కూరలంగడి మాంసమంగడి**
**విద్యయంగడి తేడ ఏమది?**
**కార్పొరేటను గుద్దగప్పగ**
**విద్యపాతర, రాజశేఖర!** అని విద్యావ్యాపార విషయాన్ని, నేటిపాడు కాలాన్ని గురించి ఆవేదనను వెలిబుచ్చిన గేయం ఇది. ఆధునిక శతకకర్తలు నేట సమాజంలోని అనేక భ్రష్టాచారాలను తమ తమ శతకాల్లో బహిర్గతం చేస్తూనే పలురకాల ప్రయోగ నైపుణ్యాలను ప్రదర్శించడం ఎంతో సంతోషకరమైన అంశం.

తొలి నుండి తెలుగు శతకం నిరాటంకంగా సాగివస్తూనే కవుల ప్రతిభ ఆధారంగా అనేక ప్రయోగాలను, అనేక విషయాల్లో చేబట్టి పరిపుష్టమై నేటికీ నిలిచింది. వస్తువు విషయంలోనూ, భాషవిషయంలోనో, ఛందోవిషయంలోనో, సంఖ్యావిషయంలోనో ఏదో ఒక నూత్న ప్రయోగాల్ని నిర్వహించింది.

ప్రసిద్ధ పండితుడైన **కీ.శే. అంబటిపూడి వెంకటరత్నం గారు బ్రహ్మ సూత్రాలను** పద్యబద్ధం చేశారు. అదే విధంగా గాయత్రిని ఆరాధించే 'సంధ్య'ను పద్యంలో వ్రాశాడు. ఇవన్నీ ఒకే మకుటం **'కృష్ణప్రభూ!'** అనే దానితో రచించాడు. ఇవన్నీ కలిపి ఏడువందలు. ఈ పద్యాలన్నీ సప్తతిగా మారాయి.

**ముత్తెంపుం బవడంపై పైడి పన నల్పుందెల్పు మోముల్గనుల్**

**హత్తన్ మూడు కిరీటమందు నెలగాయన్ సర్వవర్ణాత్మచే**
**నొత్తుం దావరదా భయాంకుశకశల్ వుద్యత్కపాలీగదల్**
**మొత్తన్ శంఖము చక్రమంబుజయుగమ్మ్ముందేవి కృష్ణప్రభూ!**

**సంధ్యావిద్య** పేరుతో ఇందులో రచించిన ఈ పద్యానికి **'ముక్తావిద్రుమ హేమ నీల..'** ఇత్యాది సంధ్యావందన శ్లోకము మూలము. ప్రతి మంత్రానికీ ఒక పద్యం చొప్పున రచించిన ఈ సప్తతి ఎంతో గొప్ప శతకమే.

Blank Page

# తెలుగు శతకాలు
## సాంఘిక, సామాజికాంశాలు

# సాంఘిక, సామాజికాంశాలు

ఆంధ్రుల సాంఘిక చరిత్ర నందించిన **కీ.శే. సురవరం ప్రతాపరెడ్డి** గారు పలుచోట్ల శతకసాహిత్య ప్రత్యేకతలను, ప్రయోజనాన్ని గురించి ప్రస్తావించారు. పురాణాల కన్నా, ఇతిహాసాలకన్నా, కావ్యాలకన్నా, ప్రబంధాలకన్నా శతకాలే చరిత్రకు చక్కగా ఉపయోగపడగలవని ఆయన  భావించారు.

రచన విషయంలోనూ, వస్తువు విషయంలోనూ ఇంకా అనేక విషయాల్లోనూ శతకానికి ఉన్న స్వేచ్ఛ మిగతా ప్రక్రియల్లో తక్కువ. అదే ప్రధానకారణం కావచ్చు.

శ్రీశ్రీ తన **'సిరిసిరిమువ్వ'** శతకంలో నిస్తేజమైన ప్రభుత్వాలను గురించి చెబుతూ

**అసలు సమస్యలు గ్రాసం**
**వసనం వాసం! అలాంటి వాటిని చూపే**
**వసలేక గింజుకొని చ**
**చ్చి సున్నమవుతోంది ప్రభుత సిరిసిరి మువ్వా!**

అన్నాడు. నేటి ప్రభుత్వాలు ప్రజల విషయంలో వాళ్ళకనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డలకు కూడా సాయం చెయ్యలేని నిష్క్రియాపర్వతం ఉందని విమర్శించి ప్రజా పక్షపాతాన్ని వ్యక్తం చేశాడు. ఈ మాటల్లో ఎంతో సత్యం ఉంది. సమకాలీన సమాజంలోని సామాన్యుని ఆవేదన ఉంది.

ఇవే మాటలను, ఇంచుమించు ఇట్లాంటి భావాలనే క్రీ.శ. 1800 నాటి కాలంలో **శేషప్పకవి** కూడా తన **నరసింహ శతకం**లో చెప్పాడు. ఆ కాలంనాటి అస్తవ్యస్త సమాజస్థితిగతులకు **నరసింహ శతకం** వంటి శతకాలు అద్దం పట్టాయి. నాటి పరిపాలకుల, అధికారుల నిర్వాకాలను బయటపెట్టాయి.

**అధిక విద్యావంతులప్రయోజకులైరి, పూర్ణశంఠలు సభాపూజ్యులైరి**
**సత్యవంతుల మాట జనవిరోధంబాయె, వదరుబోతుల మాట వాసికెక్కె**
**ధర్మవాదనపరుల్ దారిద్ర్యమొందిరి, పరమలోభులు ధనప్రాప్తులైరి**
**పుణ్యవంతులు రోగభూత పీడితులైరి, దుష్టమానవులు వర్ధిష్ణులైరి**

**పక్షివాహన! మావంటి భిక్షుకులకు**
**శక్తి లేదాయెనికనీవె చాటుమాకు**
**భూషణవికాస! శ్రీ ధర్మపురి నివాస**
**దుష్ట సంహార! నరసింహదురితదూర!**

అని చెప్పిన యీ పద్యం ఆనాటి కాలాన్ని కళ్ళకు కట్టించింది. నాటి సమాజపు అస్తవ్యస్త స్థితిని చాటింది. ఏ సమాజంలో విద్యావంతులకు, సత్యవంతులకు, ధర్మ మార్గ ప్రవర్తకులకు, పుణ్యాత్ములకు స్థానం లేదో అక్కడ సామాన్యుడు భిక్షుకుడైపోయే ప్రమాదాన్ని ఈ పద్యం సూచిస్తుంది. ఒక రకంగా మనలను హెచ్చరిస్తూ ఉంది. ఇది అన్ని కాలాలకు వర్తించే సత్యం అని స్పష్టంగా చెప్పవచ్చు. కవి గుండెల్లో సమాజం పట్ల గూడుకట్టుకున్న వేదన శతక పద్యాల్లో ప్రతిధ్వనించింది.

ఇందులో అనేక పద్యాలు ఆనాటి సామాజిక స్థితిగతులకు అద్దం పట్టేవే. లోకంలో దుర్మార్గులకు అధికారం కట్టబెడితే వచ్చే కష్టాలు, ఉబికే కన్నీళ్ళు ఇన్నీ అన్నీ కావు. అవి ఈ నాటికీ మన సమాజం అనుభవిస్తున్నవే. అదే విషయాన్ని శతక కవి ఈ విధంగా చెప్పాడు.

**మాన్యంబు లీయ సమర్థుడొక్కడు లేడు, మాన్యముల్ చెరుప సమర్థులంత,**
**యెండిన ఊళ్ళగోడెతిగింపదెవ్వడు పండిన ఊళ్ళకే ప్రభువులంత**
**ఇతడు పేదయటంచు నెరిగింపదెవ్వండు కలవారి సిరులెన్నగలరు చాల**
**తనయాలిచేష్టల తప్పెన్నదెవ్వడు పెఱకాంత అంకెన్న పెద్దలంత**
**ఇట్టి దుష్టుల కధికార మిచ్చినట్టి**
**ప్రభువు తప్పులంచును మరి పలుకవలయు**
**భూషణవికాస! శ్రీ ధర్మపురి నివాస!**
**దష్ట సంహార! నరసింహ! దురితదూర!'**

కరువు రాక్షసికి బలియైపోయే ప్రాంతాలను పట్టించుకోకపోవడం. పేదకు భూవసతి కల్పించలేకపోవడం. వారిని గుర్తించి ఆదుకునే అధికారి ఉండకపోవడం, కలవారి సౌకర్యాలకే పెద్దపీటవేసే అధికార్లు ఉండడం, పేదలను గురించి ఆలోచన రానివ్వకపోవడం మొదలైన దుర్లక్షణాలున్న పెద్దలను మనం కలిగి ఉంటే, వాళ్ళ చేతులలోనే అధికారం కేంద్రీకరింపజేస్తే అదెంత దుర్మార్గమైన పనియో కవి నిబద్ధతతో, వేదనతో చెప్పాడు. నేటికీ మారని ఈ సందర్భం ఆలోచింపవలసినదేనన్న విషయం శతకం గుర్తుచేస్తున్నది.

**పెద్దలమంచును రాజుల**
**వద్దను గూర్చుండి నీచవాక్కులు**
**పలికే పెద్దలు భువిలో...** ఉన్నంతకాలం పేదల పరిస్థితిలో ఎటువంటి మార్పు ఉండదని **'కవి చౌడప్ప'** అట్లాంటి వారిని కఠినంగా తిట్టి,

**అనయము పేదల పట్లన్**
**వినయము గలవారు భువిని వెలయుచు నూరేం**
**డ్లును నిండ మనుచు** ఉండాలని కూడా వాంఛించాడు.

ఆనాటి పేదలగురించి ఆలోచించే శతకకవులను మనకు ఇది పరిచయం చేస్తున్నది. సామాజిక జీవనంలో అట్టడుగువారిని గురించి ఆలోచించని ఏ సాహిత్యాన్ని ఈ రోజు లోకం పరిగణించడం లేదు. శతకం మాత్రం భక్తితోబాటు మనిషిని గురించి అనేక కోణాలలో ఆలోచిస్తూనే రావడం గొప్ప విశేషం.

ఈ నాటికీ సమాజ స్థితిగతుల్లో పెద్దగా మార్పులు వచ్చిన దాఖలాలు లేవు. ఇంకా పెద్దల ముసుగులో అధికార పీఠాలను దొడ్డిదారుల్లో అధిరోహించి సమాజాన్ని, ప్రజా జీవితాన్ని మరింత ఛిన్నాభిన్నం చేస్తున్నారు. ఆ మాటలనే ఈ మధ్యే **డా.రాళ్ళబండి కవితా ప్రసాద్** రచించిన **'సప్తగిరి ధామ! కలియుగ సార్వభౌమ'** శతకంలో

**పుట్టలో దాగిన భుజగంబు కన్నను, పొంతనక్కిన పెద్దపులియుకన్న**
**శవముకై కాచిన శాలావృకము కన్న, పలలముపైని రాబందు కన్న**
**పాల కుండను దాగు హాలాహలముకన్న తోటి మిత్రుని వెన్నుపోటుకన్న**
**రసవత్ఫలములోని విషకీటకము కన్న పొల్లుమాటల కుళ్ళుబోతుకన్న**
**దొడ్డిదారిని పదవుల దూరి నట్టి**

**మనుజుడే వెయిరెట్లు ప్రమాదకారి**
**ప్రణవ సుమధామ! నిగమపరాగసీమ**
**సప్తగిరి ధామ! కలియుగ సార్వభౌమ**

అంటూ దుర్మార్గుల వల్ల కకావికలయ్యే సమాజదృశ్యాన్ని ధ్వనింపజేస్తూనే, అటువంటి వారెంత ప్రమాదకారులో మంచి, మంచి ఉపమానాలతో వివరించాడు.

సంఘంలోని పేదలను గురించి దాదాపు శతక కవులందరూ ఆలోచించారు. సామాజిక దృష్టి కలిగిన శతక కవులు, **వేమన్న** మొదలు నేటిదాకా వారి ప్రస్తావనను తమ శతకాలలో నిక్షేపిస్తూనే ఉన్నారు. **వేమన** పేదలకు పేదలే అండదండలన్న సంగతిని

**కనులు పోయినవాడు, కాళ్ళుపోయినవాడు**
**ఉభయులందరు కూడి యుండునట్లు**
**పేద పేద గూడి పెనగొని యుండును**
**విశ్వదాభిరామ! వినురవేమ!**

అంటూ వివరించడంలో ఎంతో సత్యం దాగి ఉంది. అందుకే అల్పులను అందలం ఎక్కించరాదని కూడా వేమన భావించాడు.

**అల్పబుద్ధి వాని కధికారమిచ్చిన**
**దొడ్డవారినెల్ల తొలగగొట్టు**
**చెప్పుదినెడుకుక్క చెఱుకు తీపెరుగునా!**
**విశ్వదాభిరామ! వినురవేమ!** అన్నాడు. సామాన్యునికి మేలు చేయాల్సిన అధికారి విశాల మనస్కుడై ఉండాలి తప్ప అల్పబుద్ధి వాడు కారాదని ఖచ్చితంగా చెప్పాడు.

నాటి పరిపాలకులు సరియైన రక్షణను సమాజానికి అందివ్వలేక పోవడాన్ని కూడా శతకకవులు తీవ్రంగా నిరసించారు. గోగులపాటి **కూర్మనాథకవి సింహాద్రి నారసింహాశతకం** ఈ విషయాల్ని మనకు అందిస్తూ ఉంది.

**గ్రామముల్ నిర్ధూమ ధామంబు లయ్యెను, సస్యంబులెల్ల నాశనము జెందె**
**దొడ్లలోశాకముల్ దుంపశుద్ధిగ బోయె, దోచిరి సర్వంబు గోచిదక్క**
**చెట్టొక పిట్టయై చెదిరిదిక్కుల, బలువెతవదరాని పాట్లు బడిరి**
**అన్నమందరకును అమృతోపమంబయ్యె, వరుసగా నిటమీద లేదు**
**ప్రజల పసదీరె... వైరి హరరంహ! సింహాద్రి నారసింహ!** అంటూ నాటి సమాజపు అధ్వాన్న స్థితిని శతకం రూపుకట్టింది. సంఘ శ్రేయస్సును కాంక్షించిన శతక కవి హృదయవేదనకు ఈ పద్యాలు అక్షర రూపాలు.

సమాజం పట్ల, ప్రజలపట్ల, మానవత్వం పట్ల శతక కవులకున్న గొప్ప భావాలకు వారి శతకాలే సాక్ష్యాలు.

**'లంచం'** సమాజంలో విశ్వరూపం చూస్తున్నది. సమాజంలోని ఉత్తమ ప్రమాణాలను అది తలక్రిందులు చేస్తున్నది. ఆ విషయాలను కూడా శతకం విస్మరించలేదు.

**'నరహరి గోపాలకృష్ణమ శెట్టి'** తొలి తెలుగు నవలా కారుడుగా గుర్తింపు పొందినవాడు. ఆయన కుమరుడు **'రాజా మణిశెట్టి'** తండ్రి జీవితాన్ని శతకంగా చేపుతూ ఆనాటి అధికారుల్లో పాతకుపోయిన లంచగొండి తనంవంటి దుష్ట లక్షణాలను ఎట్లా చెప్పాడో ఈ పద్యం తెలుపుతుంది.

**లాలించి ప్రజలచే లంచాలగైకొని, బుద్ధిమంతులవోలె బొలచునట్టి**
**జనహింసకులనెల్ల చక్కగా పరికించి మర్దింపగా మారు మందబుద్ధి**
**తమకు తోడగునట్టి కుమతులతోగూడి నీ మీద లేని పోని యవివేక**
**వ్యవహారముల బట్టి యవివేకులని పేరు బడసి నిందితవృత్తి బరగుదు**
**రౌర! నీ చరితంబు నెన్నగా నజునివశమె! రాజమాత్రుండవే నీవు రాజవినుత!**
**సకలభూపాలరింఛోళి చక్రవర్తి, క్షీరసత్కీర్తి గోపాలకృష్ణమూర్తి.**

ఇది **'కృష్ణమూర్తి'** శతకం. విషయం వ్యక్తిగతమైనా అప్పటి అధికారుల దురాగతాలు, దుష్ట పన్నాగాలు ఏ విధంగా ఉండేవో ఇది తెలియజేస్తున్నది.

అంటరాని తనాన్ని అధికశాతం శతకకవులు తమ శతకాల్లో నిందించారు. సామాజిక న్యాయం జరగాలన్నపుడు అస్పృశ్యత అనేది అదృశ్యం కావాలి. ఆ బలమైన కాంక్షతోనే **వేమన్న**

**మాలవాని నేల మరిమరి నిందింప**
**ఒడల రక్తమాంస మొకటి గాదొ,**
**వానిలోన వెలుగు 'వాని' కులంబేది?**
**విశ్వదాభిరామ! వినురవేమ!** అని సూటిగానే ప్రశ్నించాడు. నాటి నుండి నేటి వరకు శతక కవులు ఈ సాంఘిక దురాచారాలపై స్పందిస్తూనే ఉన్నారు. దీనిని బట్టే అది యీ నాటికి ఇంకా సమాజాన్ని అంటిపెట్టుకున్న సమస్యగానే తెలుస్తున్నది. ఈ విషయంలో శతక కవుల మార్గాన్నే అందరు కవులు అనుసరించాలి.

మూఢాచారాలను అన్నింటినీ **వేమన** నిర్ద్వంద్వంగా ఖండించి, వాటి హేతుబద్ధతను ప్రశ్నించి, తదనంతర కవులకు మార్గం చూపిన వాడయ్యాడు. **'రాతిబొమ్మకేల రంగైన వలువలు?'** అని ప్రశ్నించినా **'పాలసాగరమున పవ్వళించిన స్వామి గొల్లయిండ్ల పాలు కోరనేల?'** అని ప్రశ్నించినప్పుడు కాని, ఆయన లక్ష్యం సాంఘికమైన మార్పే. ఆ దిశగా ప్రయాణం చేసినవాడు గనుకనే మంచి దృష్టాంతాలతో పలుచోట్ల వ్యభిచారాన్ని ఖండించి, నీతి బోధ చేయగలిగాడు.

**ఇంటియాలి విడిచి యిల జారు కాంతల**
**వెంట దిరుగు వాడు వెఱ్ఱివాడు**
**పంట చేను విడిచి పరిగలేరిన యట్లు**
**విశ్వదాభిరామ! వినురవేమ!**

మానవ సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మత వ్యభిచారం. దానివల్ల మానవ సమాజం ఎన్ని రకాల సమస్యలను ఎదుర్కొంటున్నదో ప్రతివారికి అవగతంలో నున్న విషయమే. అందుకే వ్యభిచారాన్ని తీవ్రమైన భావంతో ఎంత వ్యతిరేకించాడో మనం **వేమన** మాటలలో గమనించవచ్చు.

తెలుగు శతక సాహిత్యానికి సమాజం పట్ల, సమాజంలోని ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు ఆయా కాలాలలో వెలువడిన శతకాలే సాక్ష్యం. భక్తి శతకాలైనా, నీతి శతకాలైనా, అధిక్షేప శతకాలైనా, మరే విషయానికి సంబంధించినవైనా తాము జీవిస్తున్న సంఘం విషయం గురించి మాత్రం ఎంతో శ్రద్ధతో బోధిస్తున్నాయి. సూటిగా కొన్ని, భంగ్యంతరంగా కొన్ని, మరో పద్ధతిలో కొన్ని మానవ అవసరాల్ని గుర్తించి వివరించాయి. వాటిని అనుకూల ధోరణిలో ఉపయోగించుకోవడం మన కర్తవ్యం. నాటి నుండి నేటి దాకా సమాజాన్నే లక్ష్యం చేసుకున్న విశేషమైన తెలుగు ప్రకియ శతకం.

# తెలుగు శతకాలు
# విశిష్టతలు

Blank Page

# విశిష్టతలు

తెలుగు శతకాలు ఎప్పటికీ నిలిచిపోయే కావ్యాలు. ప్రారంభం నుండి నేటి వరకు వెలువడుతూనే ఉన్నాయి. వెలువడిన వేలాది శతకాలు పద్యాన్ని పటిష్ఠం చేయడమే గాక పలు విషయాల్లో ముందుండి మనకు మార్గదర్శనం చేస్తున్నాయి. రచన విషయంలోనూ, శైలి విషయంలోనూ, ప్రయోగాల విషయంలోనూ, బోధన విషయంలోనూ, ఇంచుమించు అన్ని విషయాలలోనూ, అన్ని సందర్భాల లోనూ అవే మనకు ఆదర్శమై నిలుస్తున్నాయి.

తొలి శతక కర్తయైన **పాల్కురికి సోమన్న** వృత్తాలకన్నా ద్విపదకే ప్రాధాన్యమిచ్చి తన రచనలు కొనసాగించినా తన **'వృషాధిప'** శతకాన్ని మాత్రం అద్భుతమైన వృత్తాలలోనే రచించి ఎందరో కవులకు దారి చూపించాడు.

**సరసవచస్క, నిర్మలయశస్క, శివైక్య మనస్క, భక్తహృ**
**త్సరసిజగేహ క్లుప్త భవదాహ, దయాపరివాహ, చిత్సఖో**
**త్తరనిజశిల్ప, భక్త వతల్ప, మహావృషకల్ప మన్మనో**
**వరద! బసవా! బసవా! బసవా! వృషాధిపా!** వంటి పద్యాలు పోతనాది తదనంతర కవులకు మార్గదర్శకాలైనాయి. సుదీర్ఘ సమాస ఘటన చేసినా, అలతి అలతి పదాలతో పద్యం వ్రాసినా ఆయన పద్యాలన్నీ భావి కవులకు దారి చూపినవే.

భక్తుడే భగవంతుడన్న భావం భక్తి కవులకు ప్రబలం. అదే మాట అందరూ చెప్పారు. ఆ మాటనే **యథావాక్కుల అన్నమయ్య**

**ధరణిన్ తీర్థము లాడుకంటె, నతిమోదం బొప్ప యజ్ఞంబులం**
**బరగంజేయుట కంటె, సువ్రతములొప్పన్ వేద శాస్త్రార్థత**
**త్పరుడై యాదట సల్పుకంటె మది నుత్సాహించి నీ భక్తి స**
**త్పురుష శ్రేష్ఠుల బూజసేయుట మహాపుణ్యంబు సర్వేశ్వరా!'**

అన్నాడు. సద్భక్తుని సల్లక్షణాలను స్పష్టంగా చెప్పిన సర్వేశ్వర శతకం భక్తుడే భగవంతుడని చెప్పడం సమంజసం. భక్తుడంటే ఉత్తమ మానవ లక్షణాలు కలిగినవాడని తాత్పర్యం.

అంటే ఉత్తమమైన మానవుడే దేవుడన్నమాట నొక్కి చెప్పిన వాడు **యథావాక్కుల అన్నమయ్య**

**పోతన్న భాగవతం**లోని శబ్దాలంకార ప్రియత్వానికి పూర్వవేదిక **నారాయణ శతకం**

**నీవే తల్లివి, నీవె తండ్రివరయన్నీవే జగన్నాథుడౌ**
**నీవే నిశ్చల బాంధవుండవరయన్నీవే మునిస్తుత్యుడౌ**
**నీవే శంకర మూలమంత్రమరయన్ నీవే జగత్కర్తవున్**
**నీవే దిక్కనువారు వారలె కడున్నీవారు నారాయణా!**

పరమాత్ముడే పరమగతి అన్న భావాన్ని పరమరమణీయశైలిలో చెప్పిన పద్యం ఇది. ఇటువంటి పద్యాలు యిందులో కొల్లలు.

**జలకంబుల్ రసముల్ ప్రసూనములు వాచాబంధముల్ వాద్యముల్**
**కలశబ్ద ధ్వనులంచితాంబరమలంకారంబు దీప్తుల్ మెఱుం**
**గులు నైవేద్యము మాధురీమహిమగా గొల్తునిన్నున్ భక్తిరం**
**జిల, దివ్యార్చన గూర్చి నేర్చిన క్రియన్ శ్రీకాళహస్తీశ్వరా!'**

అని చెప్పిన కవి **ధూర్జటి**. తాను రాచరికపుకాలంలో ఉన్నా రాజులెంతటి మత్తులో ఈ శతకంలో చెప్పి ధిక్కార స్వరాన్ని వినిపించిన గొప్ప కవి. తన రచనలో నవరసాలతో స్వామినభిషేకిస్తానన్న కవీశ్వరుడు. అందుకే ఆయన శ్రీకాళహస్తీశ్వరునికి తన రచనల గుణదీపాలను వెలిగించి, మాధుర్యాన్ని ప్రసాదంగా అందించి శతకం ద్వారా తనయిష్టదైవాన్ని అర్చించి పునీతుడైనాడు.

వెనకటి తరం దాకా నిరంతరం పఠన పాఠనాదుల్లో కనిపించిన శతకాల్లో **'కృష్ణ'శతకం** ఒకటి. అత్యంత సరళంగా అద్వితీయంగా హరిభక్తిని మనసునిండా నింపగలిగే శక్తివంతమైన శతకం **'కృష్ణ' శతకం. నరసింహ కవి** ఈ శతక కర్త.

**నీవే తల్లివి తండ్రివి; నీవే నాతోడునీడ, నీవే సఖుడౌ,**
**నీవే గురుడవు, దైవము; నీవే నా పతియుగతియు నిజముగ కృష్ణా!**

పసితంలోనే నాలుకలకెక్కిన ఈ పద్యం ఎంత సరళమైందో భగవద్విషయంలో అంతలోతైంది. భక్తిని సరళతమం చేసే కంద పద్యాలు అందించిన ఈ శతకంలో అనేక చమత్కారాలున్నాయి.

**దివిజేంద్ర సుతుని జంపియు, రవిసుతు, రక్షించినావు రఘురాముడవై**
**దివిజేంద్ర సుతుని గాచియు, రవిసుతుబరిమార్చితౌర! రణమున కృష్ణా!**

ఇందులో కవి ఒక చమత్కారం చూపించాడు. ఉపయోగించిన రెండు పదాలతో రెండు అవతారాల కథను స్ఫురింపజేసాడు. దివిజేంద్రసుతుడు అంటే వాలి, అర్జునుడు, రవిసుతుడంటే సుగ్రీవుడు, కర్ణుడు – ఈ అర్థాల ఆధారంగా ఇంత చిన్న పద్యంలో అంత పెద్ద విషయం చెప్పడం విశేషం కవి ప్రతిభకు అది నికషోపలం.

కంద పద్యాలను అందంగా అందించిన శతకాలలో **'గువ్వలచెన్నా'** శతకం ఒకటి. **పట్టాభిరామ కవి** దీని కర్త. అనేకమానవధర్మాల్ని చెప్పిన ఈ శతకం పద్యం ప్రాశస్త్యాన్ని గురించి

**గుడి గూలును, నుయి పూడును**
**వడినీళ్ళ చెరువు దెగును, వనమును ఖిలమౌ**
**చెడనిది పద్యంబొకటే,**
**కుడియెడమల చూడకన్న గువ్వలచెన్నా?** అని పద్యం శాశ్వతత్వాన్ని స్పష్టంగా చెప్పాడు. నశ్వరమైన అనేక విషయాలున్నాయి కాని పద్యం మాత్రం అనశ్వరమైనదన్న యీ భావం ఎంత సత్యమో నేటికీ నిలిచి ఉన్న పద్యమే సాక్ష్యం చెబుతుంది. దాన్ని నిలబెట్టిన శతకాలు చెబుతున్నాయి.

తెలుగునేలపై **'దాశరథీ'** శతకానికున్న కీర్తి అనన్యసామాన్యం. తెలుగువాళ్ళ లోగిళ్ళలో నిరంతరం సేవించబడి, తెలుగువారికి అత్యంత ప్రీతిపాత్రుడైన దైవం ఆ భద్రాచల రామచంద్రమూర్తి. ఆయన సేవలోనే జీవితాన్ని పండించుకున్న **'రామదాసు'** అనే పేరుగలిగిన **'కంచర్లగోపన్న'** రచించిన శతకం **'దాశరథీ'** శతకం. ఆయన వాగ్గేయకారుడుగా ఎంతకీర్తిని పొందాడో, ఈ శతక రచనవల్ల అంతకు రెండింతల కీర్తిని సంపాదించుకున్నాడు.

**రంగదరాతి భంగ, ఖగరాజ తురంగ, విపత్పరం పరో**
**త్తుంగ, తమఃపతంగ, పరితోషిత రంగ, దయాంతరంగ, స**
**త్సంగ, ధరాత్మజా హృదయసారసభృంగ, నిశాచరాబ్జ మా**
**తంగ, శుభాంగ భద్రగిరి దాశరథీ కరుణా పయోనిధీ!**

రమణీయమైన శైలిలో రాముని కీర్తిస్తూ భక్తి తాత్పర్యాలను మన గుండెల్లో ఎక్కించిన **దాశరథీశతకం** ఒక అపూర్వ రచన.

సీతారాములనే తమ తల్లిదండ్రులుగా గౌరవించి సేవించే తెలుగు జనాల హృదయాల్లో వారిని చిరస్థాయిగా నిలుపుతూ

**శ్రీరమ సీతగాగ, నిజసేవక బృందము వీరవైష్ణవా**
**చార జనంబుగాగ, విరజానది గౌతమిగా, వికుంఠము**
**న్నారయ భద్రశైల శిఖరాగ్రము గాగ, వసించు చేతనో**
**ద్ధారకుడైన విష్ణుడవు దాశరథీ కరుణాపయోనిధీ!**

సీతమ్మను, రామచంద్రుని, లక్ష్మీనారాయణులుగా కీర్తిస్తూ అనన్య భక్తిని ఆ భద్రాద్రిరామునిపై వ్యక్తీకరిస్తూ తరించిన కవి గోపన్న. ఆయన శతకంలో మకుటానికి ఒక విశేషం ఉంది. యతిస్థానంలో **'దా'** ఉండటం వల్ల నాల్గోపాదం తొలి అక్షరం **త, థ, ద, ధ, న** లే రావాలి. ఇదొక చమత్కారం.

రామనామ కీర్తనే ఆయనకు అమృతప్రాయము. ఆయన భక్తి ఎంత ప్రశస్తమో ఆయన రచనా నిర్మాణము అంతే ప్రశస్తమైనది. ఆయన ప్రతిభ ప్రతి పద్యంలోనూ గోచరించడం ఈ శతకవిశేషం. మనిషి యోగ్యతను గురించి చెబుతూ

**బొంకనివాడె యోగ్యుడని బృందములెత్తిన చోట, జివ్వకున్**
**జంకని వాడె జోదు, రభసంబున నర్థికరంబు సాచినన్**
**గొంకని వాడె దాత, మిముగొల్చి భజించిన వాడెపో, నిరా**
**తంక మనస్కుడెన్నగను దాశరథీ కరుణాపయోనిధీ!**

అని అన్నాడు. అసత్యం చెప్పనివాడు, శత్రువులు తలపడినప్పుడు జంకనివాడు. చేయి చాయి అర్థించినవానికి లోభత్వం చూపక దానం చేసేవాడు, నిరంతరం నిన్ను సేవించేవాడే నిజమైన యోగ్యుడన్నాడు. సమాజోన్నతికి తోడ్పడగలిగే యోగ్యతగల వ్యక్తిని గురించి ఇంత చక్కగా చెప్పిన గోపన్న పద్యం సార్వకాలికం.

**అన్నమయ్య** తెలుగు తొలి వాగ్గేయకారుడు. ఆయన రచించిన వేలాది సంకీర్తనలు ఆయనకు, దానితోబాటు చక్కని తెనుగు భాషకు అందించిన కీర్తి అసామాన్యం. పరమ పురుషుణ్ణి తన కీర్తనలతో పరవశింపజేసిన అన్నమయ్య. ఆ తల్లి కొరకు

**వేంకటేశ్వర శతకాన్ని** అందించి తరించాడు. '**అమ్మకు తాళ్ళపాక ఘ దన్నదు పద్యశతంబు జెప్పె'** అంటూ

**చొచ్చితి తల్లి నీ మఱుగు, సొంపుగ నీ కరుణా కటాక్ష మె**
**ట్లిచ్చెదొ, నాకు నేడు పరమేశ్వరి! యో యలమేలు మంగ! నీ**
**మచ్చిక నందు నీ తరుణి మన్నన నే నినుగంటి నీకు నా**
**బచ్చెన మాటలేమిటికి బ్రాతివి జూదగ వేంకటేశ్వరా!**

ఆ తల్లి అలమేలు మంగకు శరణాగతిని చేసిన **అన్నమయ్య** ఆమె కటాక్షం కారణంగా ఆ స్వామికి కూడా దగ్గరి వాడైపోయాడు.

**విశ్వనాథ** వారు దేశం పట్టనంత కవిగా ప్రసిద్ధులు. వారు స్పృశించని తెలుగు సాహిత్య ప్రక్రియ లేదు. తెలుగు శతకానికి కేంద్రసాహిత్య ఆకాడెమీ పురస్కారం అందింపజేసిన **'కవిసమ్రాట్'** ఆయన. **మధ్యాక్కఱలు** శతకాల్లో రత్నమాణిక్యాలు. ఆయన **'మాస్వామి'** వంటి శతకాలు గొప్ప భావసౌరభం గుబాళింపజేసే శతకం. దాన్ని **విశ్వేశ్వర శతకం** అనికూడా అంటారు.

**తేనెల్ వాఱును, మేఘగర్జనలు వీతెంచున్, పికీ కన్యకా**
**నూన వ్యాహృత మాధుపంచమము చిందున్ ద్యోనభోంభః కణ**
**శ్రీనృత్యంబులు సూపు నాకవిత తండ్రీ! నా హృదంభోజమం**
**దానంద చ్యుతి పొంది, నీ శతక మిట్లైపోయె, విశ్వేశ్వరా!**

తేనేవాకలు, మేఘ గర్జనలు, కోకిల స్వర మాధుర్యాలు, ఆకాశ గంగా తరంగాల హేలలతో నిండినది తన కవిత్వమన్నది **విశ్వనాథవారి** ఆత్మవిశ్వాసం. ఆయన **'రామాయణ కల్పవృక్షానికి'**, ఇతర అన్ని కృతులకు వర్తించే ఈ సత్యం ఆయన శతకాలకూ పూర్తిగా వర్తిస్తుంది. అపురూప సృజన శీలియైన కవిసమ్రాట్టులు అందుకే ఈ శతకంలో ఆ స్వామిని ఉద్దేశిస్తూ

**నీవే రాజువు నీవే సత్కవివి తండ్రీ! నిన్ను వర్ణించెదన్**
**నీవే దైవము, నేను భక్తుదను తండ్రీ! నిన్ను ధ్యానించెదన్**
**నీవే భూమివి, నేను రక్షకుద తండ్రీ! నిన్ను పండించెదన్**
**నా వైదగ్ధ్యము నీవజూతు కృప సంధానించు విశ్వేశ్వరా!** అంటూ చెప్పిన పద్యంలో భగవంతుడే రాజైతే తాను సత్కవినని, భగవంతుడు దైవమైతే తాను భక్తుడనని,

ఆయన భూమి అయితే తాను కర్షకుడనని తాను వర్ణించి, ధ్యానించి పండిస్తానని చెప్పాడు. ఏ కవైనా భక్తితో భగవత్కటాక్షాన్ని సాధించడానికి తన సర్వశక్తులను ఉపయోగించి సాధించాలన్న భావాన్ని గొప్పగా చెప్పాడు. అంటే సర్వ ప్రయత్నాలు భగవత్పరంగానే సాగితే సదాశయాలన్నీ నెరవేరగలవని కవి భావన. శతక సాహిత్యానికే మకుటాయమానమైన శతకాలను అందించిన మహాకవి కవిసమ్రాట్ **విశ్వనాథ సత్యనారాయణ**.

తెలుగు ఆధునిక కవిత్వానికి శిఖరాయమానమైన కవిత్వాన్ని అందించి తెలుగు నేలపై ఆధునిక కవిత్వ ప్రవక్తగా కీర్తి పొందిన కవి **శ్రీశ్రీ**. నేటి కాలపు తీరుతెన్నులను నిక్కచ్చిగా, నిష్కర్షగా నిజాయితీతో సరదాగా కందపద్యాల్లో **శ్రీశ్రీ** చెప్పిన శతకం **'సిరిసిరిమువ్వ'** శతకం. మానవ మనస్తత్వాలను, ముఖ్యాంగా ఈనాటి మనిషిలోని ద్విముఖ తత్త్వాన్ని నిర్మొహమాటంగా చీల్చి చెండాడిన శతకం **శ్రీశ్రీ సిరిసిరిమువ్వ** శతకం.

**ఏ యెండకు సరిపోయే**
**ఆయా గొడుగులు ధరించునాతనిబ్రతుకే**
**హేయమటువంటి మానిసి**
**చేయడు తుది చిల్లిగవ్వ సిరిసిరిమువ్వా!** అంటూ ఎక్కడిమాట అక్కడే మాట్లాడే వ్యక్తిత్వం గలవాళ్ళ స్థాయిని తేల్చి చెప్పాడు. ఇంకో పద్యంలో

**పెద్దబాలశిక్ష చదివీ**
**చదవడమే తడవుగాగ సాహిత్యవిశా**
**రదులయినట్లుగ భావిం**
**చెదరు గదా కొంతమంది సిరిసిరిమువ్వా!** అని తక్కువ అధ్యయనంతో ఎక్కువ పండితులైనట్లు భావించే అల్పకవులపై విసుర్లు విసిరాడు **శ్రీశ్రీ**.

అధివాస్తవిక కవిగా, సినీ గేయకవిగా, అభ్యుదయకవిగా, విప్లవకవిగా తెలుగు దేశంలో వెలిగిపోయిన **శ్రీశ్రీ** పొందిన పురస్కారాలు లెక్కలేనన్ని కావచ్చు. కవిత్వం మనిషికి చైతన్యాన్ని ఇవ్వాలని అది కదిలేదీ కదిలించేది, పెను నిద్దుర వదిలించేది కావాలని ఆశించాడు. నిత్య పురోగామి కవిగా ప్రసిద్ధుడైన **శ్రీశ్రీ** కందాన్ని తన శతకంలో రచించడానికి పూనుకొని

**కందం తిక్కన గారిది**
**కుందవరపు వారి ముద్దు కుబ్జని దంతే**
**అందరి తరమాకందపు**
**చిందుల కిటుకుల్ గ్రహింప సిరిసిరిమువ్వా!** అన్నాడు. తన కన్నా ముందు **'కందం'** రాసిన కవుల ప్రతిభను గుర్తించడమే కాక **'కందం'** అందచందాల్ని గురించి చెప్పాడు. అందుకే

**అందంగా మధురస ని**
**ష్యందగా పఠితృహృదయ సంస్పందంగా**
**కందా లోకవంద రచిం**
**చిందుకు మనసయ్యెనాకు సిరిసిరిమువ్వా!** అని చెప్పి **'కందం'** చిన్నదే అయినా పెద్ద పెద్ద విషయాలకు దాన్ని చక్కగా ఉపయోగించుకోవచ్చునని స్పష్టం చేశాడు. పఠితల హృదయాకర్షణకు, రసభరితంగా విషయవిశ్లేషణ చేయడానికి కందం ఒదిగినంతగా మరో **ఛందం** ఒదగదేమోనని విశ్వాసం **శ్రీశ్రీ**లో ఉంది. అందుకే ఈ శతకానికి **కందాన్ని** ఎంచుకున్నాడు. దేశి ఛందస్సుల్లోనే తలమానికమై నిలిచిన కందానికి ఎన్ని నియమ నిబంధనలున్నా ప్రతిభావంతులైన కవుల చేతిలో కందం పోయిన పోకడలు సాహిత్య ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచిపోయి **'కందం రాసినవాడే కవి'** అన్న ప్రఖ్యాతిని తెచ్చుకున్నది. అందుకే ప్రతిభావంతులైన శతకకవులు పలువురు కందాల్లోనే తమ తమ శతకాలను అందించారు.

ఆధునిక కవులలో **దాశరథి**కి ప్రత్యేకస్థానం ఉంది. ప్రణయం చెప్పినా, ప్రళయం చెప్పినా కవిత్వాన్ని పండించడంలో ఆయనది అపారమైన ప్రతిభ. **'నా తెలంగాణ కోటి రత్నాల వీణ'** అని సగర్వంగా చెప్పుకున్న కవి దాశరథి. ఆయన **అగ్నిధార, రుద్రవీణ, కవితాపుష్పకం, మహాంధ్రోదయం** మొదలైన కవితా సంకలనాలు పూర్ణకవిత్వంతో వెలుగులు చిమ్మే రచనలు. ఆయన పద్యం వ్రాసినా, గేయం పలికినా, వచన కవిత్వం చెప్పినా అన్నింటిలోనూ తనదైన ముద్రవేసిన మహాకవి **దాశరథి**. అటువంటి ఆ మహాకవి **'అభినవ దాశరథీ'** శతకం అనే పేరు గల ఒక శతకాన్ని కూడా అందించారు. తన అనుభవాలను రంగరించి, లోక నీతిని రీతిని వ్యక్తీకరిస్తూ నిష్కర్షగా, నిరాఘాటంగా, వ్యంగ్యంగా, వృత్తపద్యాల్లో ఈ శతకాన్ని రచించాడు.

ఈ శతక రచనా సమయంలో ఇందులో తాను ఆలోచించిన మకుటం **'దాశరథీ కరుణా పయోనిధీ'** అనే కంచర్ల గోపన్న మకుటమే. కాని **శ్రీశ్రీ** వంటి కవితా సారథులు, మిత్రులు **'దాశరథీ కవితాపయోనిధీ!'** అనే మకుటాన్ని ఉంచమని సూచించినా, అది మరీ స్వోత్కర్షగా ఉంటుందన్న భావంతో **దాశరథి** పూర్వ మకుటాన్నే గ్రహించి ఆధునిక మానవుని స్వభావాలను, ఆధునిక సమాజాన్ని గురించిన సమాచారాన్నే తన శతకంలో వస్తువుగా గ్రహించి రచించాడు.

**వేల జనమ్ము కేల్చరచు వెల్తికవిత్వము తోడ దివ్య కా**
**వ్యాల రహస్యముల్ తెలిసినట్టి యొకండు, సెబాసటన్న ప**
**ద్యాలుగలట్టి సత్కవిత త్రాసున తూగునె? వేశ్యకాంతకున్**
**తాళి గలట్టిదీడగునె దాశరథీ కరుణా పయోనిధీ!**

కేవలం పైపై మెరుగుల కవిత్వానికి వేలాదిజనం చప్పట్లు చరిచినా అది గొప్ప కవిత్వం కాదన్నాడు. దివ్యకావ్యరసరహస్యం తెలిసిన ఒక్కడైనా సరేయని మెచ్చుకున్న రచనే సత్కవిత్వమనే భావం చెప్పిన **దాశరథి** మాట ఆయన కవిత్వానికే సరిగ్గా అన్వయిస్తుంది.

స్వాతంత్ర్యానంతరం వేగాతివేగంగా జరిగే మార్పులవల్ల భారతీయుల ఆలోచనా విధానమూ మారిపోయింది. మనం అనుభవిస్తున్న ఈ స్వాతంత్ర్యం ఎందరు మహామహుల త్యాగఫలమో మనం మరచిపోతున్నాము. స్వయంగా పోరాటపథంలో నడిచిన **దాశరథి** మనస్సు ఆ విషయంలో కలతచెంది

**పోయిరి జాతిగూర్చి మృతి బొందిన వారలు, కాని, జ్ఞప్తి రా**
**దాయెను వారి గూర్చిన కథావళి యించుకగూడ జాతికిన్**
**నాయిలు, నాసతీసుతులు, నా ధనధాన్యములన్నవారి సా**
**త్తాయెను రాజపీఠములు దాశరథీ కరుణాపయోనిధీ!**

అని ఘోషించింది.

నిరంతరం స్వార్థప్రయోజనాలతో మంత్రుల వెంట తిరుగుతూ పలురకాల ప్రయత్నాలతో, తమ పలుకుబడిని పెంచుకునేవాళ్ళ ప్రవర్తనలకు నొచ్చుకున్న దాశరథి

**మంత్రికి నేను మిత్రుడను, మంత్రివరేణ్యుని వెంటవచ్చితిన్**
**మంత్రిని నేను తేగలను, మంత్రికె నేటి సభాపతిత్వమన్**
**మంత్రుల చేతి జంత్రముల మాదిరి మ్రోగెదు నట్టి వట్టి దు**
**స్తంత్రుల నేమి జేయవలె దాశరథీ కరుణాపయోనిధీ!**

అని చెప్పి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు జేసే ఎందరెందరో ఈ కాలంలో ప్రముఖులై చరిస్తున్నారని ఆవేదన చెందాడు.

లోకం పోకడలు బాగా ఎరిగిన **దాశరథి** చేతిలో ఈ శతకం గొప్ప శతకంగా వెలిగి లోకానికి జ్ఞాన దీధితులను ప్రసాదిస్తున్నది. ఆధునిక శతకాల్లో ఇదొక ప్రత్యేకత సంతరించుకున్న శతకమనిచెప్పడంలో విప్రతిపత్తి లేదు.

ఇప్పటి కవితారంగంలో **బోయిభీమన్నకు** ఒక ప్రత్యేక స్థానం ఉంది. **పాలేరు** నుండి **పద్మశ్రీ** వరకు ఎదిగిన **బోయిభీమన్న** చేవ గలిగిన కవిత్వంతో, అందమైన పద్యనిర్మాణ శిల్పంతో **'పిల్లీ'** శతకాన్ని రచించారు. కళాప్రపూర్ణులైన **భీమన్న**గారు జాతీయ భావాలు పుష్కలంగా కలిగిన కవి. సాహిత్యం వేదికగా సాంఘిక న్యాయం కొరకు పోరాటం చేసిన యోధుడు. సమాజానికి మాయనిమచ్చయై నిలిచిన అంటరానితనంపై నిత్యం యుద్ధం చేసిన యోద్ధ.

**'పిల్లీ'** శతకం 126 పద్యాలున్న కందపద్యాల శతకం. పగటివేషాలు వేసేవారై ప్రజాశ్రేయస్సు మరచి మోసం చేస్తున్న వారిపై యెత్తిన కవిత్వఖడ్గం యీ శతకం. శతకం చిన్నదే, విషయం పెద్దది. పొందికగా కూర్చున్న పిల్లిలో మంగళరకమైన శ్రీకారాన్ని చూసిన కవి భీమన్న

**హితులకు ద్రోహము సేతురు,**
**పితరులనే మోసగింత్రు పేదయు తింద్రున్**
**చితుకైన కలసివచ్చిన,**
**బ్రతుకొక్కటె లోక నీతి భద్రమె పిల్లీ!** అన్నాడు. నేటి మానవుడు తానొక్కడే బ్రతకాలన్న దురాశతో ఎంతదగ్గరివాళ్ళనైనా మోసగించడానికి, ఎంత ఆత్మీయులకైనా ద్రోహం చెయ్యడానికి వెనకాడడని హెచ్చరించాడు. తాను చేసే పనిమాత్రమే సత్యమైనదని, అదే పనిని ఇతరులెవరైనా చేస్తే మాత్రం దోషమని అనేవాళ్ళు ఈనాటి సమాజంలో కొల్లలు.

**తను చేయుచున్న పనినే**
**తన వైరి యొనర్చెనేని తప్పని తెగడున్**
**మనుజుండు నిన్ను తరిమిన**
**శునకము ఎలుకకై యిల్లు జొరదే పిల్లీ!** అని విశదీకరించాడు.

**మానవుని నిత్యవిధిలో**
**ప్రాణమ్ములు దస్సియున్న పట్టున కావ్యం**
**బానంద మొసగు మోహిని**
**కానేరనిచో మరెందు కమ్మా పిల్లీ!**

అలసిన మనస్సుకు ఆనందాన్ని ఇవ్వలేని రచన వ్యర్థమన్న ఈ పద్యం రచయితలకు మార్గదర్శకం.

అనేకానేక పురస్కారాలను పొంది **'రాగవాసిష్ఠం' 'మానవుని మరో మజిలీ'** వంటి పలు ప్రయోజనాత్మక రచనలందించిన **బోయి భీమన్న 'పిల్లీ'** శతకం శతక సాహిత్యాకాశంలో నిరంతరం వెలిగే నక్షత్ర సదృశం.

నాటినుండి నేటివరకు నిరంతరంగా కొనసాగే ఈ శతక ప్రక్రియ పండితకవులను, కవిత్వ ప్రారంభదశలో ఉన్న కవులను కూడా ఆకర్షిస్తూనే ఉంది. పుంఖాను పుంఖాలుగా తెలుగుశతకాలు వెలువడుతూనే ఉన్నాయి. **కీ.శే. మోత్కూరు మధుసూధనరావు, కీ.శే. ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య, పల్లా రామకోటార్య, ఆచార్య లక్ష్మణమూర్తి, డా.కె. కోదండరామాచార్య, శ్రీమాన్ భాష్యాచార్యులు, మోత్కూరు మాణిక్యరావు, డా. ఐ. కిషన్‌రావు, వై. రుక్మాంగద రెడ్డి, డా. జయవీర రాజు, డా. ఎన్.వి.ఎన్.చారి** వంటి ఎందరెందరో శతకాల సృష్టిలో ముందంజల వేస్తూ తెలుగు శతక సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూనే ఉన్నారు.

**కీ.శే. మోత్కూరు మధుసూదన రావు, అన్నమాచార్య** రచించినట్లుగానే **'వేంకటేశ్వర'** శతకాన్ని రచించాడు. అయితే అన్నమయ్య అమ్మవారికి శతకాన్ని రాసి యిస్తే **మధుసూదన రావు** గారు అయ్యవారికే శతకాన్ని యిచ్చాడు. పైగా

**వచ్చియు రానిమాటలను వ్రాసితి నీ శతకమ్ము, దీనిలో**
**నచ్చపు భక్తిజొప్పిల మదార్తి, భవన్నుతి, లోకవర్తనం**

**బచ్చువడంగ జేసితిని, నల్పమెయైన దయార్ద్ర దృష్టికిన్**

**హెచ్చుగదోచు వేగమె గ్రహింపగ వేడెద వెంకటేశ్వరా!** అని ప్రార్థిస్తూ తాను యేయే విషయాలను యీ శతకంలో చెప్పాడో వివరించి దయాదృష్టితో స్వీకరింపుమని వేడుకున్నాడు. లోకం పోకడను గురించి స్వామివారికి విన్నవిస్తూ

**వంకరత్రోవలన్ సనెడు వారలు ద్రవ్యము కోసమెంతయున్**

**జంకక ఘోరకృత్యముల సల్పుచు నుండెదరట్టివారికిన్**

**కింకర వృత్తి నీ శతక కీరము నంకితమీగలాడనే భ**

**క్త్యంకుర మిద్దిదేవ! భవదంఘ్రులకిచ్చెద వేంకటేశ్వరా!**

అంటూ తన శతకాన్ని హాయలొలికే చిలుకగా వర్ణించుకుంటూ ఇంతటి కీరాన్ని నీకుతప్ప మరెవరికివ్వగలనని చెప్పుకున్నాడు. ఆ క్రమంలోనే నేటి మానవులు తమ స్వార్థం కోసం ఎంతటి ఘోరాలకు పాల్పడుతున్నారో కూడా చెప్పాడు. పలువురు ఆధునికులు కూడా తమ శతకాల్లో నేటి లోకాన్ని గూర్చి, దాన్లో కనిపిస్తున్న దుర్గాగ్గాల్ని గురించి బాధామయ హృదయంతో చెప్పుకున్నారు.

**ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య** ఛందోమర్మజ్ఞుడు. మహాపండితుడు, కవి, విమర్శకుడు. ఆయన **శ్రీ లక్ష్మణ యతీంద్రుల**వారికి అంకితం చేస్తూ '**యతీంద్రా! వ్యాజరామానుజా!**' అనే మకుటంతో అందించిన '**అంతర్మథనము**'లో ఇటువంటి విశేషాలు ఎన్నో ఉన్నాయి. ఈనాటి సమాజంలోని యీ పార్శ్వాన్ని తెలియజేసే పద్యాలు అడుగడుగునా ఈ శతకంలో తారసపడతాయి.

**బందుల్ ప్రేలెడి మందు పాతరలు, ఒప్పందాలు, హత్యల్, వధల్**

**ముందున్ వెన్కల కాల్పులున్, ఎదురు కాల్పుల్, చంపుటల్, చచ్చుటల్**

**ఎందాకీ ప్రజపేర సాగునొ ప్రజాహింసా రిరింసా వ్రత**

**మ్మందూ బద్ధమే యెప్పుడున్ ప్రజ! యతీంద్రా! వ్యాజరామానుజా!**

ఇటువంటి నేటి సామాజిక దృశ్యావిష్కరణ పద్యాలకు యీ శతకం నిలువెత్తు సాక్ష్యం. సమకాలీన సమాజం యొక్క దయనీయస్థితికి శతకకవులు వెలిబుచ్చిన వేదనకు యీ పద్యాలే ప్రమాణాలు. భూగోళమంతా ఏదో ఒక రూపంలో హింసా వేదికగా మారడాన్ని చూచి కవి పొందిన వేదనంతా ఈ శతకంలోని పద్యాలలో పరివ్యాప్తమై ఉంది. మానవ ప్రాణాలకు భద్రతలేని, విలువ లేని కాలం రారాదు

అన్న ఆకాంక్ష బలీయంగా కనిపిస్తున్నది. దీనికి కారణభూతమైన నాయకత్వం మరోసారి ఆలోచించాలన్న ఆలోచనను ధ్వనింపజేశారు ఆచార్యులవారు.

**ఆచార్య శ్రీ లక్ష్మణమూర్తి** గారు సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల సాహిత్యాలలో పారం ముట్టిన పండితులు. ఎంతో ఆర్తితో వారందించిన పద్య కావ్యాలలో **'గోపికా వల్లభా!'** శతకకావ్యం, యావదాంధ్రదేశంలో ఎందరో పండితుల మన్నన లందుకున్నది. గొప్ప ధారాశుద్ధి, అపురూప సమాస గ్రంథనం, నిర్మల నిశ్చల భక్తితత్త్వం పెనవేసుకొని అందమైన పద్యాలను అందించిన శతకం.

**కలియోగంజియొ ద్రావి జీవనము చక్కంజేయు నాగేటి ముం**
**గల లక్ష్మీ చరణాంబుజాతములు సందర్శించువాడే కృషీ**
**వలయోగీశుడు, వీని జూడగదవే వ్యామోహ దూరంబుగా**
**బలరామాకృతి సుందరాపఘున! దేవా! గోపికావల్లభా!**

కృషివలుణ్ణి గొప్పయోగిగా సంభావించి, అతన్ని బలరామస్వామిగా భావించి దశవతార వర్ణన సందర్భంలో అవతార వర్ణన చేశారు **లక్ష్మణమూర్తి** గారు. ఇందులో ఉన్న తత్త్వం సమాజపోషణను ధ్వనింపజేయడం విశేషం.

కవి వినయశీలానికి శరణాగతి తత్త్వానికి ఈ కావ్యంలోని అనేక పద్యాలు ప్రతీకలు.

**ఇది నిర్దోషము కాదు, కావ్యమిది కాదే! పాండితీ స్ఫూర్తియ**
**న్నది కించిత్తయినం గనంబడెదు చందంబిందు లేదే! గ్రహిం**
**చెదు నెట్లందువె? నీ పదాబ్జయుగళీ సేవా సమర్చా సుఖా**
**స్పదమీ పద్య శతంబుగైకొనుట తప్పా? గోపికావల్లభా!**

ఆర్తిని, ఆత్మీయతను వస్తువుగా గ్రహించి శిల్పసమన్వితంగా, పుష్టిమంతంగా రచింపబడినది **'గోపికావల్లభా!'** శతక కావ్యం.

కవిత్వానికి సూటిదనం, వ్యంగ్యం, అధిక్షేపం, అలంకారాలే. శతకకవుల ఈ మూడు పద్ధతుల్లోను శతక రచనలు చేశారు. కాని ఈ మూడింటిని మేళవించి ఒకే శతకంలో పొందుపరచిన కవి **కీ.శే. పల్లా రామకోటార్య.** వారందించిన **'వెట్టి వెంగళప్ప'** శతకం అనేక సమకాలీన విశేషాల సమాహారం.

**క్లాసుటీచరొకడు క్యాప్స్టన్ను సిగరెట్టు**
**కాల్చజూచినట్టి గుడుగు గాయ**
**ఇల్లు చేరువెనక ఇమిటేటు చేసెరా**
**వినగదప్ప వెట్టి వెంగళప్ప!**

సమాజంలో ఆదర్శంగా నిలవాల్సిన అధ్యాపకులే పక్క దారిపడితే వారి విద్యార్థులు వారినే అనుసరిస్తారు. దాని వల్ల సమాజమే భ్రష్టుపట్టే ప్రమాదం ఉందన్న హెచ్చరికను చెప్పిన పద్యంతో బాటు మన దేశానికున్న పొరగు సరిగా లేదన్న భావంతో అరవైలలో చెప్పిన ఈ పద్యం ఇప్పటికీ వర్తిస్తుంది.

**పాకు భాయిగాదు పక్క బల్లెంబాయె**
**చీని భాయి గాదు చిట్లగొట్టు**
**మంచినేస్త గాండ్రె మనభాయి గాండ్లెల్ల**
**వినగదప్ప వెట్టి వెంగళప్ప!**

పాకిస్తాన్, చైనాల బూటకపు ప్రేమను బట్టబయలు చేసినది యీ పద్యం. ప్రతి వ్యక్తికీ తన దేశంపై మమకారం ఎంత ఉన్నా పక్కదేశాల వాళ్ళు మన విషయంలో ఏ విధంగా ఉంటున్నారన్న దాన్ని కూడా పరిశీలిస్తుండాలన్న సూచన చేసిన పద్యం ఇది.

**ఆత్మరక్షణపేర అణ్వస్త్రఖరపీఠి**
**నధివసించి శాంతి నభిలషించి**
**అలమటింపసాగె నమెరికా రష్యాలు**
**వినగదప్పవెట్టి వెంగళప్ప!**

అణ్వాస్త్రాలు తగ్గించుకోవాలంటూ అగ్రరాజ్యాలన్నీ ఘోషిస్తూనే తాము మాత్రం తమ ఆత్మరక్షణకు వాటిని దాచుకుంటున్నామని నీతులు చెప్పడాన్ని తప్పు పట్టిన వైనం యీ పద్యం స్పష్టపరుస్తున్నది.

వేదవిద్య అతి ప్రాచీన భారతీయ విద్య. వేదవిద్యా సాధనతోబాటు అనేక సంప్రదాయ శాస్త్ర విద్యలు కూడా అధ్యయనం చేసి ఆరితేరిన **డా. కంఠ్లకుంట కోదండరామాచార్యులు** గొప్ప పండితులు, విద్వత్కవి. వారు సంస్కృత ఆంధ్ర సాహిత్య

నిష్ణాతులు. ఢిల్లీ, కాకినాడ, హైదరాబాదు, వరంగల్లు వంటి దేశంలోని పలుచోట్ల సత్కారాలు, పురస్కారాలు అందుకున్న విద్వాంసులు. అమెరికా వంటి విదేశాలు వారి ప్రతిభకు నీరాజనాలు పట్టాయి. వేదవిదులు, ప్రత్యేకించి వేదావధానులు అయిన ఆచార్యులవారు తమ అపారమైన విద్వత్తు పునాదిగా సంస్కృత భాషలో **'జలతరంగిణి', 'పరివర్తనమ్'** వంటి అనేక రచనలు చేసినా, తెలుగులో 'వేయి పడగలు భాగవతత్త్వము' 'గుప్త సుధాస్వాదనము', **'జ్ఞాన భూమికలు'** వంటి గ్రంథాలనందించినా మౌలికంగా ఆయన కవి, సంప్రదాయం ఆయన నేపథ్యం, భక్తి తత్త్వం ఆయన పునాది. అందుకే భక్తాగ్రేసరుడు, తొలి తెలుగు వాగ్గేయకారుడు, స్వామి నందక ఖడ్గాంశజుడు అయిన అన్నమయ్యనే వస్తువును చేసి ఆయన భక్తి సిద్ధాంతాన్నే వివరిస్తూ **'నందకాంశజా'** అనే ఒక శతకాన్ని రచించారు.

శత్రువులను చీల్చిచెండాడే శక్తి ఖడ్గానికి ఉంటుంది. దుష్ట శిక్షణచేసే స్వామిఖడ్గం నందకం. ఆ అంశలో జన్మించినవాడే **అన్నమయ్య**. ఆ విషయాన్నే భూమికగా

**ఖండన భీముడైన సరె, వాడొక దుష్టుడు, నీచుడైన చో**
**ఖండన చేయు లక్షణము ఖడ్గము కొప్పును, ఔర! సంఘమం**
**దుండెడు జాతి భేదమును ద్రుంచగ ఖడ్గము కీర్తనయ్యె నే**
**పండిన పూర్వజన్మ వరివస్య ఫలించిది నందకాంశజా!**

అని చెప్పిన యీ పద్యం దుష్ట శిక్షణ చేసిన స్వామి ఖడ్గంవలెనే అన్నమయ్య కూడా తన సాహిత్యఖడ్గం సహాయంగా జాతిభేదాలను త్రుంచి జాతి రక్షణ చేపట్టాలని వాంఛించాడు. స్వామి ఖడ్గాంశలో ఆయన జన్మించడం ఆయన పూర్వజన్మ వరివస్యయే కాదు మన జాతిజనుల పూర్వ జన్మ వరివస్య కూడాయని భావించవచ్చు.

అమ్మవారి దయ అన్నిటికీ అవసరమైన విషయం. అందుకే యీ శతకంలో కూడా కవి అమ్మవారిని గూర్చి పద్యాలు రచించారు.

**స్నేహదయాంతరంగ, జనసేవితయా యలమేలుమంగ ఆ**
**శ్రీహరి యంతరంగ, దరిజేరిన వారిని చూచినంతనే**
**స్నేహ తరంగ గంగ, జన జీవన చైత్యపథానుషంగ, మీ**
**రూహలుచేసి చెప్పినది ఓషధి వంటిది నందకాంశజా!**

**కంచర్ల గోపన్న దాశరథీ శతకం** వంటి పూర్వ శతక కవులప్రభావం యిటువంటి పలుపద్యాలపై కనిపించడం ఆచార్యుల వారి వ్యుత్పత్తికి నిదర్శనం.

కామేశ్వరీ మాతను ఆరాధించిన తెలుగుకవులు ఎందరో ఉన్నారు. **తిరుపతి వేంకట కవులంతటి** మహాకవులు కామేశ్వరీదేవి పై శతకాలను రచించారు. ఆ మార్గంలోనే కామేశ్వరస్వామిని తలచుకుంటూ **డా. పొత్తూరు సుబ్బారావు** గారు **'ఇష్టకామేశ్వర'** శతకాన్ని రచించారు. తల్లిని తలుచుకున్నట్లు తండ్రినీ తలచుకొని ప్రధాన కారణం తమ ఊళ్ళో ఆస్వామి కొలువై ఉండడమే. ఆ స్వామిని వర్ణిస్తూ శివపంచాక్షరీ మంత్రప్రాశస్త్యాని జోడించి పద్యాలు వ్రాశాడు కవి.

**నాదాధ్వంబున పెన్వెలుంగునయి, నానాదుష్కృతి ఛ్ఛేదమై**
**వేదాధార పరత్వమై, శివమునై, విజ్ఞాన పూర్ణంబునై**
**బాధల్ దీర్చెడు నామరాజమగు నీ పంచాక్షరీ మంత్రమున్**
**సాధింపన్ దొరకొన్న జాలునట ఈశా! ఇష్టకామేశ్వరా!**

నేటి అస్తవ్యస్త వ్యవస్థలోని కొన్ని విషయాలను స్వామి వారికి తన పద్యాల ద్వారా నివేదించడం ఈ శతకంలో చూడవచ్చు.

**ఓస్వామీ! గనరావె నేడు భువిలో 'ఓట్లం' దగా నాయకుల్**
**మాసామీప్యము చేరి యాశయములే మా ప్రాణమంచేవియో**
**మూసంబోసిన మాటలాడి మముపెన్మోసమ్ముపాల్జేయగా**
**వాసిం గూర్చెద వేల వారికిల శర్వా! ఇష్టకామేశ్వరా!**

అంటూ ప్రజాస్వామ్యంలో ప్రధానభాగమైన 'ఓట్ల'ను గురించి నాయకులు చేసే మోసాలు బట్టబయలు చేస్తూ స్వామికి విజ్ఞాపన చేసుకోవడం విశేషం. అట్లాంటి వారి విషయంలో మీరు సరైన రీతిలో స్పందించడం లేదన్న భావాన్ని కూడా అభ్యర్థన రూపంలోనే విమర్శించిన తీరు ఆకట్టుకుంటుంది.

అవధాన రంగంలో పేరుప్రఖ్యాతులు పొందిన సంస్కృతాంధ్ర భాషావిజ్ఞులు **డా. ఇందారపు కిషన్‌రావుగారు** సంస్కృత మహాకవి కాళిదాసు **'ఋతుసంహారము'**ను తెలుగులోకి అనువదించిన విద్వత్కవి. **'వసంత సుమనుస్సులు'**, మొదలైన రచనలతో తెలుగు సాహితీ ప్రపంచానికి చిరపరిచితులైన **డా. ఇందారపు కిషన్‌రావు** శక్తివంతమైన

**'శ్రీనివాస'** శతకాన్ని రచించారు. కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ శ్రీనివాసునిపై అపారభక్తి ప్రపత్తుల్ని తన శతకంలో ప్రదర్శించాడు. ప్రతిభావంతమైన శక్తియుక్తులతో, పాండిత్య ప్రకర్షతో రచించిన పద్యశతము ఈ శతకము.

**దుష్టక్ష్మావరఖండనోద్ధతి లసద్దుర్వారదోర్దండు, ను**
**త్కృష్టస్వీయ గుణైక తోషిత గురున్, దివ్యప్రభావోన్నతున్,**
**శిష్టాచారు రజస్తమో గుణయుగ శ్లిష్టావతారున్ గృపా**
**వృష్టిన్, భార్గవు గొల్తు నిన్ పరశుధారిన్ శ్రీనివాస ప్రభూ!**

సాధారణంగా విష్ణుపరమైన శతకాలలో దశావతార వర్ణన కనిపిస్తూ ఉంటుంది. ఆ వరుసలో పరశురామావతారాన్ని వర్ణించిన ఈ పద్యంలో ఆ స్వామి పరశువంతటి పదునైన సమాసాలు, ప్రాసలు ప్రయోగించడం **డా. కిషన్‌రావు** గారి ప్రతిభకు నిదర్శనం.

**డా. కిషన్‌రావు** గారి సంస్కృత పాండితీగరిమ సహృదయుల అంతరంగాల్ని అమితంగా ఆకట్టుకుంటుంది. ఆయన పాండిత్యశక్తికి ఆయన పద్యాలే సాక్ష్యాలు. మొత్తం పద్యాన్ని సంస్కృతంలోనే సాగించి చివరగా తెలుగుపదం తగిలించే పూర్వ కవుల మార్గం యీ శతకంలో పలుచోట్ల కనిపిస్తుంది.

**శ్రీదేవీప్రియవల్లభస్య, కరుణాసింధోః, కలిధ్వంసినో,**
**భూదేవాలయ సంస్థితస్య, వకుళాపుత్రస్య, పద్మావతీ**
**పాదోత్పీడన కౌతుకస్య, విబుధైర్భక్తైశ్చ వంద్యస్య, తే**
**పాదౌ నౌమ్యలివేలుమంగవర! దేవా! శ్రీనివాసప్రభూ!**

వంటి పద్యాలు యీ శతకప్రామాణ్యాన్ని పెంచిన గొప్ప పద్యాలు. **డా. ఇందారపు కిషన్‌రావుగారి 'శ్రీనివాస' శతకం** ఆయన రచనలలో మణిమకుటం.

శ్రీరాముని దయచేత పాండిత్యం పొందినట్లు విశ్వసించే కవిపండితులు తెలుగు సాహితీప్రపంచంలో ఎందరెందరో ఉన్నారు. పలువురు శతక కవులు కూడా మనకు కనిపిస్తారు. అటువంటి తెలుగు శతక కవులలో **శ్రీమాన్ ఆరుట్ల భాష్యాచార్య** ఒకరు. సంస్కృతాంధ్ర భాషలలో అపార పాండిత్యం కలిగిన భాష్యాచార్య అనేక భక్తి శతకాలు, సామాజిక శతకాలు, పద్యగద్య రచనలు చేసి సాహిత్యంలో ఒక స్థాయిని సాధించుకున్న

విద్వత్కవి పండితులు. మానవ విజ్ఞానం సమాజ విధ్వంసాన్ని సృష్టిస్తున్న సందర్భంలో కలతచెందిన కవి, ఆయన రచించిన శతకంలో

**భయమునుబెంచె నిత్యమణుబాంబులు దారుణసృష్టి, లిప్తలో**
**లయమగునీ జగత్తు చటులంబగు మృత్యువిలాస కేళియై**
**నయమును వీడి, ధ్వంసరచనా చణుడయ్యెను మానవుండు చి**
**న్మయ! పెదబుద్ధి మానవె, మనస్విని జేయవెవాని రాఘవా!**

అంటూ ఆ రఘురాముణ్ణి ప్రార్థించడం ఆయనలోని మానవత్వానికి గొప్ప ఉదాహరణం. శతకంలో ఎన్ని ఆధునిక భావాలనైనా చక్కగా ఇమిడించవచ్చు నన్నదానికి ఈ పద్యమే ఒక నిదర్శనం.

ఇవ్వాళ్టి చదువుల చివరిలక్ష్యం ఏదో అందరికీ తెలిసిందే. అయితే చదువు సంస్కారాన్ని, సమాజంపట్ల నిబద్ధతను పెంచే దిశగా సాగాలన్న గాఢమైన కాంక్ష కవికి ఉండటం కారణంగా

**చదువులుతొల్లి నీచరణ సన్నిధిజూపెడు త్రోవ లిప్పుడా**
**చదువులు నేర్పువారు బలుసాకున కన్న విహీనులైరి, మా**
**చదువులు లక్ష్యభూమి సుఖసాధనమై, పరదేశ విద్యలే**
**కుదురుగ నిల్చె, సంపదల కోసరమే బదులాయె రాఘవా!**

అంటూ చెప్పాడు. విద్యావిధానం విదేశీ వ్యామోహాన్ని పెంచుతూ ప్రయాణిస్తుంది. మానవ సంబంధాలు మృగ్యమైపోతున్నాయి. మనిషి కరుడుగట్టిన స్వార్థంతో చదువు విలువను దిగజార్చుతున్నాడు. అందుకే ఆ భావాలనుండి మానవులను కాపాడమని స్వామిని అర్థిస్తున్నాడు. తన వేదనను, సంఘం విషయంలో తనకున్న ఆలోచనలకు **శ్రీమాన్ భాష్యాచారుల** వారు తన శతకాలలో చిత్రీకరించడం వారి ప్రత్యేకత. కేవలం తనకు మాత్రమే సంబంధించిన భక్తితో బాటు ఇటువంటి సామాజికాంశాలను కూడా సృజింఅనేక పద్యాలుచడం అనేది శతక సాహిత్య ప్రభావమే.

అవధానం తెలుగువారికి స్వంతంగా అబ్బిన ప్రత్యేక ప్రక్రియ. వందల యేండ్లుగా యీ రంగంలో విఖ్యాతి నార్జించిన కవి సత్తములు తెలుగు కవిత్వ వైతాళికులై నిలిచారు. ఈనాటికీ తన ప్రభను కోల్పోని ప్రక్రియ అవధానం. ఆ రంగంలో నిరంతరం

కృషి చేస్తున్న ప్రముఖులలో **డా. రాళ్ళబండి కవితాప్రసాద్** ఒకడు. నిత్య ప్రయోగ శీలతతో తన సృజనాత్మక సాహిత్యాన్ని ప్రకాశింపజేస్తున్న **డా. కవితాప్రసాద్** మూడు గొప్ప శతకాలను కూడా అందించాడు. **'కాదంబిని', 'సప్తగిరిధామ! కలియుగ సార్వభౌమ!', 'భద్రకాళీ శతకం'** ఇవి మూడూ మూడు ప్రయోగాత్మక శతకాలు కావడం ఒక ప్రత్యేక విశేషం

**'సప్తగిరి ధామ! కలియగు సార్వభౌమ!'** శతకం సీసపద్యాలున్న శతకం. తెలుగు శతకసాహిత్యంలో సీస పద్యాల శతకాలకే ఒక ప్రత్యేకత ఉంది. **నరసింహాశతకం, ఆంధ్రనాయక శతకం, రామలింగేశ శతకం, వేణుగోపాల శతకం, కుక్కుటేశ్వర శతకం, సింహాద్రి నారసింహ శతకం** యీ సీస పద్యాల శతకాలన్నింటిలోనూ దేని ప్రత్యేకత దానికే ఉంది. అదే మార్గంలో **డా. ప్రసాద్** శతకంలోనూ అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. ఆ శతకంలో ప్రయోగాలు తదనంతర శతకకర్తలకు మార్గదర్శకాలు.

**డా. రాళ్ళంబండి** రచించిన **'కాదంబిని'** ఆ అమ్మల గన్న యమ్మయైన **"త్రిపుర సుందరి"**ని స్తుతిస్తూ అందించిన శతపద్య కావ్యం. ఇది ప్రయోగాలపుట్ట. **'త్రిపుర సుందరిమాకు ప్రసన్నుదెయ్యెడిన్'** అనే మకుంటంతో అలంకృతమైన ఇది. పద్యకృతి వేగవంతమైన ధారాశుద్ధితో 108 శక్తులుగా అమ్మను ప్రసన్నం కమ్మని కోరడం ఈ పద్యాల్లో ప్రత్యేకత. సంప్రదాయాన్నీ, సైన్స్‌నీ మేళవించి చూపిన ఈ శతకంలో అక్షరాన్ని జీవాక్షరంగా ప్రయోగించి, కవి కృతకృత్యుడై అమ్మవారి కృపకు పాత్రుడైనాడు.

**అగసుత భావనా బలసమన్వితమై, మృదు వాగ్విలాసమై**
**నిగమ పికాంగనారవ వినిర్గత తాళలయావధానమై**
**సుగమముదాత్త భావనల శోభనమై రసమండితమ్ముగన్**
**సొగసుల 'పద్యమై' త్రిపురసుందరి మాకు ప్రసన్నమయ్యెడిన్**

అమ్మవారిని **'పద్యం'**గా ప్రసన్నం కావాలనికోరడం ఒక కొత్త ఆలోచన. రసభరితమైన, భావసంయుతమైన, మృదువాగ్విలాసంతో కూడిన **'పద్యం'**గా అమ్మను సాక్షాత్కరింపజేసిన **'కాదంబిని'** ఆధునిక పద్యకావ్యాల మణిమకుటం. 'చక్రబంధం'లలో ఒక పద్యం కలిగి ఉండడం ఈ కావ్యంలో మరో విశేషం.

వరంగల్లు భద్రకాళి పిలిస్తే పలికేదేవత. ఆమె సమక్షంలో ఆశువుగా **'ఏకదిన**

**శతక ధార'** కార్యక్రమంలో శతకాన్ని చెప్పి మరో ప్రయోగం చేసిన కవి **డా. రాళ్ళబండి కవితాప్రసాద్. 'వరంగల్ పాలికా! కాళికా!'** అని ఎన్నుకున్న శతక మకుటంలోనే ఒక ప్రత్యేకత ఉండే విధంగా చూచుకున్నాడు. దీనిలో **'ంగ'** కారం యతిస్థానం కావడమే ఒక ప్రత్యేకత.

**శ్రీమన్మంగళకారిణీ చరణరాజీవ ద్విరేఫంబునై**
**ప్రామాణ్యాత్త విశిష్ట పద్య శతక ప్రాయంబుగా మ్రోయగా**
**సామర్థ్యాంచిత భావజాలయుతమౌ సాహిత్య సౌహిత్య ప్ర**
**జ్ఞామాహాత్మ్యము నందజేయవె వరంగల్ పాలికా కాళికా!**

అంటూ ఆశువుగా ప్రారంభించిన ఈ శతకంలో శ్రోతల కోరికపై దశమహావిద్యలు, అష్టాదశ శక్తి పీఠాలు, సమకాలీన సామాజిక సమస్యలు వంటి అనేకాంశాలు చోటుచేసుకున్నాయి.

స్వయంగా ద్విశతావధానియైన **డా. రాళ్ళబండి కవితాప్రసాద్** వచన కవిత, గేయ కవితవంటి కవిత్వాలలో పలురచనలందించినా, అవధానవిద్యపై ప్రామాణికమైన పరిశోధన చేసినా, కవిగా యీ శతకాల్లో చూపిన ప్రతిభ అనన్యసామాన్యం. గొప్ప భావనాబలం, సుందర శైలీ నిర్మాణం **ప్రసాద్** శతకాల ప్రత్యేకత.

గణపతి విఘ్ననివారకుడన్నది భారతీయుల ప్రగాఢవిశ్వాసం. ఆయన తత్త్వాన్ని అందమైన కందాల 'విజయ గణపతి' శతకంగా అందించిన యువ కవి **డా. ఎన్.వి.ఎన్.చారి.** సంప్రదాయరీత్యా విశిష్టాద్వైత సిద్ధాంతానుయాయియైనా అసమాన భక్తి ప్రపత్తులతో ఆ గణాధిపతికి పద్యపుష్పార్చన చేసిన పద్యకవి **డా. చారి.**

చతుర్యుగాలలో వినాయకుని రూపాలను గురించి, ఆయన మూషకవాహన తత్త్వాన్ని గురించి, ఆయనకున్న నామ ఔచిత్యాలను గురించి ఈ శతకం చెప్పింది. గణపతిని గురించి పురాణాలు ఏమని ప్రవచించాయో చెప్పే సందర్భంలో

**పార్వతి మోహమ్మందగ**
**పార్వతి పతి వాని గాంచి వక్రుని జేసెన్**
**సర్వమ్మును వికృతమ్మై తల**

**వేర్పడి కరివదనమయ్యె విజయగణపతీ!** అని వరాహపురాణాంతర్గత కథలోని **'కరివదనుని'** వృత్తాంతం జ్ఞప్తి చేశాడు. ఆయన రూపాన్ని గురించి విశ్లేషిస్తూ

**ఆకాశమె నీ రూపము**
**మా కోసమె దాల్చెనయ్య మహిమాన్వితమై**
**మా కామిత వరదుడ వీ**
**వే, కరుణామూర్తివయ్య విజయగణపతీ!** అని గణపతిలోని ఆకాశతత్త్వాన్ని స్ఫురింపజేశాడు.

ఏ కార్యక్రమమైనా నిర్విఘ్నం కావాలన్న కాంక్షను సంపూర్ణంగా నెరవేర్చే దైవం గణపతి. ఆయన తత్త్వాన్ని అన్ని కోణాలలో నుంచి ఈ **విజయగణపతి** శతకం ఆవిష్కరించింది.

సమాజానికి సజ్జనుని అవసరం ప్రతినిత్యం ఉంటుంది. అందుకే పూర్వం నుండీ కవులు మనిషి సుజనుడై వెలగడానికి అవసరమైన మానవధర్మాలను తమ రచనల ద్వారా బోధిస్తూనే ఉన్నారు. **భర్తృహరి** మొదలుకొని అన్ని కాలాల కవులు ఈ పనిని నెరవేరుస్తూనే ఉన్నారు. సుజన రహితమైన సమాజం పదికాలాల పాటు నిలబడలేదు. పతనం దిశగా నడుస్తుంది. కూలిపోయే అటువంటి లోకాన్ని రక్షించే శక్తి సుజనులకే ఉంది. ఆ దృక్పథంతోనే **శ్రీ యెన్నం రుక్మాంగదరెడ్డి** తన **'సుజన'** శతకాన్ని సమాజానికి అందించాడు.

మానవ సంబంధాలు మృగ్యమౌతున్న ఈ దశలో తల్లిదండ్రుల పట్ల పిల్లల ప్రేమలు పల్చబారిపోతున్నవి. తల్లిదండ్రులను దైవంగా భావిస్తూ జీవించాలని వారిని పూజించడమే నిజమైన పూజ అని చెబుతూ

**తల్లిదైవమనుచు దలపక మదిలోన**
**రాతిగుడులు వెదుక జూతురేల?**
**ఏలపరుగులిడుదు రెండమావుల వెన్క?**
**నిజము చెప్పుచుంటి సుజనులార!** అని బోధించాడు.

విద్యావంతులు బాధ్యత మరిచిపోవడం సమాజానికి శాపం. ఆ భావాన్నే

**చదువుకొన్న వారు చతికిలబడినారు**
**పలకబట్టనోళ్ళు ప్రభువులైరి**
**పదవిదొరకువెనక చదువుతో పనియేమి?**
**నిజము చెప్పుచుంటి సుజనులార!** అంటూ చెప్పి, ఆ పరిణామాల విషయంలో జరిగే అనర్థాలకు మనదే బాధ్యత అని సూచన చేశాడు. **'వేమన్న'** మార్గం ఎన్నుకొని చెప్పన **'సుజన'** శతకం శతక శాఖకు మణిమకుటం.

శివుడు పలుప్రాంతాల ప్రజలు ఆరాధించే ప్రత్యక్షదైవం. ఆయనను సేవించడం పూర్వజన్మ సుకృతంగా భావించే కవులు పలువురున్నారు. తమ తమ ప్రాంతాలలో కొలువైయున్న ఆ ఫాలాక్షుణ్ణి సేవించుకునే క్రమంలో **డా. మోత్కూరు మాణిక్యరావుగారు 'శ్రీ ఫణిగల రామలింగ'** శతకాన్ని రచించి ఆ శివుణ్ణి పద్యాలతో పూజించారు.

**కాలమామారె మనుజుల గతులు మారె**
**రిత్తకావ్యాల దవిలె మా చిత్తమెల్ల**
**నిన్ను స్మరియింప ధన్యుద నిముసమేని**
**రమ్యగుణ సంగ! ఫణిగల రామలింగ!**

కాలం మారింది నిజమే. కాని మానవుల వృథాప్రయాసలు ఎక్కువై సమాజం శిథిలమైపోయే దశగా పయనిస్తూ ఉంది. మనుషుల అంతరంగాల్ని మలినరహితం చెయ్యాల్సిన కావ్యాలు ఆ పని చెయ్యకుండా ఉన్నాయి. కాని అటువంటివే జనులను ఆకర్షించి మనిషిలో పెరగాల్సిన దైవ భావాలను అడ్డుకుంటున్నాయన్న వేదనను కవి వ్యక్తీకరించారు.

**పరగ ధనవంతుడౌవాని పజ్జ జేరి**
**యాప్తునింబోలె నేహౌ మాయలను జేసి**
**ముంచు వైరము నేర్చెను భుక్తికొరకు** అంటూ లోకంలో జరిగే మాయలను అక్షరబద్ధం చేశాడు **డా. మాణిక్యరావు.** అనేకమైన సామాజికాంశాలను, భక్తిని రంగరించి రచించిన ఈ శతకం మన అంతరంగాల్లో బలమైన ముద్రవేయగలిగిన స్థాయిగల రచన.

**శ్రీశ్రీ** ఆధునిక కవిత్వానికి ఆద్యుడన్న సత్యం అందరూ అంగీకరించిన సత్యం. కవులు, విమర్శకులు లెక్కలేనంత మంది **శ్రీశ్రీ** అభిమానులు సాహిత్యరంగంలో ఉ

న్నారు. తమ అభిమానాన్ని బహిర్గతం చేస్తూ ఆయన రచనల్ని పరిశీలించిన విమర్శకులకు, పరిశోధకులకు కొదవలేదు. కాని **శ్రీశ్రీ**ని గురించి శతకమే రచించిన కవులు **డా. గుమ్మా సాంబశివరావు, డా. కావూరి పాపయ్యశాస్త్రి** వంటి ఒకరిద్దరే కనిపిస్తారు.

**లోకంబును చూడని కవి**
**ప్రాకటముగ చెప్పలేదు పచ్చినిజంబుల్**
**లోకంబును చదివినపుడె**
**పాకంబగు కవిత పుట్టు పసిడిగ శ్రీశ్రీ!**

అని **డా. సాంబశివరావు** కవికి లోకవృత్త పరిశీలన అధికంగా ఉండాలన్నారు. కవిత్వ సృష్టిలో అవసరమైన అంశాలతో లోకాన్ని అధ్యయనం చెయ్యడం అత్యవసరం. అది శ్రీశ్రీలో పుష్కలంగా ఉంది. దాన్ని భూమికగా గ్రహించి కవి యీ సూచన చేశాడేమో!

**జనులను జనులే ఏలుట**
**యనగ ప్రజాస్వామ్య రీతి యందురు గానీ**
**ధనికుల పెత్తనమెసగెను**
**కన, పేదలకు లేదు ప్రభుత కథయిది శ్రీశ్రీ!**

అనే యీ పద్యంలో నేటి లోకంపోకడ స్పష్టమైంది. ప్రజాస్వామ్యం యీ రోజుల్లో ధనవంతుల పెత్తనాల కారణంగా మేడిపండులా మారిన విధాన్ని బహిర్గతం చేశారు **డాక్టర్ సాంబశివరావు.**

నేటి సమాజపు తీరు తెన్నులను, నేటి జనుల ఆలోచనలను అంచనా వేసిన **శ్రీశ్రీ** శతకం నేటి చరిత్రకు అద్దం పట్టిన కృతి.

రామచంద్రుని కథ కడు రమణీయం. అందుకే భారతీయులందరూ రామాయణాన్ని ఎంతగానో ఇష్టపడతారు. అన్ని భాషాసాహిత్యాల వాళ్ళు తమ సాహిత్య ప్రక్రియలలో రామకథకు పెద్దపీట వేశారు.

తెలుగు కవులు, జానపద గాయకులు, ఇతర ప్రక్రియలు సృజనాకారులు అందరూ రామకథా పరిమళాన్ని పంచిన వారే. శతక కవులు కూడా ప్రారంభకాలం

నుండి నేటివరకు కొన్ని వందల శతకాలలో రామ కథనే పునాదిగా గ్రహించారు.

కీ.శే. తోకచిచ్చు లక్ష్మీనరసరాజు, తోకచిచ్చు శ్రీకృష్ణ కుసుమ కుమారి దంపతులు రామజననం మొదలు సీతారాముల కల్యాణం వరకు ఉన్న కథను వస్తువుగా గ్రహించి సరళసుందరంగా 'దశరథ రామ' శతకాన్ని రచించారు. ఈ దంపతులు ఇద్దరూ కవులే. అందుకే జంట కవిత్వం చెప్పారు.

చక్కని సరళభాషలో అందమైన గీత పద్యాల్లో సాగిన ఈ శతకంలో పద్యాలు మిక్కిలి సుబోధకాలు.

**హంసనడకల సీతమ్మ హాయినొందె**
**కన్య పరువెత్త పావడా కదలసాగె**
**కలాగజ్జెలు కదలాడ ఘల్లుమనియె**
**రామ రఘురామ దశరథ రామ రామ**

ఇటువంటి మనోహర పద్యములు ఈ శతకంలో చోటుచేసుకున్నాయి.

జననం మొదలు కల్యాణం వరకూ కొనసాగిన ఈ శతకంలో కైకేయి పాత్రను విశిష్టంగా మలచారు.

**యాగరక్షణ గావించు యవనివిభుడు**
**మనకు రామునివదలిన మంచి దనుచు**
**తలచి తనలోనకైకేయి తల్లడిల్లె**...నని చెబుతూ ఆమె అంతరంగాన్ని ఆవిష్కరించాడు. తెలుగు శతక సాహిత్యంలో యీ రచయితృ దంపతుల స్థానాన్ని శాశ్వతం చేసిన శతకం 'దశరథరామ శతకం'.

లోకానికి సరియైన బాటను చూపించడం సాహిత్యంపు యొక్క ప్రధాన ధ్యేయం. ఆ పనిని శతక సాహిత్యం చిత్తశుద్ధితో చేసి చూపింది.

**డా.సి.వి. జయవీర రాజు** రచించిన **'చారుచర్య'** ఒక నీతి శతకం. ఆయన రచించిన **'కొండగట్టు హనుమ'** భక్తితోబాటు నీతిని కలిపి చెప్పిన శతకం

**సౌఖ్యమొదవి నంత సంతోషమే గల్గు**
**బాధగలుగ దిగులు బడుచునుంద్రు**

**రెండు సమముగ జూచువారే ఘనులు**

**కొండగట్టు హనుమ! అండనిలుమ!** అని రచించిన **డా. రాజుగారు సుభాషిత పద్యశతకాన్ని** ఈ మార్గంలోనే రచించారు.

**డా. తిరువరంగం సుధాకర్** రచించిన **'తోగు వెంకటేశ్వర శతకం', 'సరస్వతీ శతకం' 'శ్రీసాయి శతకం'** ఉత్తమమైన భక్తిశతకాలు. పద్య నిర్మాణంతో పటిష్ఠమైన శతకాలు రచించిన **డా. సుధాకర్** గారు తమ **సరస్వతీ శతకంలో**

**రాసభమట్టులంబెరిగి రాలను గొట్టిన చావులేక**
**గోసలు బెట్ట బుట్టితివి కూడును దండుగటంచు తల్లులే**
**దోసము లేని మమ్ములను దూషణజేయుచు నున్నవారు నీ**
**దాసుల యొక్క గోస యిది ధాతృసతీ! సుదతీ! సరస్వతీ!**

అంటూ నేటి పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు తమకు నచ్చిన చదువులే తమ పిల్లలు చదవాలని ఆశిస్తుంటారు తప్ప పిల్లల అభిరుచి తెలుసుకొని వారు ఇష్టపడే చదువుల విషయం గురించి పట్టించుకోవడం లేదు. దానివల్ల ఆ చదువులలో తక్కువ మార్కులు తెచ్చుకున్న పిల్లలు తల్లిదండ్రులతో ఎదుర్కొంటున్న ఛీత్కారాలకు సంబంధించి ఆ చదువుల తల్లితో నివేదించుకుంటున్న యిట్లాంటి పద్యాలకు వీరి శతకాలు ఆకరములు.

# చివరగా...

**శతకం ఒక కిరణం**

**శతకం ఒక ఆరిపోని వెలుగు**

**శతకం ఒక కరదీపిక**

ఏ విధంగా నైన శతకాన్ని సంభావించుకోవచ్చు. పుట్టిన నాటి నుండి ప్రతిభామూర్తుల చేతులలో వృద్ధి చెంది, శాఖోపశాఖలుగా విస్తరించి ప్రఖ్యాతి చెందిన విశేషమైన ప్రక్రియ శతకం.

ఆనాటి నుండి ఈనాటి వరకు పద్యాన్ని శక్తిమంతం చేసిన ఘనమైన ప్రక్రియగా అమితఖ్యాతిని అందుకున్న శతకం చిరంజీవి. ఇది పోయినన్ని పోకడలు సాహిత్యలోకంలో మరే ప్రక్రియకు లేదన్నమాట వాస్తవం. పద్యాన్ని పునాదిగా చేసుకున్న శతకం పద్యం విషయం మరచిపోకుండా నేటికీ మనుగడ సాగిస్తున్నది.

సాహిత్యం యీ వెయ్యేండ్లలో ఎన్ని మార్పులకు లోనైందో సాహిత్య ప్రియులందరు ఎరిగిన సత్యమే. అయితే అన్ని భావధారలను కూడా మోస్తూ శతకం ఎదిగింది. కాని పద్యాన్ని మాత్రం అదివదలలేదు. అప్పుడప్పుడు ప్రయోగాల నిమిత్తం ఇతర రూపాలను ఆశ్రయించినా ప్రధాన స్రోతస్వినిగా మాత్రం పద్యాన్నే గ్రహించింది. ఇదొక ప్రత్యేకత.

శతకం గొప్పదనాన్ని చెప్పడానికి ప్రజలే ప్రధాన సాక్షులు. ప్రజల నాలుకలే ప్రమాణాలు. నిరంతరం ప్రజల నాలుకలపై నాట్యం చేసే మాటలు శతక పద్యాలే. ప్రముఖ కవి **కీ.శే. గుఱ్ఱం జాషువా**గారు అన్నట్లు **'కవియు జీవించు ప్రజల నాలుకల యందు'** అన్న మాటలు అక్షరాలా శతక కవికి సూటిగా వర్తిస్తాయి అనడంలో ఎలాంటి అనుమానానికి ఆస్కారం లేదు. ఒక **వేమన్న**, ఒక **బద్దెన్న**, ఒక **గోపన్న**, ఎవరైనా సరే వందల యేండ్లు నిలిచి పోవడానికి వారి శతకపద్యాలే ప్రధాన కారణాలు.

ప్రసిద్ధ కవులైన **పాల్కురికి, బమ్మెరపోతన, ధూర్జటి** వంటి మహాకవులు తమ

మహాకావ్యాలతో బాటు గొప్ప శతకాలు కూడా అందించి స్థిరకీర్తిని సాధిస్తే కేవలం శతకాలు మాత్రమే రచించి మహాకవుల వరుసలో నేటికీ మన గుండెల్లో నిలిచిపోయి శతక కవులు చిరయశస్సును అందుకున్నారు. శతక సాహిత్య చరిత్రను సమగ్రంగా పరిశీలిస్తే ఇటువంటి ఆశ్చర్యకర విషయాలు అనేకం మనదృష్టికి వస్తాయి.

ప్రాచీన ఆలంకారికులు ఎందరెందరో తమ అలంకార శాస్త్రాలలో అనేక కావ్యాలను ఉదహరిస్తూ ఉంటారు. వారు పలు తావుల్లో ప్రసిద్ధ శతకాలను కూడా ఎన్నో ఉదాహరించారు. **'అప్పకవి'** తన **'అప్పకవీయం'లో** **'మరున్నందన'** శతకం లోని

**కోపాటోపము కుప్పిగంతులు నిజాకుంఠీభవచ్చౌర్య రే**
**ఖాపాండిత్యమయారె! నీకును నమస్కారంబు లంకాపురీ**
**పాపగ్రంథి కులాంగనా కూచతటీపైఠా పటగ్రాహ బా**
**హాపాటచ్చర రామదాస తవదాసో2హమ్మరున్నందనా!**

అన్న పద్యాన్ని ఉదహరించాడు. మహాకావ్యాలు, మహాప్రబంధాలలోని ఏ పద్యానికీ తీసిపోని పద్యనిర్మాణం ఇందులో ఉంది. ఇది శతక ప్రాముఖ్యానికి ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. ఆలంకారికులు మహాకావ్యాలతో సమానంగా గౌరవించడం వెనుక శతకం శక్తిసామర్థ్యాలు దాగి ఉన్నమాట వాస్తవం.

ఆధునిక కాలంలో శతకం, శతక రచన కొంతమేర పల్చబడినా, ప్రతిభావంతులైన కవిపండితుల కలాలలో మాత్రం దాని శక్తి రెండింతలు అవుతూ వస్తూనే ఉంది. కేవలం భక్తికే పరిమితం కాకుండా అనేక ఇతరాంశాలను కూడా తనలో గర్భీకరించుకున్న శతకం నేటికీ నిత్యనూతనంగా నిలిచి ఎదిగిన ప్రక్రియ.

కాలానుగుణమైన భావాలను, ధర్మాలను పొదిగించుకోగల శక్తివంతమైన ప్రక్రియ శతకం. అందుకే **'ఆంధ్ర పద్యకవితా సదస్సు'** వంటి ప్రసిద్ధ సంస్థలు శతక రచనను ప్రోత్సహిస్తున్నాయి. పద్యం వారికి ప్రధానం కావచ్చు. శతకానికి పద్యం ప్రధానం కనుక వారు ఆ బాధ్యతను తమ భుజస్కంధాలపైకి ఎత్తుకున్నారు. ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలు ఎన్నో పద్యసాహిత్య పురస్కారాలకు శతకాలను ఎన్నుకోవడం కూడా శతక ప్రక్రియ విశిష్టతను తెలుపుచున్నది.

సరదాగా కవిత్వాన్ని చెప్పడం, సరసంగా కవిత్వాన్ని చెప్పడం, మితమైన శృంగారాన్ని కవిత్వంగా చెప్పడం శతకానికి సాధ్యమైనంతగా మిగతా ప్రక్రియలకు సాధ్యంకాకపోవచ్చు. **డా. ముకురాల రామారెడ్డి**గారు సరదాగా **'పుట్టగోచిలింగ! పూలరంగ!'** అనే మకుటంతో ఒక సరసశృంగార శతకం రచించారు. సున్నితమైన శృంగార భావాన్ని

**భాగ్యవంతురాలు బంగారుహారాలు**
**జూపు రీవిపైట దాపు గొనదు**
**నిక్కు కుచములు వీడి పక్కకెవ్వదుజూచు**
**పుట్టగోచి లింగ! పూలరంగ!** అని చెప్పిన వ్యాఖ్యాన నిరపేక్షమైన యీ శతక పద్యం మనోహరమైన మధుర భావ సమన్వితంగా కావ్యస్థాయిలో భావాన్ని అందించింది.

ప్రశస్తమైన తెలుగు శతకసాహిత్యాన్ని గురించిన పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. **చాగంటి శేషయ్య, ఆరుద్ర, ఖండవల్లి లక్ష్మీరంజనము, దివాకర్ల వెంకటావధాని** వంటి పండితులు తమ తమ సాహిత్య చరిత్రల కొరకు శతకాలను గురించి కూడా కొంత పరిశోధిస్తే **రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, వంగూరి సుబ్బారావు, వేదము వేంకటకృష్ణ శర్మ** వంటి పరిశోధకులు శతకాలను గురించి శతక కవులను గురించి ప్రత్యేక పరిశోధనలు చేశారు. **డా. కె. గోపాలకృష్ణరావు** గారు మాత్రం విశ్వవిద్యాలయ స్థాయిలో తమకన్నా పూర్వం ఉన్న వివిధ పరిశోధనలను పరిశీలించి ఆనాటికి సమగ్రమైన ఒక బృహద్గ్రంథాన్ని తెలుగు సాహితీ ప్రేమికులకు అందించిన మహా పరిశోధకులు. నేటికీ అదే గొప్ప ప్రామాణిక పరిశోధన గ్రంథం.

తెలుగు సాహిత్యవిహాయసంలో అప్పటికీ ఇప్పటికీ, ఎప్పటికీ, ఎల్లప్పటికీ వెలుగులు చిమ్మే గొప్పదనం శతకానికి ఉందన్నది నిర్వివాదమైన సత్యం. అంతటి శతకాన్ని ఇంత పరిమితిలో అందించడమనేది ఎంత కష్టమో అందరికీ తెలిసిన సంగతే. **'కొండఅద్దమందు కొంచెమై యుండదా!'** అని **వేమన్న** అన్నట్లు శతకం ఒక కొండ, దానిని అద్దంలో చూపించడమే మనం చేస్తున్న యీ చిరు యత్నం.

# సంప్రదించిన గ్రంథములు

| | |
|---|---|
| విన్నకోట పెద్దన | - కావ్యాలంకార చూడామణి |
| అప్పకవి | - అప్పకవీయం |
| పాల్కురికి సోమనాథుడు | - వృషాధిపశతకం |
| మల్లికార్జున పండితారాధ్యుడు | - శివతత్త్వసారము |
| వేమన | - వేమన పద్యములు |
| మారద వెంకయ్య | - భాస్కర శతకం |
| యథావాక్కుల అన్నమయ్య | - సర్వేశ్వర శతకము |
| బద్దెన | - సుమతి శతకము |
| పోతన | - నారాయణ శతకం |
| వీరబ్రహ్మేంద్రస్వామి | - కాళికాంబ సప్తతి |
| నరసింహ కవి | - కృష్ణశతకం |
| తాళ్ళపాక అన్నమయ్య | - వేంకటేశ్వర శతకం |
| గోగులపాటి కూర్మనాథకవి | - సింహాద్రి నారసింహశతకం |
| పోలిపెద్ది వేంకటరాయకవి | - వేణుగోపాల శతకం |
| కూచిమంచి తిమ్మకవి | - కుక్కుటేశ్వర శతకం |
| అడిదము సూరకవి | - రామలింగేశ శతకం |
| వడ్డాది సుబ్బరాయకవి | - భక్త చింతామణి శతకం |
| కవి చౌడప్ప | - కవి చౌడప్ప శతకం |
| కంచర్ల గోపన్న | - దాశరథీ శతకం |
| కాసుల పురుషోత్తమ కవి | - ఆంధ్రనాయక శతకం, |
| కరినారాయణాచార్యులు | - అమృతాంజన శతకం |
| త్రిపురనేని రామస్వామి చౌదరి | - ధూర్తమానవా! శతకం |
| నార్ల వేంకటేశ్వర రావు | - నార్లమాట శతకం |
| ముళ్ళపూడి సచ్చిదానంద మూర్తి | - యాదగిరి లక్ష్మీ నృసింహశతకం |
| చెఱువు సత్యనారాయణశాస్త్రి | - సుబ్బలచ్మి శతకం |
| పట్టాభిరామ కవి | - గువ్వల చెన్న శతకం |
| విశ్వనాథ సత్యనారాయణ | - మాస్వామి |
| శ్రీశ్రీ | - సిరిసిరిమువ్వ శతకం |
| దాశరథి | - అభినవ దాశరథీ శతకం |
| బోయిభీమన్న | - పిల్లీ శతకం |
| వైద్యం వేంకటేశ్వరాచార్యులు | - శతక ద్వాదశి |
| జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు | - రామలింగేశ్వర శతకం, బతుకమ్మ శతకం |

అక్కిరాజు సుందర రామకృష్ణ - 'శారదా!', 'శ్రీ శనీశ్వరా!', 'భీమన్నా!' శతకములు

కోవెల సంపత్కుమారాచార్య - అంతర్మథనం

కోవెల సుప్రసన్నాచార్య - పాంచాలరాయ శతకం

శ్రీలక్ష్మణమూర్తి - గోపికావల్లభా!

కండ్లకుంట కోదండరామాచార్య - నందకాంశజా!

ఇందారపు కిషన్‌రావు - శ్రీనివాస శతకం

కసిరెడ్డి వెంకటరెడ్డి - కర్మన్‌ఘాట్ ఆంజనేయశతకం

పల్లా రామకోటార్య - వెట్టివెంగళప్ప శతకం

ముకురాల రామారెడ్డి - పూలరంగ శతకం

మోత్కూరు మధుసూదన రావు - వెంకటేశ్వర శతకం

ఆరుట్ల భాష్యాచార్య - ఉపాసన (శత పద్య కావ్యం)

పొత్తూరు వేంకటసుబ్బారావు - ఇష్టకామేశ్వర శతకం

తిరువరంగం సుధాకర్ - సరస్వతీ శతకం

రాళ్ళబండి కవితాప్రసాద్ - కాదంబిని, భద్రకాళీ శతకం, 'సప్తగిరిధామ! కలియుగసార్వభౌమ' శతకం

యెన్నం రుక్మాంగద రెడ్డి - సుజన శతకం

ఎన్.వి.ఎన్.చారి - విజయగణపతి శతకం

గుమ్మాసాంబశివరావు - శ్రీశ్రీ శతకం

సి.వి.జయవీర రాజు - కొండగట్టు హనుమ శతకం

వరగొండ కాంతారావు - 'వినగనేర్తువ భాజపా', 'ఏలిక కొకలేఖ'

సురవరం ప్రతాపరెడ్డి - ఆంధ్రుల సాంఘిక చరిత్ర

దివాకర్ల వెంకటావధాని - ఆంధ్రవాఙ్మయ చరిత్ర

ఆరుద్ర - సమగ్రాంధ్ర సాహిత్యము

ఖండవల్లి లక్ష్మీరంజనము - ఆంధ్రసాహిత్య చరిత్ర సంగ్రహము

చాగంటి శేషయ్య - ఆంధ్రకవి తరంగిణి

కందుకూరి వీరేశలింగము - ఆంధ్రకవుల చరిత్రము

వంగూరి సుబ్బారావు - శతక కవుల చరిత్ర

వేదం వేంకటకృష్ణ శర్మ - శతక వాఙ్మయ సర్వస్వము

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ - వేమన

కె. గోపాలకృష్ణరావు - ఆంధ్రశతక సాహిత్య వికాసము, శతక సౌరభం, ఆంధ్రశతక వాఙ్మయము

జి. గిరిజామనోహరబాబు - శతకసమీరం

జి. గిరిజామనోహరబాబు (సంపాదకుడు) -శతకసాహిత్యం, సామాజిక నైతిక విలువలు

కండ్లకుంట కోదండరామాచార్య - వేదము - శతక మూలాలు (వ్యాసం)



# స్వవిషయం

తల్లిదండ్రులు : కీ.శే. గన్నమరాజు రామేశ్వరరావు
కీ.శే. గన్నమరాజు శకుంతలమ్మ

జన్మస్థలం : అలంపురము - మహబూబ్‌నగర్ జిల్లా

విద్యాభ్యాసం : 1. శ్రీవేంకటేశ్వర ప్రాచ్య కళాశాల, పాలెం
2. ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు

ఉద్యోగ ప్రస్థానం : 1978 నుండి 2009 వరకు వివిధ కళాశాలలో అధ్యాపకునిగా

ఉద్యోగ స్థలాలు : సత్తుపల్లి, ఖమ్మం, వర్ధన్నపేట, మహబూబాబాదు, హుజురాబాదు, హనుమకొండ.

వివిధ సెమినార్లలో సమర్పించిన పత్రాలు : 20

వివిధ వేదికలనుండి వివిధాంశాలపై ప్రసంగాలు : 150కి పైగా

సభలలో పాల్గొన్న ప్రాంతాలు : రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలు

గ్రంథ పరిచయాలు : 100కు పైగా. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో బహు సాహిత్య పత్రికలలో సమీక్షలు, సాహిత్య వ్యాసాలు

రచనలు : శతక సమీరం (వ్యాస సంపుటి), సాహితీసుధ (వ్యాస సంపుటి), పురస్కృతం (వ్యాస సంపుటి) మొదలగునవి.

సంపాదకత్వం : 1. రసహృదయ - 'సహృదయ' దశాబ్ది విశేష సంచిక
2. విశ్వారణి - సర్వవైదిక సంస్థానం - కరీంనగర్ రజతోత్సవ సంచిక
3. శతక సాహిత్యం - సామాజిక, నైతిక విలువలు (యు.జి.సి - సదస్సు ప్రత్యేక సంచిక)
4. కథకు శతమానం - 100 సం.ల కథకు సంబంధించిన వ్యాస సంపుటి.

దూరదర్శన్, హెచ్.ఎం.టి.వి. శ్రీ వేంకటేశ్వర భక్తి చానల్, ఈటివి, టి.వి.9 ద్వారా బహు కార్యక్రమాలు, వివిధ దృశ్య శ్రవణ మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష వ్యాఖ్యానాలు.

Blank Page

# ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు

* తెలుగు జాతి భాషా సంస్కృతులపై నేటి యువతరానికి ఆసక్తి కలిగించేలా ప్రణాళికలు తయారుచేయడం.
* ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక వేదికపై చేర్చి భాషా సంస్కృతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం.
* తెలుగుభాష ప్రపంచ భాషలతో సరితూగేలా అంతర్జాలంలో ఉపయోగించడానికి చర్యలు చేపట్టడం.
* తెలుగు పాలన, బోధన, ప్రసార మాధ్యమ భాషగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవడం.
* తెలుగు వారి జానపద, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలకు, ప్రచారానికి ప్రణాళిక రూపొందించడం.
* తెలుగు జాతి ప్రాచీనతలను, ప్రశస్తిని వెలుగులోకి తేవడం.
* తెలుగు జాతి చరిత్రపై, భాషపై గ్రంథాలు ప్రచురించి కొత్త పారిభాషిక పదాలు తయారుచేయడం.
* తెలుగు భాషను అభ్యసించే వారికి సరళమైన శైలిలో పాఠ్యగ్రంథాలు, బోధనోపకరణాలు తయారు చేసే ప్రణాళిక రూపొందించడం.
* తెలుగు నేలపై గల చారిత్రక, ఆధ్యాత్మిక స్థలాలకు, పర్యాటక కేంద్రాలకు ప్రాచుర్యం కల్పించడం.

తెలుగు భాష వికాసం　　　　తెలుగు సంస్కృతి ప్రకాశం

**దేశ భాషలందు తెలుగు లెస్స**